
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ　　　　సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
**కందర్ప రామచంద్ర రావు**
**డాక్టర్ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డాక్టర్ తుమ్మూరి**
**సి.వి. శ్యామల రావు**
**డి.వి.ఆర్. మూర్తి**



సంపుటి 9 - సంచిక 11
మార్చి 2009

**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD



సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722


## వీరవ్రతంగా మారాలి విశ్వాసం

ఓ పరమేశ్వరా ! నా కోరిక ఒక్కటే- నేను ఆపదలకు భయపడి పారిపోకూడదు, వాటిని ఎదిరించగలగాలి. ఆపదలో నీవు నన్ను ఆదుకోవాలని నేను ప్రార్థించడం లేదు. వాటిని ఎదుర్కొనే బలాన్ని ఇవ్వవలసిందని మాత్రమే నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. దుఃఖ సమయంలో నన్ను ఓదార్చవలసిందని నేను నిన్ను కోరను, ఆ దుఃఖంపై విజయాన్ని సాధించే శక్తిని ఇవ్వవలసిందని మాత్రమే ప్రార్థిస్తున్నాను.

కష్ట సమయంలో ఎవ్వరూ సాయపడకపోయినా నేను ధైర్యాన్ని కోల్పోకూడదు. మరొకరి సాయం కోరకూడదు. ఆ క్షణంలో నా మనోబలం తగ్గకూడదు. విషమఘడియలలో సైతం నేను దృఢంగా నిలవాలి. అనుక్షణం నీవు నాకు తోడుగా ఉన్నావని నేను భావించాలి. కష్టాలనూ, కడగండ్లనూ నవ్వులాటలుగా, వినోదాలుగా నేను పరిగణించాలి. నా మనస్సు గాలిలో తేలిపోవాలి- ఇదే నేను కోరేది.

నా ఆరాధ్య దైవమా ! నీపై విశ్వాసం ఎల్లప్పుడూ నా హృదయం అనే ఆలయంలో దీప శిఖలా అఖండంగా, నిర్విరామంగా వెలుగుతూ ఉండాలి. నా ప్రారబ్ధపు పెనుతుపానులూ, దారుణ పరిస్థితులూ, నా మనోవికృతులూ ఆ వెలుగును ఆరనివ్వకూడదు; కదలనివ్వకూడదు. విశ్వాసం అనే ఈ జ్యోతి అనుక్షణం నా అస్తిత్వంలో ఆత్మబలం అనే ఇంధనాన్ని, వివేకమనే వెలుగునూ వర్షిస్తూ ఉండాలి. ఈ విశ్వాసం నాలో యాచనంగా కాక- శక్తిగా మారాలి. బలహీనతగా కాక- ఆసరాగా మారాలి. తమోగుణంలో చిక్కుకుని, నీపై విశ్వాసాన్ని ఆడంబరంగా మార్చి- నేను కర్మకు దూరం కాకూడదు, కర్తవ్యం నుండి పారిపోకూడదు. ఎంత వ్యతిరేకత ఎదురయినా, ఎన్ని కష్ట నష్టాలు వచ్చిపడినా- నేను ఏమాత్రం లెక్కచెయ్యను. ఏమాత్రం చలించను. ఆపదలను చూచి ధైర్యాన్ని వదలను. సర్వస్వమూ కోల్పోయానని ఏడుస్తూ కూర్చునే బలహీనతను నాలోనికి రానివ్వను.

నేను అహంకారినీ కాకూడదు, సోమరినీ కాకూడదు. నన్ను నీ చరణాలకు సమర్పించుకుంటూ- నేను కోరుకునేది ఒక్కటే- జీవిత సంగ్రామంలో వీర యోధుడుగా నేను పోరాడాలి; నీపై విశ్వాసం అనే ఆయుధంతో ఆపదల వ్యూహాలను ఛేదించాలి, వాటిని పటాపంచలు చేయాలి.

ఓ పరమేశ్వరా ! కేవలం నీపై విశ్వాసం ఆధారంగా ఎందరెందరో సామాన్యులు చరిత్రను సృష్టించి గొప్పవారు అయ్యారు. మహత్తర విజయాలను సాధించారు. నా కోరిక ఇదే- నీపై విశ్వాసం నాలో సోమరితనాన్ని కాక, వీరత్వాన్ని నింపాలి, ఉద్రిక్తతను కాక, ధీరత్వాన్ని నింపాలి.


★★★

**తత్వ చింతనవల్ల లభించని జ్ఞానం పరిస్థితులతో పోరాడడంవల్ల లభిస్తుంది.**

3rd.....

## విషయ సూచిక


1. **సంపాదకీయం :** వీరవ్రతంగా మారాలి విశ్వాసం 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం**
మన సాంస్కృతిక గౌరవానికి వైభవాన్ని తెద్దాం 2
4. **వేద మంత్రం :** తియ్యని మాట ఒక కామధేనువు 3
5. **ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-21**
చిత్తశుద్ధికి సాధనం విగ్రహారాధన 4
6. **జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?** 5
7. **పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్ది-**
**2400 కోట్ల మంత్రజపం** 6
8. **వర్తమాన భారతం :** సమస్యలలో చిక్కుకున్న ప్రపంచం 7
9. **ముఖచిత్ర కథనం :** గాయత్రి - 24 శక్తులు 10
10. **ధారావాహిక : హనుమత్ కథామృతం-11**
హనుమంతుని మహిమాన్వితబాల్యం 12
11. **సంస్కృతీమూర్తి-గురుదేవులు**
ఋషి పరంపరకు వినూత్న జీవితాన్ని అందించిన యుగఋషి 14
12. **ధారావాహిక : భక్తి గాథ-16**
భక్తుని భావనలు-కర్తలు ప్రభువుకే అర్పించబడతాయి 16
13. **బోధకథ :** పరమహంసగా మారిన బాలుడు 18
14. **ప్రత్యేక వ్యాసం : రమణ జయంతి**
కంచిమీదుగా నా అరుణాచలయాత్ర-3 20
15. **ఆచరణలో ఆధ్యాత్మ :** మనస్సును అదుపులోఉంచుకోవాలి 24
16. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-39**
పంచకళలతో తాత్త్విక సాధన 25
17. **జీవించేకళ :** వ్యక్తిత్వవికాసం 27
18. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-30**
శక్తిపీఠాలస్థాపన-2 30
19. **మనం-మన ఆరోగ్యం : ఆయుర్వేద విజ్ఞానం**
ఆయుర్వేదంలో జలప్రాధాన్యత 32
20. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-59**
మెరిసింది సరికొత్త వెలుగు-2 34
21. **మహిళాజాగరణ**
మహాకాలుని సంకల్పం-21వశతాబ్దం-నారీశతాబ్దం-2 37
22. **నావారితో నామాట-2**
శతజయంతి ఉత్సవాలరూపురేఖలు 39
23. **గాయత్రీ మంత్రం సర్వమానవకోటికి చెందింది**
**మద్రాసు హైకోర్టుతీర్పు** 42
24. **ఏ పుస్తకంలో ఏముంది?** 43
25. **సద్గురులీలామృతం**
గురుదేవుల అభయహస్తమే నన్ను నడిపించింది
అదే అసలైన పెద్ద కారణం 44
26. **వార్తలు** 45

## సద్గురు వచనామృతం

### మన సాంస్కృతిక గౌరవానికి వైభవాన్ని తెద్దాం

ఆ జ్ఞానం, ఆ గౌరవం, ఆ విజ్ఞానం, ఆ కళ, ఆ సమృద్ధి, ఆ సంస్కృతి-సమస్తమూ ఈ దేశపు గర్భంలో నేటికీ నిలచి ఉన్నాయి. ఆ ఆవిష్కరణలు నేటికీ దృఢంగా ఉన్నాయి. అవి నిరర్థకంకాలేదు. ఆ విద్యల ఉనికి నేటికీ నిలచి ఉంది. 'ఎవరైనా రావాలి. అనంతమైన మా భాండారం నుండి ఎంత కావలిస్తే అంత వెలికితీసుకోవాలి' -అని అవి ఎదురుచూస్తున్నాయి. కానీ- ఆ సాహసం ఏది? ఆ తన్మయత్వం ఏమయింది? జాతి గౌరవాన్ని తిరిగి ఉన్నతంచేసే ఆ కర్మవీరులు ఏరి?

మనం ఒక పరిభాషను నేర్చుకున్నాం- "పతన పరిభాష"ను. త్రాగిన మైకంలో ఊగిపోతూన్న వ్యక్తికి తనను గురించిన స్పృహ ఉండదు. సరిగా అలా తయారయినాం మనం. మన రక్తనాళాలలో విదేశీయత మత్తు ప్రవేశించింది, ఆడంబరం ప్రవేశించింది, కృత్రిమత్వం ప్రవేశించింది. మన సాంస్కృతిక గౌరవాన్ని మనం విస్మరించాం.

నాటినుండి మన దుర్గతి రోజు రోజుకూ పెరిగిపోతోంది. మన ఆత్మాభిమానం మేలుకొంటే, మన ఆత్మగౌరవం మేలుకొంటే- నిరుద్యోగం, అవినీతి తమ మనుగడను నిలుపుకోలేవు; వ్యభిచారం సాగదు; అత్యాచారం ఎక్కువ రోజులు తల ఎత్తుకు నిలువలేదు.

మనం మన గౌరవాన్ని గుర్తించిన రోజున- మన పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అంతటా ఉల్లాసం, ఉత్సాహం వెల్లుబుకుతాయి. జ్ఞాన గంగ పొంగిపొరలుతుంది. సమృద్ధి శిఖరాగ్రాన్ని చేరుతుంది. మన ఆధ్యాత్మిక ప్రవృత్తులు మేలుకుంటే. మనం ఈ సాహసం చేయగలిగితే- యుగం మారడానికి ఎక్కువ సమయం పట్టదు. ఆ స్వర్ణ యుగం పరుగు పరుగున తరలివస్తుంది.

రండి ! ధర్మ, సంస్కృతుల అవగాహనకు సిద్ధంకండి.

★★★

మనం ఆపదగా భావించేది ఒకవిధంగా దేవుని కరుణ.

వేద మంత్రం

# తియ్యని మాట ఒక కామధేనువు

**మా నో నిదే చ వక్తవేऽర్యో సరధారరావ్ణే ।**

**త్వే అపి క్రతుర్మమ ॥** (ఋగ్వేదం 7/31/6)

**భావార్థం :** మానవులారా ! మీరెన్నడూ కఠినంగా మాట్లాడవద్దు. ఎవరినీ నిందించవద్దు. కృతఘ్నులు కావద్దు. దుఃఖితులకు సహాయం చేయండి. మీ ప్రతి శుభకర్మను పరమేశ్వరునికి సమర్పించండి.

**సందేశం :** తియ్యని మాటతో అందరికీ సుఖం కలుగుతుంది. అందరూ సంతృప్తిగా, ప్రసన్నంగా ఉంటారు. కఠినమైన మాటలు హృదయంలో ముళ్లవలె గ్రుచ్చుకొంటాయి. సహించలేని కష్టం కలుగుతుంది. తియ్యగా మాట్లాడుట వశీకరణ మంత్రంతో సమానం. కనుక మనుష్యుడు ఎప్పుడూ మధురభాషిగానే ఉండాలి. అందరితో మధురంగా వ్యవహరిస్తేనే అంతటా సుఖం, శాంతి, ఉల్లాసపూరిత వాతావరణం ఏర్పడుతాయి.

మధుర భాషణం కామధేనువుతో సమానం. ఇది సమస్త కోర్కెలను పూర్తిచేస్తుంది. కీర్తిని పెంచుతుంది. ఎంత కఠోర హృదయుడైనా తియ్యని మాటలతో అన్నివిధాలా సహకరించటానికి ఉద్యుక్తుడవుతాడు. ప్రియవచనాలు ప్రపంచంలో అన్నిరకాల సుఖాలనిస్తాయి. దీని తాత్పర్యం ఎవరినైనా పొగడటం, ఇచ్చకాలు మాట్లాడటం కాదు. చెప్పవలసిన విషయాన్ని దృఢంగా చెప్తూనే మాధుర్యపు కొంగును వదలి పెట్టకూడదు. మధురభాషణం మనుష్యునికి ఇచ్చే సుఖం, ఆనందం శీతల జలంకానీ, శీతల ఛాయకానీ, చందనం కానీ ఇవ్వలేవు. అందుకే ఎల్లప్పుడూ తియ్యగా మాట్లాడుతూ ఉండాలి.

ఐసీ వాణీ బోలియే, మనకా ఆపా ఖోయ్ ।
ఔరన్ కో శీతల కరే, ఆపహుం శీతల్ హోయ్ ॥

ప్రభువు మనకు 'వాణి' అనే దైవీ అనుదానం ప్రదానం చేశాడు. మనం ఎప్పుడూ కఠినంగా మాట్లాడకూడదని ఆయన కోరిక. అందుకే ఆయన నాలుకలో ఎముకను ఉంచలేదు. ఈ తీపి మాటలతో మనం ప్రపంచాన్ని వశం చేసుకొని మిత్ర సమానంగా చేసుకోవచ్చు. తులసీదాస్ కూడా ఇదే నేర్పాడు–

కటువుగా మాట్లాడుట చాలా అనర్థాలు తెస్తుంది. మర్మభేది బాణాల వల్ల కూడా హృదయానికి కలుగనంత బాధ కటువచనాల వల్ల కలుగుతుంది. కత్తితో చేసిన గాయం మానవచ్చు. కానీ ఈటెల వంటి మాటలు చేసిన గాయం మానదు. సూటిపోటి మాటలు హృదయానికి గ్రుచ్చుకుంటాయి. అందుకని కఠినంగా మాట్లాడకూడదు. గ్రుడ్డి, కుంటి, మూగ, చెవిటి, కురూపులైన వారిని ఆ పేరుతో పిలిచి, ఎగతాళి చేసి, వారి మనసు బాధ పెట్టకూడదు. నిందించుట, దోషాలను ప్రచారం చేసి సంతోషించుట, సహకారం పొంది కృతఘ్నులుగా ఉండుట– ఇవన్నీ ఇతరులను బాధించేవే.

మనం ఎల్లప్పుడూ శుభకర్మలలో నిమగ్నమైనప్పుడే పరమాత్మునికి కృపాపాత్రులం కాగలం. పరమాత్మ ఒకవైపు దుష్కర్మలు చేసే వారిని నాశనం చేస్తాడు. మరొకవైపు సత్కర్మలు చేసే వారిని తండ్రివలె రక్షిస్తాడు. వారికి శక్తి నిస్తాడు.

అనుచితంగా, విరుద్ధంగా, కఠినంగా మాట్లాడే వారిని తన శక్తితో పరమాత్మ శిక్షిస్తాడు. ఇతరుల తప్పులు వెతికేవాడు, క్రమశిక్షణ లేనివాడు, కఠినంగా మాట్లాడేవారు, కృతఘ్నులు అయిన వ్యక్తులను సమాజం గౌరవించదు. అటువంటి వ్యక్తుల ఆచరణ చివరికి వారి వినాశనానికే దారి తీస్తుంది.

మధుర సంభాషణ వ్యక్తిత్వానికే వన్నె తెస్తుంది.

★★★

**దుఃఖంవల్ల నిద్రిస్తూన్న ప్రతిభ కోలుకుంటుంది, మనస్సూ శరీరమూ క్రియాశీలం అవుతాయి.**

ధారావాహిక : దేవసంస్కృతీ సౌరభం-21

# చిత్తశుద్ధికి సాధనం విగ్రహారాధన

తాను చేసే పనిపాటలను, తన నడవడిని, తన హావ భావాలను, ఆలోచనలను ఎవరో కనిబెట్టి చూస్తున్నారన్నది తెలిస్తే మనిషి జాగ్రత్తపడతాడు. అది మానవ స్వభావం. బాహ్య నియంత్రణ లేకపోతే అతను పతనస్థితిలో ఇరుక్కుపోతాడు. దేవాలయాలలో పరమాత్మ విగ్రహంముందు అతనికి తాను ఈశ్వరుని సమ్ముఖంలో ఉన్నానని, పరమాత్మ తనపనులను కనిపెట్టి చూస్తున్నాడని, తన ఆలోచనలను జాగ్రత్తగా గమనిస్తున్నాడని భావిస్తాడు. ఆవిధమైన భావం అతని చిత్తశుద్ధికి సహాయకారి ఔతుంది. విగ్రహం చిత్తశుద్ధికి, ప్రత్యక్ష పరమేశ్వరునికి ప్రతినిధి అవుతుంది. ఈ విగ్రహకల్పన చేసిన భారతీయ ఋషులు మనోవిజ్ఞానవేత్తలుగా వారు చేసిన యీ ఉపాయంవలన సామాన్య అమాయిక భావుక జనులకు చిత్త శుద్ధి ఏర్పడింది. మనుష్యులు తమ సాత్విక ప్రవృత్తులను, కళా, సౌందర్యవృత్తులను, దేవాలయాలలో ప్రదర్శించారు. విగ్రహంలో భగవద్భావనను, తమ శ్రద్ధాభక్తులను నింపి వారు ఆత్మవికాసాన్ని పొందారు.

ఆచార్య వినోబా భావేగారు, "విగ్రహంలేకుంటే పూలతోటలోని పువ్వులు కోసి మనిషి కేవలం తన ముక్కు దగ్గరకే తీసుకు వెళతాడు. కానీ సాత్విక భావనతో నిండినవాడై పరమాత్మ విగ్రహం మీద ఆ పువ్వులను జల్లి పూజిస్తాడు. పువ్వులకు అతి ఉన్నతస్థానం అదే కనుక. మనిషి తనకుగల గంధవాసనను ఆవిధంగా ఉన్నత స్థితికి తీసుకు వెడతాడు. తనకు గల వాసనను ఉన్నత స్థితికి మళ్లించి తాను సంయమనాన్ని సాధించటానికై భగవంతునికి సమర్పించడమన్న ఉపాయాన్ని కనుగొన్నాడు." అని వ్రాశారు.

రామదాసస్వామి ఒకచోట, "దేవా చే వైభవ బాడవావే. (భగవానుని వైభవాన్ని పెంచు)." అని వ్రాశారు.

అల్పజ్ఞులు, అశక్తులు, అజ్ఞానులు ఐన మనుష్యులు భగవంతుని వైభవాన్ని ఏవిధంగా పెంచగలుగుతారు? పరమాత్మ ఎంతో గొప్పవాడు, హద్దులేని శక్తిశాలి. ఆయనతో పోలిస్తే మనం ఎంతో శక్తి హీనులం, చేతకాని వాళ్లం. మన శక్తి ఎంతో పరిమితమైంది. ఐతే ఇందులోని ఆంతర్యమేమంటే- మన ద్వారా మన తండ్రియైన పరమాత్మ యొక్క గొప్పతనం ప్రకటితం కావాలని, పరమేశ్వరుని వైభవాన్ని పెంచడం ద్వారా మన జీవితాన్ని ఉన్నత స్థితికి తెచ్చుకుంటాము, దానిని దైవీశక్తులతో నింపుకుంటాము.

దేవాలయంలో భగవంతునియొక్క ఏదైనా విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆతనిని మనం చేసే పనులకు నిరంతరం ద్రష్టగా భావించాలి. అక్కడ మనం ఏ మంచిపనులు చేస్తామో, మన కర్తవ్యాలను పూర్తి గావిస్తామో, భజన, అర్చన, స్వాధ్యాయ, ప్రార్థనాదులు చేస్తామో అవే భగవంతుని వైభవాన్ని పెంచే కార్యాలు. ఏ ఆలోచనలు, కార్యాలవల్ల మనలోని దైవత్వం ప్రకటితమౌతుందో అటువంటివి ఈ దుర్లభమైన మానవ శరీరంతో చేయవలసిన యోగ్యమైన కార్యాలు. వీటివల్లనే మన అహంకారం పోతుంది, చిత్తానికి శుద్ధత కలుగుతుంది.

మనం మన శ్రద్ధను, విశ్వాసాన్ని విగ్రహంలో ఎప్పుడు నెలకొల్పుతామో అప్పుడు అది దివ్యమైన సమర్థతతో నిండిపోతుంది. ఆ రాతిబొమ్మ ముందు మన తల దానంతట అది ఒంగిపోతుంది. ఇది మనిషిలోని విశ్వాసంవల్ల కలిగే చమత్కారం. ఆ విగ్రహం ముందు నిరంతరం ఉండడంవల్ల మన చిత్తం శుద్ధమౌతుంది, ఆత్మాను శాసనం- తనను తాను సరియైన పద్ధతిలో నడుపుకోవడం- లభిస్తుంది. జీవితానికి అంతిమ లక్ష్యం పరమాత్మతో తాదాత్మ్యం చెందడం కావాలి. అదే పరమ పురుషార్థమని తలంచాలి. విగ్రహారాధన అన్నది మనిషి తనలో దైవీగుణాలను వికసింపజేసుకోవడాని మొదటి మెట్టునెక్కడానికి ప్రారంభస్థితి. యోగసూత్రాలలో పరమాత్మ అంటే "రాగద్వేషాది రహిత పురుష విశేషః"- రాగం కాని, ద్వేషం కానీ లేని పురుషుడు- అని తెలుపబడింది. ఈ విధంగా మనిషి విగ్రహారాధన చేస్తూ, చేస్తూ నిరహంకారుడౌతాడు. ఏ విగ్రహంలో ఏవిధమైన దైవీగుణాలను ఆరోపణ చేసి పూజిస్తాడో ఆ దైవీగుణాలు తరువాత అతని ప్రవర్తనలో, నడవడిలో కనబడతాయి. ఈ విధంగా విగ్రహారాధన ఎంతో ఉపయోగకరము, అవసరమూ కూడా.

అనువాదం - కె.బి.సోమయాజులు

★★★

ఉదార చరితుడు పరిసర వాతావరణాన్ని కూడ ప్రభావితం చేస్తాడు.

# జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?

భారతీయసంప్రదాయంలో విగ్రహపూజ అనాదిగా వస్తున్న ఆచారం. దానికిగాను కర్మకాండ అధికంగా ఉంటుంది. భగవంతుని సాన్నిధ్యాన్ని కోరేవారు అనేక మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. కొందరు తీర్థయాత్రలు చేస్తే, మరికొందరు దేవాలయాల చుట్టూ తిరుగుతారు. కొందరు స్తవనం చేస్తే, మరికొందరు కీర్తనం చేస్తారు. కొందరు పఠనం చేస్తే, మరికొందరు ప్రదక్షిణలు చేస్తారు. కొందరు షోడశోపచారపూజలు చేస్తే, మరికొందరు ఉపవాసాలు, జాగారం చేస్తారు. కొందరు అభిషేకాలు చేస్తే, మరికొందరు శోభాయాత్రలు చేస్తారు. ఈ విధంగా ఎవరికి తోచిన రీతిలో వారు ఆరాధిస్తూ ఉంటారు.

ఇవన్నీ కూడ ప్రాథమిక సూత్రాలే. వీటన్నింటినీ మించిన ఉన్నతస్థాయి విధానాలు రెండే రెండున్నాయి. (1) జపం (2) ధ్యానం. జపానికి, ధ్యానానికి ఉపకరణాలతో పనిలేదు. అయినా ఆచరణలో శారీరిక స్పందనలు, మానసిక పరిశ్రమ పరోక్షరూపంలో ఉండనే ఉంటాయి. ఇది కేవలం భారతీయ పరంపరలోనే కాదు, ప్రపంచమంతటా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కనిపిస్తూనే ఉంటాయి. ఏ పద్ధతిలో చేసినా జపం-ధ్యానం బింబ-ప్రతిబింబాలుగా, అంగ ప్రత్యంగాలుగా సాక్షాత్కరిస్తూనే ఉంటాయి. సంకల్పశక్తి సహాయంతో ఆలోచనారహితమైన శూన్యావస్థ ప్రాప్తిస్తుంది. సాధనకు అంతిమరూపం అదే. ఈ స్థితిలోనే బ్రహ్మానందం అనుభవం అవుతుంది. ఈ అనుభూతిలో జీవాత్మ-పరమాత్మల కలయిక స్ఫురిస్తుంది. ఈశ్వర ప్రాప్తికి చాల దగ్గరలో ఉంటాం.

భూమ్యాకర్షణ శక్తిని దాటిపోయిన తర్వాత రాకెట్ స్వేచ్ఛగా పయనిస్తుంది. అదేవిధంగా ఉన్నతస్థాయికి చేరుకున్న ఆత్మ దివ్యాత్మల మార్గదర్శనంలో మిగిలినకార్యాన్ని పూర్తిచేసుకుంటుంది. భావనాబలం లేకుండా కేవలం కర్మకాండలసాయంతో విజయాన్ని సాధించలేం. ఈ కర్మకాండలన్నీ కూడ ప్రాథమికతరగతుల్లో బోధన నిమిత్తం ఉపయోగించే రంగు రంగుల బొమ్మలవంటివే. పహల్వాన్ కావాలనుకున్నవ్యక్తి మొట్టమొదట దంబుల్స్, ఇనుపగుండు, ఇనుపగద మొదలయినవి ఉపయోగిస్తాడు. పైకి ఎక్కాలనుకున్న వానికి మొదట్లో కర్ర సాయం అవసరమవుతుంది. కాని ఇవన్నీ ప్రాథమికదశలోనే అని గుర్తుంచుకోవాలి. ఉపాసనారంగంలో కర్మకాండల స్థానం కూడా ఇదేనని అర్థం చేసుకోవాలి.

మణిలేని సర్పం నిరుత్సాహంగా పడి ఉంటుంది. అదే విధంగా పరమాత్మను మరచిపోయిన మానవుడు అనాథగా, భయంతో కుంచించుకుపోతూ ఉంటాడు. సర్వం కోల్పోయిన వానిలా నిరాశానిస్పృహలతో నీరసించిపోతాడు. అలాంటి పరిస్థితుల్ని సరిచేసేది జపమే. **జపంద్వారా ప్రతిక్షణం ఆత్మ పరమాత్మను పిలుస్తూనే ఉంటుంది**. పరమాత్మను పిలిచిన పిలుపు ఏనాడూ వ్యర్థం కాదు. గజేంద్రమోక్షంలోని ఏనుగు పిలిచిన పిలుపు, మహాభారతంలో ద్రౌపది పిలిచిన పిలుపు వ్యర్థం కాలేదు. భగవానుడు పరుగు పరుగున వచ్చి తన భక్తులను రక్షించుకున్నాడు.

భగవన్నామ స్మరణలేని మానవుడు పాంచభౌతిక శరీరాన్ని ఆకలి తీర్చుకోవడానికి, సంతానాన్ని కనడానికి మాత్రమే ఉపయోగించుకుంటాడు. వాటిని నెరవేర్చుకోవడానికి ప్రక్కదారులు వెతుక్కుంటాడు. దాని ఫలితంగా కష్టాలలో కూరుకుపోతాడు. అప్పుడుగాని భగవంతుడు గుర్తుకురాడు. ఆవేదనతో మాటిమాటికీ పిలుస్తూనే ఉంటాడు. అదికూడ నామజపమే అవుతుంది.

"గొంతెత్తి పిలిస్తే చాలు భగవంతుడు సాయం చేస్తాడు. అనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఈశ్వరుడు కర్తవ్యపాలన అనే గీటురాయి మీద భక్తుణ్ణి పరీక్షిస్తాడు. దానినిబట్టే రక్షించడంగాని, శిక్షించడంగాని జరుగుతుంది. విద్యుత్తును అనేక విధాలుగా ఉపయోగించుకుంటున్నాం. ప్రయోజనాలు పొందుతున్నాం. కాని ఒక్కసారంటే ఒక్కసారి తీగల్ని పొరపాటున ముట్టుకున్నా ప్రాణాలు కోల్పోతాం. భగవంతునితో వ్యవహారం కూడ అంతే. ఆయనకు ఉన్న అనేక నామాల్లో 'రుద్రుడు' కూడ ఒకటి. అవినీతిని అసలే సహించడు. రుద్రుడౌతాడు. శిక్షించితీరుతాడు. అందువల్ల పాత్రతను పెంచుకుంటూ నామజపం చెయ్యాలి. అప్పుడే ఫలితం లభిస్తుంది.

మనం ప్రతిరోజూ స్నానం చేస్తూనే ఉంటాం. బట్టలు ప్రతిరోజూ ఉతుకుతూనే ఉంటాం. దంతాలను రోజూ శుభ్రం చేసుకుంటూనే ఉంటాం. ఇంటిని రోజూ చిమ్ముకుంటూనే ఉంటాం. ఎందుకోసం? మరల మరల మురికి చేరుతూ ఉంటుంది కనుక. అదేవిధంగా **మనుస్సులో కూడ ప్రతిరోజూ చెడు ఆలోచనలు వస్తూనే ఉంటాయి. వాటిని తుడిచివేయాలంటే నామజపం తప్పనిసరి అని అర్థం చేసుకోవాలి.** ఈశ్వరుని మనస్సులో ప్రతిష్ఠించుకోవడానికి మూలాధారం నామజపం. స్మరిస్తూనే ఆహ్వానించుకోవాలి. ఆహ్వానిస్తూనే స్థాపించుకోవాలి. మనోవిజ్ఞానశాస్త్రం అంటే ఇదే.

మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో

అనువాదం - పొన్నూరు హైమవతీ శాస్త్రి

★★★

నామజపం చేస్తూఉండు నిరంతరం - ఫలితం తప్పదు తరం తరం.

# పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్ది-2400ల కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణభారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్రజపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత పూజ చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడుమాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్కమాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక** : ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థులచేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తన మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు నిద్రించేముందు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపించాలి. ఈ పేజీని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

1. *కె.వి.విఠల్, 48 LIG-II, బి.కె.గుడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400 కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

*ప్రారంభ తేదీ / సమయం :* ____ ____

*నెం :* *పూర్తి జప మాలల సంఖ్య :* ____

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | *ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి* | | | | |

*ప్రారంభ తేదీ / సమయము :* ....................................

*నెం :*

*పేరు :* ..........................................................

*గోత్రము :* ......................................................

*చిరునామా :* ...................................................

..........................................................................

..........................................................................

*పుట్టిన రోజు మరియు వివాహదినము :*.............................

..........................................................................

*ఫోన్ :* ..........................................................

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు తప్పక చందాదారులుగా చేరండి.*

**సాధకుడు సమాజంలో చరించాలి - సాధకునిలో సంసారం చరించరాదు.**

వర్తమాన భారతం

# సమస్యలలో చిక్కుకున్న ప్రపంచం

## ప్రకృతి విలయాలు

ఈనాడు ప్రపంచదేశాలన్నీ సమస్యల వలయంలో చిక్కుకుని ఉన్నాయి. ప్రపంచ ప్రజలంతా విపరీతంగా పెరిగిపోతున్న భయంకరమైన వేడిమి వల్ల బాధపడుతున్నారు. భయపడుతున్నారు. 21వ శతాబ్ది ప్రవేశించి 8 సంవత్సరాలు గడిచిపోయినయి. భూకంపాలు, వరదలు, కరువు కాటకాలు, సునామీలు, హిమోత్పాతాలు, నీలివర్షాలు, అతివృష్టి, అనావృష్టి ఒకటేమిటి? అనేక రకాల ప్రకృతి వైపరీత్యాలు ప్రజలను బాధించడంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తున్నాయి. ఇటీవల సంభవించిన సునామీ భూతం లక్షల ఎకరాల భూమిని జలసమాధి చేసివేసింది. వేలాది సంఖ్యలో కుటుంబాలకు కుటుంబాలే సర్వనాశనమైపోయాయి. చైనాలో రెండు భూకంపాలు వచ్చాయి. భూకంపాల భయంతో హిమాలయాలు కూడ చలించిపోయాయి. అమెరికాలో సముద్ర తుఫానులు మాటిమాటికి వస్తున్నాయి. 'న్యూ ఆర్లియన్స్' నగరం 5 సంవత్సరాలలో రెండుసార్లు ఆపదలో చిక్కుకున్నది. లక్షల సంఖ్యలో జన నష్టం జరిగింది.

## ఉగ్రవాద భూతం

ప్రకృతి భీభత్సాలు కాకుండ ఉగ్రవాదభూతం విలయతాండవం చేస్తోంది. ప్రపంచదేశాలన్నీ దీని బారినుండి తప్పించుకోలేక పోతున్నాయి. భారతదేశంలో అయితే ఈ పిశాచం పీఠం వేసికొని కూర్చుంది. ఒకసారి బెంగుళూరు, ఒకసారి అహమ్మదాబాదు, ఒకసారి జయపూర్, ఒకసారి హైదరాబాదు, ఒకసారి ముంబయి బాంబు దాడులకు గురి అవుతూనే ఉన్నాయి. అమాయక ప్రజలు లెక్కకు మిక్కిలిగా మరణిస్తూనే ఉన్నారు. మరణించిన వారు గాక వేలాది సంఖ్యలో వికలాంగులై దుర్భర జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. ఎంతమంది నోటిముందర అన్నం గుంజుకోబడిందో, ఎంత మంది మహిళామతల్లులు వితంతువులయ్యారో, ఎంతమంది చిన్నారులు అనాథలయ్యారో, ఎంతమంది వృద్ధులు ఆధారభూతులైన సంతానాన్ని పోగొట్టుకున్నారో లెక్కించి చెప్పడం ఆ బ్రహ్మకు కూడ వశంకాదు.

ఇప్పటికి 7 సంవత్సరాలక్రితం అమెరికా ఉగ్రవాదం చేతిలో త్రిప్పుకోలేని చావు దెబ్బతింది. నవంబరు 9వ తేదీన ప్రపంచ దేశాలలో నంబర్ 1గా నిలబడ్డ అమెరికా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అక్కడ ఉన్న పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ నిర్వీర్యమై నిలబడింది. నవంబరు 7వ తేదీన ఇంగ్లాండులో టెర్రరిష్టుల పథకాన్ని అక్కడి పోలీసులు భగ్నం చేశారు. దానితో వారు రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేశారు. విమాన యాత్ర మొదలుకుని సాధారణ ప్రయాణం వరకు చెకింగులతో కొంత అసౌకర్యం కలిగినా తప్పని సరి అయింది. ఆ దుర్ఘటన తర్వాత మళ్లీ జరుగనీయలేదు. రక్షణ వ్యవస్థలో ఆరితేరిన దేశాలు జాగ్రత్తలు చేపట్టగలిగాయి. కాని మన దేశంలో మాత్రం ఒకదాని తర్వాత మరొక్కటి జరిగిపోతూనే ఉన్నాయి. అయినా రాజకీయలబ్ధి కోసం ఓటు బేంకును దృష్టిలో పెట్టుకుని చూసీ చూడనట్లు పోతున్నారు. పూర్తిగా యుద్ధం వస్తే మాత్రం అన్ని కుట్రలను భగ్నం చేస్తారు. 108 కోట్ల జనాభాను కలిగి ఉన్న మన దేశం చైనా నుండి పాఠం నేర్చుకోవచ్చు. పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ, వాత్సల్యం, ఐకమత్యం చూపిస్తూ ఒలంపిక్స్‌లో ప్రపంచానికి చక్కని ఆతిథ్యం ఇచ్చింది. జనాభాలో మనకంటే ఎక్కువే. అయినా దూరదృష్టి, కఠిన పరిశ్రమతో అందరి మెప్పును పొందగలిగింది. ఇలాంటి విషయాలపై మనం కూడ శ్రద్ధ చూపించాల్సి ఉంది.

## మనమూ ముందున్నాం కానీ ఎందులో?

కాస్త ఆలోచించి చూచినట్లైతే మనం ఎక్కడెక్కడ వెనుకబడి ఉన్నామో తెలుస్తుంది. కాని కొన్ని విషయాల్లో మాత్రం ముందే ఉన్నాం. ఎలాంటి విషయాల్లో ముందున్నామో తెలుసా? (1) జాతి-మత కొట్లాటల్లో (2) ఎన్నికల హింసలో (3) వర్గపోరాటంలో (4) అంధ విశ్వాసాలలో, మూఢాచారాలలో, భూతప్రేత ప్రయోగభావనలో (5) 21వ శతాబ్దంలో కూడ అవిద్య, నిరుద్యోగం, దారిద్ర్యం మొదలైన వాటిల్లో మ్రగ్గిపోవడంలో అని గట్టిగా చెప్పవచ్చు. ఈనాటి కార్పొరేట్ ప్రపంచంలో రొమ్మువిరుచుకుని, మీసం మెలిత్రిప్పి, ఆర్థిక పరిస్థితిపై బహిరంగంగా ఉపన్యాసాలు

మన శారీరిక, మానసిక శక్తులను రెచ్చగొట్టే హంటర్ భగవంతుడు కలిగించే కష్టం.

ఇస్తున్నారు. కాని ధరలు మాత్రం పెరిగిపోతూనే ఉన్నాయి. ఒక సామాన్య మానవుని బడ్జెట్‌ను పరిశీలిస్తే తృప్తిగా కనిపించడంలేదు. ప్రతి వ్యక్తికి సగటున పెట్రోలు, డీజిల్, గాస్ సిలండర్ మొదలైనవే కాక నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటుతూ ఉన్నాయి. పెరుగుతున్న సూపర్ మార్కెటును చూచి, మల్టిప్లెక్స్‌ను చూచి భారతదేశం వృద్ధి చెందుతోందని అంచనా వేయకూడదు. జటిలమైన రకరకాల సమస్యలను చూస్తున్నాం. కనీస అవసరాలు కూడ తీరని పరిస్థితులను చూస్తున్నాం. వీటితోపాటే విపరీతంగా పెరిగిపోతున్న మహానగరాలను చూస్తున్నాం. ఆ నగరాలలో చట్టవిరుద్ధమైన కాలనీలను చూస్తున్నాం. వీటితో పాటు ఇంకా చూడాల్సినవి చాలా ఉన్నాయి. మారు మూల గ్రామాలను చూడాలి. గ్రామాలలోని ప్రజల జీవన విధానాన్ని చూడాలి. ఎందుకంటే వారి జీవనస్థాయి బాగుపడిననాడే జాతీయ స్థాయిలో అభివృద్ధి కనబడుతుంది.

## జాతి,సంప్రదాయవాదాల చిచ్చు

జాతివాదం పేరుతో రగులుకుంటున్న చిచ్చు ఎప్పుడు? ఎక్కడ? భగ్గుమంటుందో తెలియడం లేదు. అన్ని పార్టీలవారు ఆ మంట మీదనే వంట చేసుకు తినాలని చూస్తున్నారు. అందరికీ దృష్టంతా కుర్చీమీదే. ఎన్నికల్లో నిలబడాలన్నా, ఉద్యోగం కావాలన్నా, రక్షణ కావాలన్నా ప్రతీచోటా కులంపేరు కావాల్సి వస్తున్నది. ఈ రకమైన పద్ధతి 70 సంవత్సరాలక్రితం ఆంగ్లేయుల పాలనలో కూడలేదు. ఆ సమయంలో అందరు కలసిమెలసి ఉండే వారు. ఇప్పుడైతే ప్రతీ ఒక్కరు తమతమ కులం పేరిట గ్రూపుల్లో చేరిపోతున్నారు. మొట్టమొదట కులవ్యవస్థ వ్యక్తిత్వ స్థాయిలో నిర్ణయించబడింది. ఇప్పుడు జన్మతః కులం చెప్పబడుతోంది. అన్ని స్థాయిలవారు ఇదే అజ్ఞానంలోపడి కొట్టుకుంటున్నారు. సంప్రదాయ క్షేత్రంలో అసహనం ప్రబలిపోతోంది. మనదేశంలో ఎంతో మంది మతసహిష్ణుతను, మానవతావాదాన్ని నూరిపోసిన మహాత్ములు జన్మించారు. నిజం చెప్పాలంటే ఇంతమంది మహానుభావులు ఏదేశంలోనూ జన్మించలేదు. పోప్‌వాదాన్ని, ఇస్లాం శాసనాన్ని పరిశీలించి చూచినట్లైతే, అల్పసంఖ్యాకులు స్వర్గంలో నివసిస్తూ ఉన్నట్లు, అక్కడ వారికి ఏం చేయడానికైనా స్వేచ్ఛ ఉన్నట్లు భావిస్తున్నారనిపిస్తుంది. అయినా విప్లవకారులుగా ఎందుకు మారిపోతున్నారు? ఎవరు వారినిలా తయారు చేస్తున్నారు? ప్రాణ సమానమైన మాతృదేశాన్ని రెండుముక్కలుగా ఎందుకు చేయాల్సి వచ్చింది? మనదైన రెండవ భాగం తిరుగుబాటుదారుల వశమైంది? అన్నింటికీ సమాధానం ఒక్కటే– “జాతి – సంప్రదాయాల చిచ్చు”.

## స్త్రీలపై చిన్నచూపు

ఈనాడు మహిళలపట్ల పెరిగిపోతున్న అత్యాచారాలు, వారి పై జరుగుతున్న దాడులు మొదలైన వాటిని గమనించి చూచినట్లైతే ప్రాచీన స్త్రీ వాదాన్ని తలపింప చేస్తున్నాయి. 21వ శతాబ్దిలో సాగుతున్న వైజ్ఞానిక యాత్రలో మనం ముందుకు పోతున్నామో, వెనుకకు వస్తున్నామో అర్థం కాని పరిస్థితి మనముందున్నది. పెరిగిపోతున్న అశ్లీలతలో స్త్రీ పాలుపంచుకుంటున్నది. దాని ప్రభావం ముక్కు పచ్చలారని బాలబాలికలపై పడుతోంది. ఈ విషయంలో సమాజ వాదులు జోక్యం చేసికోవడం లేదు. స్త్రీలను అవమానించిన చోట దేవతలు నిలువ లేరన్న విషయం ఎవ్వరి దృష్టికీ రావడం లేదు. ఆర్థిక పరమైన చిక్కులు అవధులు దాటిపోతున్నాయి. హాయిగా బడికి పోయి చదువుకోవాల్సిన పిల్లలు పాఠశాలలు వదిలేసి కూలీనాలీ చేసుకుంటున్నారు. నిరక్షరాస్యుల సంఖ్య పెరిగిపోవడం వల్ల అజ్ఞానం విలయతాండవం చేస్తోంది.

## ధర్మోపదేశికులు-యువశక్తి

దేశంలోని ధర్మోపదేశికులంతా ఏం చేస్తున్నట్లు? ఎవరి డప్పు వారు వాయించుకుంటూ, ప్రవచనాల పేరుతో నిద్రమాత్రలు వేసి జోకొడుతున్నారు. ఉండడానికైతే బాబాలు కోటిమంది ఉన్నారు. భోగాలతో తులతూగుతున్నవారు ఇతరులకు నిరాడంబరతను ఎలా బోధించగలరు? కొన్ని ఆసనాలు, ప్రాణాయామాలు చేసినంత మాత్రాన దేశంలోని దరిద్రం సమసిపోదు. ప్రతిరోజు రైతులు ఆత్మహత్యలు చేసికుంటూ ఉంటే, పచ్చపచ్చని పంటపొలాలు భూబకాసురుల చేతిలోకి పోతూ ఉంటే వ్యవసాయం పరిస్థితి ఏమిటి? జనటిక్ ఇంజనీరింగ్ ద్వారా విత్తనాలతో పాటు రసాయనిక ఎరువులు ఆటాడుకుంటున్నాయి. అందువల్ల కృషి ప్రధానమైన భారతదేశం అనేక విధాల నష్టపోతూ ఉంది. ఈ పరిస్థితుల్లో యువశక్తి ఏం చేస్తున్నట్లు? వారికి వారి వారి కాలేజీల్లో నాయకత్వం కావాలి. నిరుద్యోగులకు ఉద్యోగం కావాలి. వారి గొడవలే తప్ప దేశం సంగతి ఏమీపట్టదు. దేశాన్ని గురించి ఆలోచించడానికి తీరికే దొరకదు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి.

ఆపదవల్ల ప్రారబ్ధ అనుభవం పూర్తవుతుంది.

## ఆశాకిరణం

ఇలాంటి స్థితిలో ఆలోచించగా ఆలోచించగా ఒకే ఒక ఆశాకిరణం తళుక్కుమంటోంది. భయంకరమైన వడగాడ్పుల్లో ఒకే ఒక్క శీతల వాయువు విశ్రాంతి నిస్తోంది. అదేవిధంగా ఈనాడు సమస్యల వలయంలో చిక్కిన ప్రపంచంలో ఎక్కడో ఒకచోట మార్గదర్శనం దొరకకపోదు. మార్పును కోరే వ్యక్తులు కొందరుంటారు. దానికోసం సర్వస్వాన్ని అర్పించేందుకు సిద్ధంగా ఉంటారు. వారే మనకు ఆశాకిరణాలు. అలాంటివారు సమాజంలో అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉంటారు. వారి చేతుల్లో ప్రగతి దీపాలు ఒక్కటికాదు, వందల సంఖ్యలో వెలుగుతూ ఉంటాయి. వేర్వేరు స్థానాల్లో కనిపిస్తూ ఉంటాయి. ఈ ఆశాకిరణాల ప్రకాశం దీపావళి పండుగను తలపింపచేస్తుంది. ఆ కాంతిలో చక్కని మార్గదర్శనం లభిస్తుంది. అప్పుడే యుగయుగాల నుండి వస్తున్న అధ్యాత్మ తనవంతు సహకారాన్ని అందిస్తుంది. మెల్లగా సమస్యల నావను ఒడ్డుకు చేర్చుకోగలుగుతాము.

## నూతన స్వాతంత్ర్యంకోసం ఉద్యమం

ఆంగ్లేయుల దమన కాండనుండి రక్షించుకునే నిమిత్తం స్వాతంత్ర్య సమరం జరిగింది. లాలాలజపతిరాయ్ లాఠీదెబ్బలు తింటూ కూడ "ఇంకిలాబ్ జిందాబాద్" అని అంటూనే ఉన్నాడు. అంటూనే అమరుడయ్యాడు. భగత్‌సింహ్, బిస్మిల్, రాజగురు ముందుకు వచ్చారు. ఆ సమయంలో యువకిశోరాల అవసరం చాల ఉంది. అప్పుడే కాదు, ఇప్పుడు కూడ యువకిశోరాలు ముందుకు రావాలి. ఇప్పటి పోరాటం ఆనాటి పోరాటంకన్నా వందరెట్లు ఎక్కువ విలువైనది. దీనిని ఒక తుఫానుగా భావించాలి. ఈ ఉద్యమం కోసం సమయదానం, జీవన దానం ఇవ్వగలవారే ఎర్రకాగడాను చేపట్టి ప్రపంచమంతా చుట్టి రావాల్సిన అవసరం ఏర్పడింది. ప్రత్యక్షవాదంలో, భోగవాదంలో మునిగి తేలుతున్న ప్రపంచమానవాళిని జాగృతం చేయాల్సిన అవసరం ఉంది. అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు మార్గదర్శనం చేయాల్సి ఉంది. చైతన్య మూర్తులైన పరిజనులను ఆహ్వానిస్తున్నాం. "సంభవామి యుగే యుగే" అన్న భగవంతుని హామీని మరచిపోకుండ ముమ్ముందుకు సాగిపోదాం. ఈ పరిస్థితుల్లో ఆవాక్యమే మనకు ఏకైక ఆశాకిరణం.

అనువాదం - పొన్నూరు హైమవతీ శాస్త్రి

★★★

## ఇదమ్ బ్రాహ్మ్యం ఇదం క్షాత్రం శాపాదపి శరాదపి

*వైశాఖ శుద్ధ తదియ నాడు పరశురాముని జయంతిని జరుపుకుంటాం. ఆతనిని విష్ణుమూర్తి అవతారంగా భావిస్తాం. కొంకణ ప్రాంతంలోని, సముద్రపు ఒడ్డున పరశురామునికి అనేక దేవాలయాలు కట్టించారు. అక్షయతదియనాడు పరశు రామునికి ఉత్సవం జరుపుతారు. పరశురాముని జీవితం విలక్షణమైనది. హైహాయ వంశీయులు రాచరికపు అహంకారంతో అధర్మమార్గాన్ని అనుసరించారు. వారు రావణాసురునివలె, కంసునివలె విచ్చలవిడిగా రెచ్చిపోయారు. పరశురాముడు శివభక్తుడు. అధర్మాన్ని ఎదుర్కోమని శివుడు పరశురామునికి ఒక గొడ్డలిని ప్రసాదించాడు. తనలోని శక్తిని దానికి ఆపాదించాడు. "అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కోవడమే ధర్మశీలి అయిన వ్యక్తికి ప్రథమకర్తవ్యం" అని ఉద్బోధించాడు. అన్యాయం చేసిన వారు ఉన్నత స్థాయికి ఎందుకు చేరుకోలేరు? చేరుకునే తీరుతారు అని వాదించిన కార్తవీర్యార్జునితో పరశు రామునికి యుద్ధం చేయాల్సివచ్చింది. ఫలితంగా పరశురాముని తండ్రి జమదగ్నిని కార్తవీర్యార్జుని వంశీకులు చంపివేశారు. తల్లి సహగమనం చేసింది. తల్లి దండ్రుల మరణంతో కృంగిపోయిన పరశురాముడు క్షత్రియులపై కక్షగట్టాడు. పట్టుదలగా 21 మార్లు దండెత్తి క్షత్రియులను ఏరి ఏరి చంపేశాడు. ఈ దండయాత్రలలో గెలుచుకున్న భూమిని మొత్తం కశ్యప మహర్షికి దానం చేశాడు. గొడ్డలిని సముద్రంలో పారవేశాడు. పలుగు-పార చేపట్టి భూమిలో చెట్లను నాటాడు. చెట్లునాటే పనిని ఒక ఉద్యమంగా నడిపాడు.*

*అగ్రతశ్చతురోవేదా: సృష్ఠత: స శరంధను: ।*

*ఇదంబ్రాహ్మం ఇదంక్షాత్రం శాపాదపి శరాదపి ॥*

*బ్రహ్మశక్తి (జ్ఞానం) క్షాత్రశక్తి (శస్త్రశక్తి) రెండూ అవసరమే అని నిరూపించాడు.*

**ఆపదలలో అధిక భాగం మనిషికి అతడి పొరపాట్లను గుర్తుచేస్తుంటాయి.**

ముఖచిత్రకథనం

# గాయత్రి-24 శక్తులు

భారతదేశం జీవన లక్ష్యాన్ని తాను దర్శించి, సాధించి సంపూర్ణ మానవాళికి అందించిన దివ్యమైన వరం గాయత్రి.

శ్లో. ఆదిశక్తి స్తథా బ్రాహ్మీ వైష్ణవీ తిచ
వేదమాత దేవమాత విశ్వమాత ఋతంభరా
మందాకిన్య జపాచైవ బుద్ధి సిద్ధి ప్రకీర్తితా
వైదికానితు నామాని పూర్వోక్తానిచ ద్వాదశ

శ్లో. సావిత్రీ సరస్వతీ జ్ఞేయ లక్ష్మీ దుర్గా తథైవచ
కుండలిని ప్రాణాగ్నిశ్చ భవాని భువనేశ్వరి
అన్నపూర్ణేతి నామాని మహామాయా పయశ్వినీ
త్రిపురా చైవేతి విజ్ఞేయా తాంత్రి కానిచ ద్వాదశ

ఆదిశక్తి, బ్రాహ్మీ, వైష్ణవి, శాంభవి, వేదమాత, దేవమాత, విశ్వమాత, ఋతంభర, మందాకిని, అజప, బుద్ధి, సిద్ధి- ఈ పన్నెండు జ్ఞాన పక్షానికి, మస్తిష్కానికి, దక్షిణ మార్గానికి సంబంధించినటు వంటి శక్తులు.

సావిత్రి, సరస్వతి, లక్ష్మీ, దుర్గ, కుండలిని, ప్రాణాగ్ని, భవాని, భువనేశ్వరి, అన్నపూర్ణ, మహామాయ, పయశ్విని, త్రిపుర ఈ పన్నెండు తాంత్రికమైనటువంటి, వామ మార్గమయినటువంటివి. ఇవి రెండు జంట జంటలుగా పనిచేస్తాయి.

దక్షిణ మార్గమంటే జ్ఞానమార్గం(థియరి) వామ మార్గం అంటే శక్తి సంచయం. దాని సదుపయోగం (practical utility). ఈ విధంగా జ్ఞానాన్ని శక్తిని సాధించి ఆధ్యాత్మిక భౌతిక శక్తులలో రెండింటిలోను సాధకుడు ఫలితాన్ని పొందుతాడు. గాయత్రి మంత్రంలోని 24 అక్షరాలు ప్రకృతిలోని 24 శక్తులను, మానవ శరీరంలో గల 24 శక్తులను సూచిస్తాయి.

శరీరపరంగా చూస్తే పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ తన్మాత్రలు, పంచ ప్రాణాలు మనస్సు- బుద్ధి- చిత్తం- అహంకారం అనే 4 తత్వాలు కలసి 24. వీటిని "ఆత్మ" అనే సూర్యునికి సమర్పించి, ఆత్మ సంకల్పానుసారం జీవిత విధానాన్ని ఏర్పరచుకోగలిగితే గాయత్రి మంత్ర సిద్ధి పొందినట్లే.

ప్రకృతిపరంగా చూస్తే సంవత్సరానికి 12 అమావాస్యలు, 12 పూర్ణిమలు కలసి 24 వస్తాయి. రోజుకు 24 గంటలు. వీటికి ప్రతీకయే గాయత్రీ మంత్రం.

"గయాం త్రాయతి ఇతి గాయత్రి"- ప్రాణాలను రక్షించేది గాయత్రి. శక్తి పలురకాలు. కాని అన్నింటికి మూలమైన శక్తి ఒకటి ఉన్నది. దానిని ఆత్మశక్తి అనీ, గాయత్రి అనీ, బ్రహ్మ సంకల్పం అనీ అంటారు. దీనినే ఇచ్ఛాశక్తి అని కూడా అంటారు. ఈ ఇచ్ఛాశక్తికి తోడు జ్ఞానశక్తి, ఈ రెండింటి ఫలితం క్రియాశక్తి. ఈ త్రిపుటిలో ఇచ్ఛ ప్రధానమైంది. జ్ఞానం, క్రియ అనేవి ఇచ్ఛను సాధించేందుకు కావలసిన పరిపూరక శక్తులు.

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ". జ్ఞానానికి ఒక హద్దంటూ ఉండదు. గాయత్రీమంత్రం, సాధకునికి ఋషిత్వ స్థాయిని ప్రసాదించి, దేవర్షిస్థాయికి తీసికొనిపోతుంది. అందుకోసం జ్ఞాన పక్షానికి చెందిన 12 శక్తులను, విజ్ఞాన పక్షానికి చెందిన 12 శక్తులను అందిస్తుంది.

గాయత్రీమంత్రం సంవత్సర ప్రజాపతికి సంకేతమైనటువంటి 12 పూర్ణిమలు, 12 అమావాస్యలు ఆధ్యాత్మిక రహస్యాలు అందించే ఒకానొక భావపరంపర. ద్వాదశ రాశులలో సంచరించే సూర్యుడు- సూర్య విద్య, అమృత వర్షం కురిపించే చంద్రుడు- చంద్ర విద్య కలిసి భూమిమీద చూపే ప్రభావం గాయత్రి మంత్రానికి జ్ఞాన పక్షంగా గ్రహించాలి. ఏ జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నా విజ్ఞానం కావాలి. విజ్ఞానం యంత్రాలను నిర్మిస్తుంది. విద్యుచ్ఛక్తి యొక్క నియమాలు దానికి జ్ఞాన పక్షం. ఈ శక్తిని ఉపయోగించుకోవటానికి కావలసిన యంత్రాల నిర్మాణం విజ్ఞాన పక్షమవుతుంది.

## కాలజ్ఞానానికి ఆధారాలు

గడియారంలో కాలాన్ని సూచించటం కొరకు గడియారంలోని ముళ్లు డయల్‌పై తిరుగుతూ కనిపిస్తున్నా దాని వెనకాల ఉన్న పళ్ల చక్రాలు రకరకాల ఆకృతుల్లో, పరిమాణంలో ఉండి టైమును సూచించటానికి సహకరిస్తాయి. గడియారం అనే యంత్రం

ఉదారత లేకపోవడం పశుత్వానికి ప్రతీక.

మనకు కావలసిన సమయాన్ని సూచించినట్లే, ప్రకృతిలోని సహజ యంత్రాలు- అంటే సూర్యుని చుట్టూ భూమి తిరుగుతూ, తన చుట్టు తాను తిరగటం వల్ల మనకు 'కాలం' ఏర్పడుతుంది ఇదే విధంగా సూర్యుని చుట్టూ తిరుగుతున్న ఇతర గ్రహాలు ఇంకొక కాలమానాన్ని సూచిస్తూఉండాలి.

## యంత్ర మూలం

దేనినైనా అభివ్యక్తపరచటానికి (expression కనిపించటానికి) కొంత చోటు (space) కావాలి. దీనినే జ్యామెట్రిలో (geometry) లో త్రిభుజంగా చేస్తారు. అధ్యాత్మిక భాషలో త్రిభుజాన్ని అగ్ని అంటారు. అనంతం అనిర్వచనీయం అయిన దానిని నిర్వహించటానికి అగ్ని కావాలి. (అగ్ని యొక్క తన్మాత్ర రూపం) అగ్ని స్థూలంగా ఉన్న వస్తువును సూక్ష్మం చేయగలుగుతుంది. సూక్ష్మంగా ఉన్నదానిని స్థూలంగా చేయగలుగుతుంది. ఉదాహరణకు మంచుగడ్డ రూపంలో ఉన్న నీరు (స్థూల పదార్థం) వేడి చేస్తే మంచు ద్రవంగా మారుతుంది. ఇంకా వేడి చేస్తే ఆవిరిగా మారుతుంది. నీరు ఆవిరి రూపంలో దూరంగా పోయి కంటికి కనిపించనంత సూక్ష్మస్థితికి చేరుకుంటుంది. ఒక గాజుగ్లాసులో ఐస్ ముక్కలు వేస్తే, బయట వాతావరణంలో సూక్ష్మరూపంలో ఉన్న నీటి అణువులు చల్లబడి నీటి బిందువులుగా మారి గాజుగ్లాసు బయటవైపు కనిపిస్తాయి.

ఊహించలేని దానిని అనంతమైనదని అంటాము. ఇంగ్లీషు భాషలో దీనిని infinite అంటారు. జామెట్రిలో '0' అంటారు. జామెట్రిలో లైను (–), త్రిభుజం (△), చతుర్భుజం (□) మొదలైనవి చూస్తాం. వీటి వివిధ కలయికలతో రకరకాల లక్ష్యాలను సాధించడానికి రకరకాల యంత్రాలను నిర్మించడం జరిగింది.

సృష్టి శివశక్తుల సమ్మేళనం. దీనినే శంకరాచార్యులవారు ఇలా అన్నారు.

శివశ్శక్త్యా యుక్తో యది భవతి ప్రభవితుం
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పన్దితు మపి
అ తస్త్వా మరాధ్యాం హరిహర విరించాదిభి రపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృత పుణ్యం ప్రభవతి

**తాత్పర్యం :** తల్లీ ! సర్వ మంగళా ! నిన్ను చేరినపుడే శివుడు ప్రకాశాన్ని పొంది ప్రపంచ నిర్మాణం చేయగలుగుతున్నాడు. హరిహర బ్రహ్మాదుల చేత పూజింపబడుతున్న నిన్ను పూజించడానికి గాని, పొగడడానికి గాని పుణ్యం చేయని వానికి అర్హతలేదు.

గాయత్రి మంత్రంలోని 'త' అక్షరం నుండి 12వ అక్షరం 'వ' వరకు గల శక్తులు జ్ఞాన మార్గానికి సంబంధించినవి. అంటే సృష్టి మొత్తానికి శుభాన్ని చేకూర్చే శివతత్వం కలిగినవని అర్థం. ఈ 12 శక్తులను ఉపయోగించుకోవటానికి, ఆ గుణాలను అర్థం చేసుకొని నిత్య జీవితంలో ఆచరించటానికి 12 యంత్రాలు ఇవ్వబడ్డాయి. ఈ మొత్తం శివతత్వానికి చెందినవి.

అదే విధంగా శక్తికి సంబంధించి గాయత్రీ మంత్రపు 13వ అక్షరమైన 'స్య' నుండి 24వ అక్షరమైన 'యాత్' వరకు గల 12 అక్షరాలలో జ్ఞానాన్ని అంటే పంచ భూతాలతో కూడిన (ఆకాశ, వాయువు, అగ్ని, జలం, పృథ్వి) ప్రపంచము నందు శాంతి సౌభాగ్యం, సమృద్ధులతో పాటు, మానవుడు అమరత్వాన్ని సాధించటానికి కావలసిన విజ్ఞానం పొందుపరచబడింది.

శరీరంలో గల కుడి ఎడమ చేతుల సమన్వయంతోనే మనం అన్ని పనులు చేసుకోగలుగుతాం. వీటి మధ్య సమన్వయం లోపిస్తే, వామ హస్తం, దక్షిణ హస్తం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే అంతా అస్తవ్యస్తం అవుతుంది. మనం ఏ పని చేసినా దాంట్లో అవ్యక్తంగా జ్ఞానం, వ్యక్తంగా చేస్తున్న పని, ఈ రెండింటి మధ్య సమన్వయం కనిపిస్తుంది. అందువలన నిజమైన యోగవిద్య దక్షిణ (జ్ఞాన) వామ (విజ్ఞాన) మార్గముల సమన్వయమే అని చెప్పవచ్చు. దీనినే యోగక్షేమములని భోగ భాగ్యాలని అంటారు. సద్గురువు భోగ మోక్షాలతోపాటు యోగ క్షేమాలను దక్షిణ వామ మార్గముల ద్వారా సాధకునికి అనుగ్రహిస్తాడు.

ప్రకృతిలోని 24 శక్తులు మన శరీరంలోనూ ఉన్నాయి. 25వ శక్తి లేదు. ఈ 24 శక్తులు పూర్తిగా వినియోగించుకోగలిగితే మానవ శరీరాన్ని పూర్తిగా వినియోగించుకొన్నవారు అవుతారు. జ్ఞానం ఒక్కటే సరిపోదు విజ్ఞానం కూడా కావాలి. టెక్నాలజి తెలియాలి. ఇవి తాంత్రికమైనవి. వామ మార్గం వద్దనకండి, తాంత్రికమైనవి వద్దనకండి. మనిషికి కుడి చెయ్యి, ఎడమ చెయ్యి ఎలాగున్నాయో, ఆధ్యాత్మిక జగత్తులో దక్షిణ వామ మార్గాలు అలాంటివి. వీటితో ఏ ప్రమాదం లేదు. నిజం చెప్పాలంటే భౌతిక జగత్తులో వామ మార్గమే ముఖ్యమైనది. సుఖసాధనాలు టెక్నాలజి వల్లే లభిస్తాయి. తంత్ర విజ్ఞాన మంటే టెక్నాలజియే.

★★★

**తనకూ, ఇతరులకూ ప్రయోజనకరమైన గుణం- ఉదారత.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-11

# హనుమంతుని మహిమాన్విత బాల్యం

"ఈ బాలుని శ్రీరామభక్తి సాధన యుగయుగాల వరకు కీర్తింపబడుతుంది." అని మతంగ మహర్షి ఆశీర్వదించడం అక్కడున్న వారందరికీ మహదానందాన్ని కలిగించింది. ఆశీర్వాదం విన్న వెంటనే శిశువు ముఖం కోటికోటి కాంతులతో విరాజిల్లడం అంజనాదేవి కళ్లారా చూచి పులకించిపోయింది. తన్ను తాను సంబాళించుకోలేకపోయింది. వెంటనే పుత్రుని నుదుటిపై ముద్దు పెట్టి గట్టిగా హృదయానికి హత్తుకుంది. మైమరచిపోతున్న అర్థాంగికి కేసరి కర్తవ్యాన్ని గుర్తుచేశాడు. ఇరువురు కలసి వచ్చిన అతిథులందరికి వీడ్కోలు చెప్పడం మొదలుపెట్టారు. వానర సామ్రాజ్యాధిపతి అయిన వాలికి, ఆతని సోదరుడు సుగ్రీవునకు సత్కారాలతో సపరివారంగా సగౌరవంగా వీడ్కోలు పలికారు. ఋక్షరాజు జాంబవంతుని పాదాలు తాకి ఆశీర్వచనం తీసుకున్నారు.

బంధుమిత్రులందరికీ కేసరి దంపతులు యథోచితముగా వీడ్కోలు పలికారు. స్నేహాభిమానాలకు మారుపేరైన కేసరి దంపతులవద్ద వీడ్కోలు తీసికునే సమయంలో ప్రేమతో వారి కన్నులు చెమర్చాయి. పట్టరాని ఆనందంతో గొంతులు గద్గదికమయ్యాయి. అంజనాదేవితో- "అమ్మా! మీరు మాకు తల్లిలాంటి వారు. తల్లిని వదిలివెళ్లేసంతానం ఎంతగా వ్యథ చెందుతుందో మమ్మల్ని చూస్తేనే తెలుస్తోంది కదా ! మమ్ములను మరచిపోవద్దు" అంటూ కదలివెళ్లారు. ఆ వనచరుల మాటలు విన్న అంజనీమాత హృదయం కదిలిపోయింది. గుండెల నిండా ప్రేమ నిండిపోయింది. ఏమీ బదులు పలకలేకపోయింది.

అందరను పంపించిన తర్వాత అంజనీదేవి, కేసరి కుమారునితో సహా మతంగ మహర్షి వద్దకు వచ్చారు. ఆయనను చూడగానే అంజనాదేవీ తన్నుతాను నిలువరించుకుని ఆనంద బాష్పాలు జలజల రాల్చింది. భావోద్వేగాలకు అతీతుడైన మహర్షి కూడ స్పందించిపోయాడు. ఆయన కన్నులు కూడ సూక్ష్మంగా చెమర్చాయి. అయినా చిరునవ్వుతో "బిడ్డా! భగవంతుడు నీపై గొప్ప బాధ్యతనుంచాడు. దీనికొరకే కదా ! ఋషభాచలంపై కఠోర తపస్సు చేశావు. ఆ పరమశివుని పుత్రునిగా పొందగలిగావు. ఈ బాలుని జాగ్రత్తగా పోషించవలసి ఉంది. బిడ్డకు ఏ ప్రమాదాలు జరుగకుండా చూచుకోవాలి. నీ బిడ్డ రుద్రుడే కాదు. శివుడు కూడ. అందువల్ల అప్పుడప్పుడు ఉదాసీనంగాను ఉండే అవకాశముంది. ఆ సమయాల్లో నువ్వు నేర్పును ప్రదర్శించాల్సి ఉంటుంది. జాగ్రత్తగావిను. ఎప్పుడైనా బాల్యచాపల్యంతో రౌద్రంగా ప్రవర్తిస్తే వెంటనే ఆతని చెవిలో 'రామ' నామాన్ని ఉచ్చరించు. వెంటనే శాంతిస్తాడు. మరెప్పుడైనా వైరాగ్యభావంతో నీరుగారిపోతుంటే రామకార్యం నిర్వహించాల్సి ఉందన్న విషయాన్ని గుర్తుచెయ్యి. వెంటనే చైతన్యవంతుడౌతాడు" అంటూ భవిష్యత్తుకు అవసరమైన రహస్యాలను విప్పిచెప్పాడు. దంపతులిద్దరు మిక్కిలి శ్రద్ధగా ఆలకించారు.

మహర్షి లేచి నిలబడి అంజనాదేవి తలపై చేయిపెట్టి నిమురుతూ- "అమ్మా ! నేను ఎక్కడ ఉన్నా మిమ్మల్ని గుర్తుచేసుకుంటూనే ఉంటాను. మధ్య మధ్యలో వచ్చి నిన్ను నీ బిడ్డను చూచిపోతుంటాను." పాదాలపై వ్రాలిన వానర దంపతులను ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

ఋషులందరను పంపించిన దంపతుల హృదయం ఒక్కక్షణం శూన్యంగా మారిపోయింది. తమ గురుతర బాధ్యతను నెమరుకు తెచ్చుకుంటూ భవనంలోనికి ప్రవేశించారు. దేవర్షి నారదుడు, మహర్షి మతంగుడు ఇచ్చిన ఆశీస్సులు వారిచెవులల్లో ఇంకా మారుమ్రోగుతూనే ఉన్నాయి. ఇరువురు "రామా ! శ్రీరామా !" అంటూ కుమారుని పరుండబెట్టారు. ఉయ్యాలలోని బాలుడు ఆనందంతో కేరింతలు కొట్టాడు.

అంజనాదేవి ఆలన-పాలనలో హనుమాన్ దినదిన ప్రవర్థమానుడౌతున్నాడు. అందరి శిశువుల్లాగా ఏడవడం, అల్లరిచేయడం అంతగా లేవు. కాని చపలత్వం మాత్రం అప్పుడప్పుడు పెచ్చుమీరిపోతోంది. అప్పుడప్పుడు అతి నీరసంగా కనిపించేవాడు. మతంగ మహర్షి చెప్పిన ప్రకారం అంజనాదేవి శ్రీరాముని గుర్తుచేసేది. వెంటనే మామూలుగా మారిపోయేవాడు. అవసరాన్ని బట్టి

ఉదారత ప్రేమకు సంస్కరించబడిన రూపం.

దాసదాసీలుకూడ ఇదే సూత్రాన్ని అవలంబించేవారు. శిశువు నిద్రించే సమయంలో ఆతని శరీరం నుండి బంగారు కాంతులు ప్రసరిస్తూ ఉండేవి. ఆ కాంతికిరణాల నుండి మందస్వరంతో "రామ-రామ" అంటూ రామనామం వినిపిస్తూ ఉండేది. మొదట్లో దాసీలు, తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. కాని మెల్లమెల్లగా ఈ స్థితికి అలవాటు పడిపోయారు. ఆ మధురధ్వనికి ముగ్ధులయ్యేవారు. భవనంలోని వారందరికి ఒక క్రొత్త విషయం అనుభవానికి వచ్చింది. ఆ బాలుని చేతిలోనికి తీసుకున్న వారందరికీ గతంలో ఉన్న రోగ బాధలు, శారీరిక బాధలు ఉపశమించసాగాయి. అలసట తీరిపోయేది. శరీరంలో క్రొత్త చైతన్యం ప్రవహించేది. ఆతని స్పర్శలో గల మహత్తును అందరు గుర్తించారు. హనుమంతుని స్పర్శ సకలరోగాలను, సంతాపాలను హరించివేస్తోంది. అందరికీ ఆశ్చర్యం అనిపించేది. కాని తన పుత్రుని జన్మరహస్యం తెలిసిన అంజని మాత్రం "కాలకూటవిషాన్నే గళంలో నిలుపుకున్న నీలకంఠునకిది ఒక లెక్కా" అనుకుంటూ లోలోపలే మురిసిపోయేది. ఎవరైనా ప్రస్తావిస్తే "నా బిడ్డ శ్రీరామభక్తుడు. ఇదంతా ఆ రామునిదయ మాత్రమే" అంటుండేది. ఆశ్చర్యకరమైన ఏ సంఘటన జరిగినా ఇదే జవాబిచ్చేది.

ఒకరోజున దాసీలు పిల్లవానికి స్నానం చేయించి తల్లి ప్రక్కలో పరుండబెట్టారు. తల్లికడుపునిండా పాలుత్రాగించింది. శిశువు నిద్రలోనికి జారుకుంటూ నోరుతెరిచి ఆవులించాడు. అప్పుడే అటువైపు చూచిన అంజనాదేవి ఒక్కసారిగా అవాక్కైపోయింది.

*అనువాదం- పొన్నూరు హైమవతీ శాస్త్రి*

★★★

## దయాగుణమే గొప్పవాణ్ణి చేసింది

*పాఠశాలకంతటికీ మేధావి ఆ విద్యార్థి. కాని పేదవాడు. స్కాలర్‌షిప్ లభిస్తోంది. అది ఆతని చదువుకు, భోజనానికి సరిపోవటం లేదు. ప్రతినెల సమయానికి ఫీజు చెల్లించలేక పోతున్నాడు. ఆఖరుకు రాత్రిపూట చదువుకోవాలంటే దీపం కూడ వెలిగించుకోలేనిస్థితి. ఎంత కష్టంగా ఉన్నా ఇతరుల ముందు చేయిచాచటం ఆతనికి ఇష్టంలేదు. అందుకని కొన్ని ట్యూషన్లు, స్కాలర్‌షిప్పును కలుపుకుని జీవనం, చదువుసాగిస్తున్నాడు.*

*మేధావి అయిన ఆ విద్యార్థి తనలాగా కష్టపడి చదివే విద్యార్థులను చాలమందిని చూచాడు. ఆతని మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. వచ్చిన డబ్బంతా ఖర్చు పెట్టకూడదు. ఏమైనా సరే రూపాయికి ఒక్క పైసా చొప్పున మిగిల్చి దాచి ఉంచాలి. ఆ డబ్బును కష్టసమయంలో ఇంకెవరికైనా ఉపయోగించవచ్చు. ఆలోచన వచ్చిందే తడవు ఆచరణలో పెట్టసాగాడు. అతనికి చాల తృప్తిగా అనిపించింది.*

*ఆతడు రోజూ ఒక హోటల్లో భోజనం చేస్తాడు. ఆ హోటలును "నాగోపంత్" అనే వ్యక్తి నడుపుతున్నాడు. అతడు అకస్మాత్తుగా క్షయవ్యాధికి గురిఅయ్యాడు. కొద్దిరోజులకు వ్యాధి ముదిరిపోయింది. పని చేయలేని స్థితికి వచ్చాడు. గత్యంతరం లేక హోటలును విడిచిపెట్టి తన గ్రామానికి వెళ్లిపోయాడు. సంవత్సరం మధ్యలోనే వెళ్లిపోవాల్సివచ్చింది.*

*వేసవి సెలవులు వచ్చాయి. సెలవులివ్వంగానే ఆ విద్యార్థి నాగోపంతున్న గ్రామానికి వెళ్లాడు. వారినీ వీరినీ అడిగి ఆతని ఇంటికి చేరుకున్నాడు. నాగోపంతు పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. లేచికూర్చునేదశలో కూడ లేదు. పిల్లవాడువెళ్లి మంచం ప్రక్కన నిలబడ్డాడు. నాగోపంతు చూచి "నాయనా! కూర్చో. మధ్యలో మిమ్మల్ని ఇబ్బందిపెట్టి వచ్చేశాను. క్షమించు. ఏం చెయ్యను? ఇదిగో నా స్థితి ఇలా ఉంది. నేను నీకు 5 రూపాయలు కూడ ఇవ్వాలి. నాకు గుర్తుంది. నాయనా! ఏమీ అనుకోవద్దు. నేనిప్పుడు నీకు బాకీ చెల్లించేస్థితిలో లేను. బహుశా నీవు అందుకే వచ్చి ఉంటావు" అన్నాడు దీనంగా.*

*అప్పుడా బాలుడు "పంతులు గారూ! నేనందుకురాలేదు. మీరు నాకు బాకీ తీర్చివేసినట్లే భావించండి. నేనిప్పుడు మీకు తోచిన సహాయం చేద్దామని వచ్చాను. నేను ఎప్పటినుండో దాచి ఉంచిన 3 రూపాయలు. ఇవిగో తీసికోండి. ఈ కష్ట సమయంలో మీకు ఉపయోగపడితే అంతేచాలు."*

*ఆ చిన్నారి బాలుని దయార్ద్ర గుణానికి నాగోపంతు చలించిపోయాడు. ఆనందంతో ఆతనికి నోటమాట రాలేదు. ఆ సమయంలో మూడు రూపాయలే వారికుటుంబానికి ఎంతో ఉపయోగపడ్డాయి.*

*కరుణామూర్తియైన ఆ బాలుడే ప్రసిద్ధ సమాజసేవకుడైన "మహర్షి కర్వే" గా అందరికీ పరిచయమయ్యాడు. తనజీవితం దీనమానస సేవకే అంకితం చేశాడు.*

**ఉదారతతో కూడిన ప్రేమ సేవగా పరిణమిస్తుంది.**

## సంస్కృతీమూర్తి-పరమపూజ్య గురుదేవులు

# ఋషి పరంపరకు వినూత్న జీవితాన్ని అందించిన యుగఋషి

జూన్ 1971లో జరిగిన గురుదేవుల హిమాలయయాత్ర విశిష్టమైనది. హిమాలయాలలోని దివ్యత్వంతో నిండిన వాతావరణం. వారిగురుదేవులు నమ్మకంతో కూడిన తృప్తితో అన్నారు– ఈసారి ఇక్కడ ఉన్న సమర్థమైన ఋషి సత్తాలు నీకు యుగఋషి బాధ్యతలు అందించాలని పిలిపించారు. తమతమ కాలాలలో సంస్కృతీ స్రష్టలైన ఋషిగణాలు తమవంతు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఆరోజుల్లో పరిస్థితులు, అవకాశాలూ అనుకూలంగా ఉండడం వల్ల వీరు ఆ కాలానికి అవసరమైన విధంగా తమతమ కార్యక్రమాలను చాలా ధైర్యంతో సకాలంలో పూర్తి చేయగలిగారు. కాని ఈనాటి పరిస్థితి ఆపదలతో కూడి ఉన్నది. ఇప్పుడు అనేక కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించవలసి ఉంది. అందుకొరకు ఋషులు నిన్ను ఎంచుకున్నారు. దానికి సంబంధించిన ప్రేరణ, దిశ, సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఋషిజనుల సమైక్య శక్తి సామర్థ్యాలు నీ ద్వారా వెల్లడి కావాలి. నీవు చేయాల్సిందల్లా కాలాన్ని అనుసరించి ఈ సమర్థ ఋషిగణాల సంప్రదాయాలను పునరుజ్జీవింప చేయాలి. ఈ ఋషులద్వారా నిర్వహింపబడిన, అన్వేషింపబడిన పరంపరకు నూతన జీవితం ఇవ్వడం అని చెప్పవచ్చు. మార్గదర్శకులు మాటల్లో మాటగా ఇలా చెప్పారు.

“కాలగతిని మార్చే కార్యక్రమంలో ఏ పని జరగాల్సి ఉందో, అది కేవలం భగవంతుని ఇష్టప్రకారంగానే జరుగుతుంది. కానీ భగవంతుడు ఎప్పుడూ ఆ ఘనతను తనపై వేసుకోడు. ఆ కాలంలోని శ్రేష్ఠుడు, జీవన్ముక్తుడు, ఋషి తుల్యుడు అయిన ఆత్మకు మాత్రమే అందిస్తాడు. ప్రస్తుత కాలానికి ఆ శ్రేష్ఠుడవు నీవే. నీ ద్వారా ఈ మహత్తర కార్యం జరగాల్సి ఉంది. నీతో కలసి పని చేయడానికి లక్షల, కోట్ల సంఖ్యలో స్త్రీ పురుషులకు ప్రేరణ అందించబడుతుంది. అందువల్ల నీవు వెనకడుగువేయవలసిన పని లేదు.” అంటూ అనేకవిధాలుగా చెప్పారు.

తన గురువుగారు చెప్పిన వాక్కుల్లో తన శిష్యులకు చెందుతుందన్న వాక్యం వారిని కట్టిపడేసింది. ఎంతగానో తృప్తి చెందారు. వెంటనే ఋషిగణాలను కలవాలన్న జిజ్ఞాస పెరిగి పోయింది. వారిగురుదేవులు ఇదంతా గమనిస్తూ ఉన్నారు. ఈ విధంగా చెప్పారు.

“ఈనాడు ప్రాచీనకాలానికి చెందిన ఋషులలో దాదాపు ఎవరికీ స్థూల శరీరాలులేవు. కాని నిర్ణయించబడిన ప్రదేశాలలో వారివారి సూక్ష్మ శరీర చేతనత్వం నిండి ఉంది. ఆ పద్ధతినే మనం ఇప్పుడు అనుసరించాలి. శాంతికుంజ్– హరిద్వార్‌లలో దేవాత్మ హిమాలయాల ప్రతిరూపాన్ని నిర్మించాలి. అంతేగాక కాలగతిని మార్చే ప్రక్రియ గమనాన్ని పకడ్బందీగా తయారు చేయాల్సి ఉంది. దానికి పనికివచ్చే పద్ధతిలో ఋషుల సంప్రదాయాన్ని ఆచరణలో పెట్టాల్సి ఉంది.” పైవిధంగా వివరించి మహర్షి గణాలను కలవడానికి మార్గదర్శకులు గురుదేవులను వెంటబెట్టుకుని వెళ్లారు. ఇరువురూ హిమాలయాలలోని అతిరహస్యమైన, నిగూఢమైన ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ మహర్షుల, సాధువుల ఆత్మలు ఈ గురుశిష్యుల రాక కొరకు వేచి చూస్తున్నాయి. విశ్వామిత్రునితో సహా సప్తఋషుల సమూహంకూడ ఉంది. వీరేగాక భగవాన్ పరశు రాముడు, వేదవ్యాసులవారు, దేవర్షి నారదుడు, ఆదిశంకరాచార్యుల వారు, పతంజలి మహర్షి మొదలైన లోకోత్తరదేవ పురుషులూ ఉన్నారు. చైతన్య మహా ప్రభువు, సంత్‌జ్ఞానేశ్వరులు, గోస్వామి తులసీ దాసు వంటి సాధుపురుషులయొక్క ఉనికి ఈ కార్యానికున్న మహత్తును తెలియచేస్తోంది.

వారందరూ చెప్పిన మాటల సారాంశం ఏమిటంటే యుగ పరివర్తన కొరకు స్థూల జగత్తుకన్న, సూక్ష్మ జగత్తు అనేక రెట్లు ఆత్రంగా ఎదురు చూస్తోంది. లౌకికంగా కనిపించే నిష్ఠాగరిష్ఠులైన

**ఉదారత మనిషిలోని మానవీయ శక్తులను అద్భుతంగా వికసింపజేస్తుంది.**

కార్యకర్తల విజృంభణకంటే, సంత్- మహాపురుషుల, దేవ పురుషుల యొక్క సూక్ష్మ సహకారం అనేక రెట్లు అధికమైంది. అందరూ తమతమ కఠోరమైన తపశ్చర్య, గుప్తసాధనల ద్వార భగవంతుని సంకల్పానికి ఒక రూపాన్ని ఇవ్వాలని కోరుతున్నారు. అందరూ తమతమ పద్ధతుల్లో తమ పరంపరను వ్యాపింపచేయడానికి సహాయపడిన వారందరికీ తమ తపశ్శక్తిలో అతివిలువైన భాగాన్ని ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు.

మహర్షులద్వారా అన్వేషించబడి, నడిపించబడిన సంప్రదాయాలకు బీజాలు శాంతికుంజ్‌లో నాటాలని గురుదేవులకు చెప్పారు. హిమాలయాలలోని దివ్యశక్తి వాటిని మొలకెత్తించి- పెంచి- పోషిస్తుంది. హిమాలయాలలోని అలౌకిక సహకారాలతో, మహర్షులతో కలిసిన దివ్యమైన అనుబంధంతో పరమానంద భరితులై గురుదేవులు శాంతి కుంజ్‌కు తిరిగి వచ్చారు. విశ్వామిత్రుని గాయత్రీసాధన, పతంజలి మహర్షి యోగవిద్య, వేదవ్యాసుని గ్రంథరచన, పరశురాముని విప్లవస్ఫూర్తి, యాజ్ఞవల్క్యుని యజ్ఞవిద్య, నారద మహర్షి సంగీత విద్య, చరక మహర్షి యొక్క ఆయుర్వేదం మొదలైన ప్రాచీన ఋషిపరంపరకు నూతన జీవితాన్నివ్వడం మొదలు పెట్టారు. ఇంతేకాకుండా అనేక ఋషిపరంపరలు నేడు శాంతికుంజ్‌లో కొనసాగింపబడుతున్నాయి.

హిమాలయాలలోని సమర్థులైన ఋషులు తమతమ తపశ్శక్తులను ధారపోయడంద్వారా కార్యక్రమాల నడక వేగం పుంజుకుంటోంది. ఋషిగణాలు స్వయంగా శాంతికుంజ్‌లో సూక్ష్మ రూపంలో నివసిస్తూ, ఆ పరిసరాలలో దివ్యత్వాన్ని వ్యాపింప చేస్తామని హామీకూడ ఇచ్చారు. దాని ప్రకారమే నేడు ఋషి పరంపర కొనసాగుతున్న వైనం మనం చూస్తూనే ఉన్నాం.

ఒకసారి పండిత మదన మోహనమిశ్రా 1990 ఆగష్టులో శాంతికుంజ్‌కు వచ్చారు. నిజం చెప్పాలంటే సాధనా సంబంధమైన ఒక అనుభూతి వారిని ఇక్కడకు లాగికొని వచ్చింది. వారు గురుదేవులను పరమశివునిగాను, వందనీయ మాతాజీని పార్వతీ మాతగాను భావించారు. పండిత మదన మోహనమిశ్రా తన తపశ్శక్తి, యోగ శక్తులద్వారా కఠినాతికఠినమైన పనులను కూడ తక్షణమే చేయగలిగేవారు. ఇంతటి అసాధారణ సామర్థ్యాన్ని కలిగి ఉండి కూడ ఇక్కడికెందుకు వచ్చారు? అని అడగడం జరిగింది. అప్పుడు వారు తన అనుభూతి రహస్యాన్ని బయటపెట్టారు.

"నా తపోసాధనలో ఏదో కొంత లోపం జరిగింది. అందువల్లనే గురుదేవులు జీవించిఉండగానే నేను దర్శించుకోలేక పోయాను. ఇప్పుడు వందనీయ మాతాజీద్వారా దీక్ష తీసుకుందామని వచ్చాను. దీనివల్ల మరణానికి ముందైనా నాకు శుభం జరుగుతుంది."

వారు శాంతికుంజ్‌కు వచ్చిన రెండవరోజు ఒక విలక్షణమైన మాట చెప్పారు. "ఈ శాంతికుంజ్ భూమిమీద ఒక అద్భుత ప్రదేశం. ఇక్కడ దేవతలు, ఋషిగణాలు సూక్ష్మశరీరాలతో సంచరిస్తూ ఉంటారు." అన్నారు. మీకెలా తెలుసు? అని అడిగితే దానిదేముంది? ఆజ్ఞా చక్రం పూర్తిగా వికసించినప్పుడు మీరైనా దర్శించ గలుగుతారు అన్నారు. ఆ తర్వాత మాటల్లో- "గురుదేవులు యుగఋషి. యుగావతారులు. సాక్షాత్ శివస్వరూపుడైన మహాకాలుడు." ఈ మాటలను ప్రతిఒక్కరు నమ్మితీరవలసిందే. 21వ శతాబ్దిలో మొదటి 10 సంవత్సరాలుపూర్తికాగానే ఈ విషయం ప్రపంచానికి పూర్తిగా అర్థం అవుతుంది.

పండిత మదనమోహన మిశ్రా 1991లో పరమపదించారు. అయినా వారి అనుభూతులు ఇప్పటికీ అక్షరసత్యాలై నిలిచాయి. ఈ ఆధ్యాత్మిక సత్యాన్ని అనుభూతి పొందగలిగేందుకే గురుదేవులు వైజ్ఞానిక ఆధ్యాత్మిక వాదాన్ని ప్రవేశపెట్టారు.

★★★

**ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.**

**ఏ త్యాగమయినా వృథా కాదు. ప్రకృతిలోని శాశ్వత నియమం ఇది.**

ధారావాహిక : భక్తిగాథ-16

# భక్తుని భావనలు,కర్మలు ప్రభువుకే అర్పించబడతాయి

సాటిలేనిది, సహజము ఐన నారద భక్తి సూత్రాన్ని మననం చేసుకుంటూ భావసమాధిలో ఎప్పుడు లీనమయ్యారో తెలియలేదు. మంచుతో కప్పబడిన తెల్లని శిఖరఛాయలో కూర్చున్న వారందరూ భావసమాధిలో లీనమయ్యారు. సమయం గడిచి పోతున్నది. అకస్మాత్తుగా వాతావరణంలో ఓంకారం దివ్యంగా ధ్వనించింది. రానురాను ఈ పవిత్రనామ స్పందన పెరిగిపోయింది. వేదవాణి వినిపించింది. ఆ దివ్య క్షేత్రంలో ఒక అలౌకిక కాంతిపుంజం సమీపించేసరికి అందరూ అటువైపు చూశారు. నాలుగువేదాలతో సరితూగు బ్రహ్మదేవుని మానసపుత్రులు సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనాతనుడు వచ్చారు. వారి ఉపస్థితి అందర్నీ ఆనందసాగరంలో మునకలువేయించింది. సనకాదులను చూడగానే అందరిహృదయాల్లో శ్రద్ధ, సత్కారభావనలు ఉప్పొంగాయి. నారదమహర్షి తన అగ్రజులైన వీరందరినీ చూచి సంతోషంతో వెంటనే ఏమీ మాట్లాడలేకపోయారు. నయనాలు ఆనందాశ్రువులతో నిండాయి. అనురాగంతో నిండిన హృదయం, శ్రద్ధాసక్తులతో నిండిన అంతఃకరణతో ఈ వేదమూర్తులకు ప్రణమిల్లాడు. నారదుడు నమస్కరించడం చూచి మిగిలినవారు కూడ తమ భావనలను ఆ వేదమూర్తుల శ్రీచరణాలకు అర్పించడానికి ఉద్యుక్తులయ్యారు. సప్తఋషులు స్వయంగా వారిని అర్ఘ్యపాద్యాలతో సత్కరించారు. అందరి శీల, సత్కార, సద్వ్యవహారాలతో పులకితులైన సనకాది ఋషులు అందర్నీ ఆశీర్వదించారు.

మహర్షులనూ, దేవగణాల్నీ సంబోధిస్తూ వారిలాఅన్నారు– "మీ అందరి రూపాలలో సమస్త సృష్టియొక్క సారమంతా నిండి ఉన్నది. ఇక్కడ స్వచ్ఛమైన మనస్సు, భావశుద్ధి ఉన్నాయి. భావ శుద్ధి ఉన్నచోట భక్తి ఉంటుంది. ఎక్కడైతే ప్రగాఢమైన భక్తి ఉంటుందో అక్కడ భావమయుడైన భగవంతుడు సహజంగా ప్రత్యక్షమౌతాడు. భక్తి–భగవానుల పావన సంగమం సృష్టిలో చాలా అపురూపమైంది. ఈ కారణంచేతనే మేమంతా ఈ భక్తి సరోవరంలో స్నానం చేసి ధన్యులవ్వాలని వచ్చాం. వారి వాక్కులను విని సప్తఋషులు ఇలా అన్నారు. "మీ సాన్నిధ్యాన్ని పొంది మేమంతా ధన్యులమయ్యాం. నాలుగు వేదాలూ సాకారమై మావద్దకు వచ్చినట్లుగ మేము అనుభూతిని పొందుతున్నాము."

సనక ఋషి మునులందరితో మీ శీలవినయాలు ఎంతో స్తుతించదగినవి. మేమిచ్చటికి భక్తి గాధను శ్రవణం చేయడానికి వచ్చాము. కనుక దేవర్షిని ఆయన క్రొత్త భక్తి సూత్రాన్ని మాకు వినిపించవలసిందిగా కోరుతున్నాము. వారియందు గల శ్రద్ధతో వినమ్రుడై దేవర్షి ఇలా అన్నారు– "మీ ఆదేశం మాకు శిరోధార్యం." తరువాత వారు భక్తి తీగలను పలికిస్తూ ఉచ్చరించారు–

"తల్లక్షణాని వాచ్యంతే నానామత భేదాత్ (14)

'ఇప్పుడు వివిధ మతాలననుసరించి భక్తియొక్క లక్షణాలను తెలుపుతాము'. ఈ సూత్రం అందర్నీ ఆలోచించడానికి ప్రేరేపించింది. "భక్తి ఒక్కటి, లక్షణాలు అనేకం." ఈ మాట విలక్షణమైంది. కొద్దిసేపు వాతావరణం నిశ్శబ్దమైంది. తర్వాత క్రతుమహర్షి ఇలా అన్నారు– 'దేవర్షి ఈ సూత్రము యొక్క రహస్యాన్ని స్పష్టం చేయాలి. నారద మహర్షి "ఈ రోజు ఈ సూత్ర రహస్యార్థాన్ని స్పష్టం చేయమని సృష్టిరహస్యాలలో నిష్ణాతులైన సనకాది ఋషులను అభ్యర్థిస్తున్నాము" అన్నాడు. నారదమహర్షి మాటలు అందరికీ ప్రీతికరమనిపించాయి. వారుకూడ బ్రహ్మమానసపుత్రుల ద్వారా వినాలని కోరుకున్నారు.

అందరి అభ్యర్థన సనకాది ఋషులకు కూడ నచ్చింది. వారు నారదుడు చెప్పింది సత్యం అంటూ, ఈ విషయంలో నాకు ఒక సంఘటన గుర్తుకొచ్చింది. మేము నలుగురము సృష్టికర్త బ్రహ్మవద్ద ఉన్నాము. అప్పుడు అచ్చటికి సౌర్యాయణి ఋషి వచ్చారు. సృష్టి యొక్క జటిల కార్యాలలో నిమగ్నమై ఉన్న బ్రహ్మ సౌర్యాయణి ఋషి ఆగమానికి చాలా సంతోషించారు. ఆయన నాతో ఇలా

**తెలిసి చేసిన త్యాగం ప్రామిసరీ నోటుగా ఉండిపోతుంది.**

అన్నారు– "వత్సా ! ఈ ఋషి పరమాత్మయొక్క పరమభక్తుడు. భక్తి తత్వము యొక్క రహస్యాన్ని గురించి వీరికి తెలిసినట్లుగా వేరెవ్వరికీ తెలియదు. పరమశివుడే స్వయంగా వీరి పరాభక్తిని ప్రశంసించారు. మీరందరు భక్తితత్వము యొక్క నిగూఢరహస్యాలను గురించి వీరితో చర్చించండి."

సృష్టికర్త ఈ విధంగ చెప్పినమీదట మేమందరము సౌర్యామణి ఋషితో భక్తితత్వాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాసను గురించి అభ్యర్థించాము. మా జిజ్ఞాసకు జవాబుగ వారు ఎంతో మధురమూ, వినమ్రమూ ఐన స్వరంతో ఇలా చెప్పారు– "అన్ని శాస్త్రాలూ, ఆచార్యగణాలూ, భక్తి స్వరూపాన్ని గురించి లెక్కలేనన్ని అభిప్రాయాలను ప్రకటించారు. కానీ యధార్థంలో మానవుని భావనలు ఏ విధంగా భగవంతునివేపు మరలి, ఆయనలో లీనమైపోతాయో అవన్నీ కూడ భక్తి స్వరూపాలే. అవి పూజలైనా కావచ్చు. పారాయణమైనా కావచ్చు. సంకీర్తనల మాధ్యమంలో కూడ కావచ్చు. అన్నీ కూడ భక్తి అనే చెప్పబడుతాయి. అంతెందుకు, భగవంతునికి అప్పగించబడే ప్రతిపనీ, భావమూ, ఆలోచనలూ అన్నీ భక్తే. ఆ విధంగా కాకుండా భగవంతునికి సమర్పించని ఎంతశ్రేష్ఠమైన పని ఐనప్పటికీ అది నికృష్టమే.

ఇలా చెపుతూ వారుతన చిన్ననాటి ప్రసంగాన్ని వినిపించారు. "నేను పేదబ్రాహ్మణ కుటుంబంలో జన్మించాను. నా పూర్వజన్మల కర్మానుభవమేమోగానీ, నేను జన్మించిన కొద్దికాలానికే తల్లి దండ్రులు ఒక ప్రమాదంలో మరణించారు. తల్లి దండ్రులు లేనందువల్ల నా జీవితాన్ని అనేక ఆపదలు చుట్టుముట్టాయి. తినడానికి తిండేలేనపుడు నన్ను చదివించేదెవరు? ఏమీ తోచక అటూ ఇటూ తిరగడమే నాపనయింది. ఎవరైనా కొద్దిగ పెడితే దాన్నే భోజనంగా తీసుకొనేవాడిని. చాలా అవమానకరము, బాధాకరమూ, భయంకరమూ అయిన రోజులు, మనస్సు ఎప్పుడూ దిగులుగా, క్షోభతో కూడుకొని ఉండేది.

"ఒకరోజు మధ్యాహ్నము ఆకలితో తిరుగుతున్నాను. అటుగా వెళ్తున్న ఒక భక్తురాలైన గృహిణికి నన్ను చూచి జాలి కలిగింది. నన్ను తీసికెళ్లి స్నానం చేయించి సాత్విక భోజనం తినిపించి ఇలా చెప్పింది– "బాబూ! పరమాత్మ జీవులన్నింటికి తండ్రి, అందరిపైన ఆయన కృపాదృష్టి ఉంటుంది. ఆయన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి." దానికి నేనేమి చేయాలని ఆ పవిత్రమూర్తిని అడిగాను. ఆమె ఇలా అంది– "పెద్ద విశేషమేమీ లేదు. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునేవరకు నీవు చేసే పనులన్నింటినీ ప్రభువుకు అర్పణచేయి. నీకు సాధ్యమయినంత వరకు ఆయన్నిపిలు." ఆ పవిత్రమూర్తి మాటప్రకారం నేను అదేవిధంగా చేయడం ప్రారంభించాను.

"కాలం గడుస్తూ ఉంది. ప్రభు నామస్మరణ ప్రభావం చేత పూర్వ జన్మల కర్మల భారం కూడ తగ్గుతూ వచ్చింది. ఉదయం మొదలుకొని రాత్రి వరకు కేవలం ఒకే మాట మనస్సులో ఉండేది. నేను ఏది చేసినా భగవంతుని కొరకే చేయాలి. ఆయన్నే పిలవాలి. భక్తియొక్క ఈ పద్ధతి ఎంత చమత్కారమైనదంటే నాకు మంచి గురువుదొరికాడు. సంత్‌పురుషుల సాన్నిధ్యం దొరికింది. భక్తవత్సలుడైన సదాశివుని కృప కలిగింది. సృష్టికర్త బ్రహ్మస్నేహాన్ని పొందగలిగాను, ఋషులసాంగత్యంచేత నేను తెలుసుకున్నదేమిటంటే వ్యక్తుల భావాలకు అనుగుణంగా, వారివారి పనులను, విధులను అనుసరించి భక్తిలో ఎన్నో భేదాలుఏర్పడుతాయి." సౌర్యాయణి ఋషియొక్క ఈ కథను వినిపించి, సనకాది ఋషులు అన్నారు. "యధార్థతత్వపు భావనలన్నింటిని ప్రభువుకు అర్పించడంలో ఉంది. భేదాలను గురించిన విషయానికొస్తే అది దేవర్షి నారదులవారే చెప్పాలి." పరమ పవిత్రులైన సనక ఋషి యొక్క వాక్కులకు అందరూ చాలా సంతోషించారు. ఇప్పుడు వారందరూ సూర్యోదయం తర్వాత చర్చింపబడే భక్తియొక్క నవీన సూర్యోదయాన్ని గురించి ప్రతీక్షిస్తున్నారు.

*అనువాదం – కె. అరవిందమ్మ*

★★★

**ఈ పత్రికను మీరు చదివిన తర్వాత ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.**

**మనిషి యొక్క సంకల్పానికి సాఫల్యం అతడి మానసిక శక్తిపై ఆధారపడి ఉంటుంది.**

బోధకథ

# పరమహంసగా మారిన బాలుడు

అది ఉషఃకాలం దక్షిణేశ్వరంలోగల ఉద్యానవనంలో రెల్లుగడ్డితో వేసిన కుటీరం ముందు, మర్రిచెట్టు నీడలో ఒక బ్రాహ్మణ యువకుడు కూర్చున్నాడు. ఆ కుటీరానికి సమీపంలో రాణిరాసమణి ద్వారా నిర్మింపబడిన మందిర ప్రాణప్రతిష్ఠ హర్షోల్లాసాల మధ్య జరుగుతోంది. తక్కువకులంలో జన్మించిన కారణంగా రాణిరాసమణి నిర్మించిన మందిరంలో మేము ప్రాణప్రతిష్ఠ చెయ్యము అని ఛాందసభావాలు కలిగిన బ్రాహ్మణులు తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. పరిస్థితులకు తలఒగ్గి రాణి ఆ మందిరాన్ని, దానికి సంబంధించిన ఆస్తి మొత్తాన్ని తన కులగురువుకు దానం చేసింది. దీంతో బ్రాహ్మణులు సంతుష్టి చెందారు.

విగ్రహప్రతిష్ఠాపన సందర్భంగా రాణి అందరికీ విందుభోజనాన్ని ఏర్పాటుచేసింది. కొన్నివేల మంది స్త్రీ, పురుషులు ఈ విందులో పాల్గొన్నారు. పలురకాల వంటకాలు సిద్ధం చేశారు. ఒక్కొక్క వంటకాన్ని తీసుకొని వచ్చి వడ్డిస్తున్నారు. బ్రాహ్మణులు వాటిని తిని ఒక బంగారునాణెం దక్షిణగా స్వీకరించి తిరిగి వెళ్లిపోతున్నారు. ఒక పన్నెండు సంవత్సరాల పిల్లవాడు ఈ కార్యక్రమం అంతా తన ఆధ్వర్యంలో జరుగుతోంది అన్నట్టుగా తిరుగుతున్నాడు. బ్రాహ్మణుల కోసం నిర్మించిన కుటీరంలో ఆ పిల్లవాడు ఉంటున్నాడు. మాటిమాటికీ ఆ పిల్లవాడి స్వభావం అందరినీ ఆకట్టుకొంది. మర్రిచెట్టు క్రింద కూర్చున్న బ్రాహ్మణ యువకుడు జరుగుతున్నదంతా నిశ్చలభావంతో చూస్తున్నాడు. విందులో పాల్గొనటానికి వెళ్లాలన్న కోరిక గాని, ఎదురుగుండా జరుగుతున్న కోలాహలం గాని అతని మీద ఎటువంటి ప్రభావం చూపించలేదు. తదేకనిష్ఠతో మందిరం వైపు కళ్లార్పకుండా చూస్తున్నాడు.

మధ్యాహ్నం అయ్యింది. వస్తున్న అతిథుల సంఖ్య పల్చబడింది. ఆ పిల్లవాడి దృష్టి, నిర్వికారంగా కూర్చొన్న ఆ బ్రాహ్మణ యువకుడిమీద పడింది. అతనికి దగ్గరగా వెళ్లి మీరు ఎవరు? అని అడిగాడు.

అభ్యాగతుణ్ణి అని ఆ బ్రాహ్మణుడు బదులు పలికాడు.

మీరు బ్రాహ్మణకులంలో జన్మించారా? అని పిల్లవాడు అడిగాడు.

అవును– అని బ్రాహ్మణుడు బదులు పలికాడు.

భోజనం చేశారా? అని తిరిగి పిల్లవాడు అతన్ని ప్రశ్నించాడు.

లేదు– అని అతను సమాధానం చెప్పాడు.

బ్రాహ్మణులు అందరూ భోజనం చేసి వెళ్లిపోయారు కూడా, మీరు ఎందుకు ఇక్కడ కూర్చున్నారు? వెళ్లండి. వెళ్లి భోజనం చెయ్యండి. రాణి ఒక బంగారునాణెం కూడా దక్షిణ ఇస్తోంది– అని పిల్లవాడు అతనితో అన్నాడు.

నేను బిచ్చగాణ్ణి కాను, భోజనం చేసి దక్షిణ తీసుకోవటానికి ఇక్కడికి రాలేదు. అని బ్రాహ్మణుడు బదులు పలికాడు.

అయితే మరి ఎందుకు ఇక్కడికి వచ్చారు– అని పిల్లవాడు ప్రశ్నించాడు.

దర్శనం చేసుకుందామని వచ్చాను. సరే పద, ఆ రాణీ అమ్మగారి దర్శనం చేసుకుంటాను. ఆవిడ చేసిన పుణ్యానికి ఫలితం నా కళ్లముందు కనిపిస్తోంది అని బ్రాహ్మణుడు ఆ పిల్లవాడితో అన్నాడు.

రాణీరాసమణిని దర్శించుకోవటానికి ప్రస్తుతం వీలుపడదు. బ్రాహ్మణులందరూ భోజనం చేసివెళ్లేవరకూ రాణీరాసమణి భోజనం స్వీకరించదు. అప్పటివరకూ మందిరంలోనే ఉంటుంది అని ఆ పిల్లవాడు అతనితో అన్నాడు.

దర్శనం ఎప్పుడయితే అప్పటివరకూ వేచి ఉంటాను– అని బ్రాహ్మణుడు అన్నాడు. ఆ మాటలు విని పిల్లవాడు వెళ్లిపోయాడు. సూర్యాస్తమయం అయ్యింది. అందరు బ్రాహ్మణులూ భోజనం చేసి వెళ్లిపోయిన తరువాత రాణీరాసమణి మందిరంనుండి బయటకు వచ్చింది. ఆమెతో పాటు ఆ పిల్లవాడు కూడా ఉన్నాడు. మర్రిచెట్టు నీడన కూర్చున్న ఆ బ్రాహ్మణుణ్ణి చూసి ఇద్దరూ ఆగిపోయారు. రాణి రెండుచేతులూ జోడించి ఆ బ్రాహ్మణుడికి వినయంగా నమస్కారం చేసింది. ఆమెకంటే ముందరే బ్రాహ్మణుడు క్రిందకు

**ఉదారుని సంకల్పం సఫలం అవుతుంది.**

సాగిలపడి సాష్టాంగ ప్రణామం చేశాడు. ఇది చూసి రాణి నివ్వెరపోయి వెనక్కు అడుగువేసింది. ఓ బ్రాహ్మణ దేవతా? మీరు ఎంత పని చేశారు? నేను అస్పృశ్యురాలిని, శూద్రురాలిని, మీరు ప్రణామం చేసి నాకు పాపాన్ని అంటగట్టారు అని బాధపడింది.

"ఓ మాతా ! నీవు దివ్యరూపివి, సర్వశ్రేష్ఠమైన మనిషివి. సూర్యోదయం నుండి మీ దర్శనం చేసుకుందామనే ఎంతో ఆశతో ఇక్కడ వేచి ఉన్నాను." అని బ్రాహ్మణుడు ఆమెతో అన్నాడు. మీరు భోజనం చెయ్యలేదు. రండి. వచ్చి భోజనం చెయ్యండి. అని రాణి అతనితో అంది. మీరు వంట చేసిపెడితేనే నేను భోజనం చేస్తాను. అని ఆ బ్రాహ్మణుడు ఆమెతో అన్నాడు.

ఇది ఎలా సాధ్యం? నేను శూద్రకులంలో జన్మించాను అని రాణి బదులు పలికింది. ఏ కులంలో జన్మిస్తే ఏమిటి? నాలో ఏ ఆత్మ అయితే ఉందో అదే మీలో కూడా ఉంది. ఇంక తక్కువ, ఎక్కువ అన్న భేదం ఎక్కడ ఉంది?

రాణి అతన్ని ఒప్పించటానికి ఎన్నో విధాలుగా ప్రయత్నం చేసింది. క్షమించుమని ప్రాధేయపడింది. కాని బ్రాహ్మణుడు ససేమిరా ఒప్పుకోలేదు. జాతి, మతం, ఎక్కువకులం, తక్కువకులం వంటి విశ్వాసాలు మూర్ఖత్వం అంటూ సోదాహరణంగా అనేక పూర్వవృత్తాంతాలు వివరించాడు. ఇంతమంది వ్యతిరేకాన్ని సహిస్తున్న నీవు శూద్రురాలివి, అస్పృశ్యురాలివి కావు. బ్రాహ్మణుల కంటే సర్వశ్రేష్ఠమైన దానివి. మీ ఆత్మగౌరవాన్ని విస్మరించటమే మీరు చేస్తున్న ఏకైక తప్పిదం. నైష్ఠిక బ్రాహ్మణుడైన నందుడు ఉరికంబం ఎక్కుతున్నప్పుడు ఈ బ్రాహ్మణులందరూ ఎక్కడ మాయమయ్యారు? శాపం పెట్టి ఆంగ్లేయులను భస్మీపటలం ఎందుకు చెయ్యలేదు? కులం కారణంగా మీరు శూద్రురాలు అయితే, మీరు ప్రతిష్ఠించిన ఈ అమ్మవారి పూజ, పురస్కారాలు చెయ్యటానికి కూడా వీరు అర్హులు కారు.

నా చేతి భోజనం తింటే, ఈ బ్రాహ్మణులు మిమ్మల్ని కులం నుండి వెలివేస్తారు. అని రాణి ఆ బ్రాహ్మణుడితో అంది.

"వాళ్లు నన్ను వెలివేసేదేమిటి? నేనే ముందర ఈ భోజన ప్రియులను వెలివేస్తున్నాను" అని బ్రాహ్మణుడు అన్నాడు.

బ్రాహ్మణుడి పంతం ముందు రాణి తలవంచక తప్పలేదు. తనతో పాటు వచ్చిన ఆ పిల్లవాడికి అన్నం వండటానికి కావాల్సిన సామానులన్నీ సిద్ధం చేయుమని పురమాయించింది. ఒక బ్రాహ్మణుడు రాణి వండిన భోజనాన్ని తినటానికి సిద్ధంగా ఉన్నాడన్న సంగతి ఊళ్లో అందరికీ తెలిసింది. ఊరు, ఊరంతా ఆ వింత చూడటానికి అక్కడికి వచ్చారు. వివాదం మొదలయ్యింది. అందరూ బ్రాహ్మణుని మీద ప్రశ్నల వర్షం కురిపించటం మొదలు పెట్టారు. బ్రాహ్మణుడు ఏ మాత్రం తొణకకుండా, శాంతంగా బదులిస్తున్నాడు. రాముడు, శివుడు, శబరి, గోపబాలురు, ధర్మశాస్త్రాలు మహాభారతంలోని ఉదాహరణలు చెప్పి అడిగిన వాళ్లని మారు పలకకుండా చేశాడు.

తేజోవంతమైన ఆ బ్రాహ్మణుడి పలుకులు, ఆ పిల్లవాడిని కూడా ప్రభావితం చేశాయి. అద్వైత వేదాంతం యొక్క మొదటిపాఠాన్ని ఈ సంఘటన ద్వారా అతను నేర్చుకొన్నాడు. ఈ సంఘటన ఆ పిల్లవాడి మనస్సు మీద చెరగని ముద్ర వేసింది. ఆ పిల్లవాడే పెరిగి పెద్దవాడై శ్రీ రామకృష్ణ పరమహంస పేరుతో విశ్వవిఖ్యాతి గాంచాడు. తన చిన్నతనంలో జరిగిన ఈ సంఘటనని ఎంతో తన్మయత్వంతో శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు చెపుతూ ఉండేవారు.

అనువాదం - ఉష

★★★

## శ్రీ గాయత్రీశతకం

*తల్లి మంత్రరూపంబుల దలచినంత*
*కరుణ ఉప్పొంగి హృదయము పరవశించి*
*నీదు దోషాల కడగడ్ల నిలువరించు*
*విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం :** *వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. గాయత్రీ మంత్రాన్ని రూపాన్ని మనస్సులో తలచుకోగానే ఆ తల్లిలో కరుణ పొంగిపొరలుతుంది. హృదయం పరవశించిపోతుంది. నీలోని దోషాలవల్ల కలిగిన కష్టాలను తొలగించి వేస్తుంది.*

రచన
సహజకవి, సాహిత్యరత్న,
శతకచతురానన, పద్యకవితా సుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు.

**ఉదార చరితులకు వసుధయే కుటుంబం.**

ప్రత్యేక వ్యాసం

# కంచిమీదుగా నా అరుణాచలయాత్ర-3

'1907వ సంవత్సరం నుంచి. అప్పుడు నాకు పన్నెండేళ్ళు.'

'కుంభకోణం మీ కేంద్ర స్థానమనుకుంటాను. కుంభకోణంలో స్థిరంగా ఎప్పుడూ ఎక్కువ కాలం గడపరనుకుంటాను.'

'నిజమే. పదిహేను సంవత్సరాలుగా, ఈ జిల్లాల్లో పల్లెపల్లెకూ వెళుతున్నాను. నెమ్మదిగా కాశీ వైపు వెళ్లడం జరుగుతున్నది. ఈ పదిహేను సంవత్సరాల్లో ఏ మూడు నాలుగు వందల మైళ్లో తప్ప ఎక్కువ దూరం ప్రయాణం చేయలేకపోయాను. ఎందుకంటే మత సంప్రదాయాన్ననుసరించి, మరీ దూర ప్రాంతమైతే తప్ప, ఎవరైనా కోరితే, ఆ పల్లెను కాని, పట్టణాన్ని కాని దర్శించకుండా పోవటానికి వీలులేదు. స్థానికంగా, ఎక్కడ విడిది చేసినా అక్కడి దేవాలయంలో ఒక ఆధ్యాత్మికోపన్యాసం ఇవ్వాలి. స్థానికులకు ఏవైనా ఉపదేశాలూ అవీ ఇవ్వాలి.'

ఇక నా ఆర్తిని స్వామి కెరుకపరిచాను.

'ఇదివరలో, ఎవరినైనా యోగులను, సాధు సన్యాసులను దర్శించారా?' అని స్వామి ప్రశ్నించారు.

నిస్సంకోచంగా ఇట్లా చెప్పాను.

'ప్రత్యక్ష మహిమ చూపగలిగి, మహోత్తమ సిద్ధి పొందిన పరమ యోగిని ఎవరినైనా దర్శించాలనే నా ఉత్కంఠ. ఆ అన్వేషణతోనే బయలుదేరాను. మామూలుగా సాధు సన్యాసులున్నారంటే వాళ్లు యోగము, మహిమలు, సిద్ధులు మొదలైనవాటిని గురించి ప్రసంగించటం మాత్రమే చేయగలరు. వారి నుంచి ఏమి ఆశించి ఇంకేమీ లాభం ఉండదు. ఏమో! నా యోగ్యతను మించి కోరుకొంటున్నానేమో? ఈ విషయంలో ఏమంటారు స్వామి?'

తేజశ్చక్రాలవంటి స్వామి కనులు నా చూపులను కలిశాయి. ఒక్క నిమిషం ప్రశాంతత తరువాత తమ గడ్డాన్ని వేళ్ళతో తడుముకుంటూ ఇట్లా అన్నారు:

'పరమమైన యోగసిద్ధిని గూర్చి తెలుసుకోవాలన్న ఉత్సాహం అత్యాశ ఎంతమాత్రమూ కాదు. త్రికరణశుద్ధిగా దేన్ని నీవు కోరావో దాన్ని దర్శించగలవు. నీలో ఉన్న చిత్తశుద్ధీ, సంకల్పశక్తి నేను గ్రహించగలిగాను. ఏదో ఒక జ్ఞానజ్యోతి ఇప్పుడే నీలో ప్రకాశించడం ప్రారంభమైంది. ఆ జ్యోతి నీకు దారి చూపి, నీ కోర్కె సిద్ధింపచేయగలదని' స్వామివారు చెప్పిన సారాంశం నేను సరిగానే గ్రహించ గలిగాననుకుంటాను.

'ఇప్పటివరకూ స్వావలంబనమే నాకు. ఇతరత్రా శిక్షణ లేదు. మీ ప్రాచీన ఋషులు చెప్పింది కూడా, అంతర్యామి బయట ఎక్కడో లేదు, నీలోనే వెతుక్కో, చూసుకోమనే కదా స్వామీ! నీవే దేవుడవు. దేవుడు నీలోనే ఉన్నాడు. బయట ఎక్కడా లేదు అనే కదా!' అని ఆగిపోయాను.

స్వామి పెదవులు వేగంగా కదిలాయి.

'పరమేశ్వరుడు అంతటా నిండి ఉన్నాడు. అంతేకాని ఒకరిలో మాత్రమే బంధింపబడి ఉంటాడా? దృశ్యాదృశ్యమైన యీ సర్వ ప్రపంచమూ ఆ ప్రభువుపైననే ఆధారపడి ఉన్నది.'

నేను నాకు మించిన విషయాల్లో అందులోనూ వేదాంత విషయాల్లో మునిగిపోతున్నానని గ్రహించి విషయం మార్చాను.

'అయితే నా కర్తవ్యం ఏమిటంటారు? నా ఆర్తిని తీర్చగల, శిక్షణ కాని, నేను అవలంబించవలసిన పథం కాని ఏమిటో సెలవిస్తారా?'

'ఈ యాత్ర ఇలానే సాగించు. ఈ యాత్రా పరిసమాప్తి అయిన తరువాత నీవు దర్శించిన సిద్ధ పురుషులను, యోగివర్యులను తలంచుకో. వీళ్ళందరిలో నీ మనస్సు ఎవరి పట్ల లగ్నమవుతుందో తిరిగి వారి దగ్గరకు చేరితే నీ కోర్కె తప్పకుండా నెరవేరుతుంది. నీ మార్గం కూడా స్పష్టమవుతుంది.'

ప్రశాంతమూ, గంభీరమూ అయిన వారి మూర్తిపై దృష్టి నిలిపి, ఆ పవిత్రతను తలచుకొని ఉత్తేజం పొందాను.

'కాని స్వామీ! నేను దర్శించే సిద్ధ పురుషులలో యోగులలో ఎవ్వరిపట్లా నా మనస్సు ఆకర్షితం కాకపోతే అప్పుడేం చెయ్యాలి?'

'అట్టి స్థితిలో భగవంతుడే నీ మార్గాన్ని స్పష్టంగా చూపేవరకూ వేచి ఉండవలసిందే. క్రమం తప్పక ధ్యానం చేయటం అలవరుచుకో.

ఇతరుల దోషాలను చూడడం పెద్ద మానసిక రోగం.

మహత్తరమైన విషయాలను ప్రగాఢమైన అనురాగంతో మననం చెయ్యి. ఆత్మజ్ఞానం కొరకు పాటుపడు. నీకు మేలు కలుగుతుంది. బ్రాహ్మీ ముహూర్తం ధ్యానం చేయడానికి చాలా అనుకూలమైన సమయం. తరువాత సాయంకాలం చాలా మంచిది. సరిగ్గా సంధ్యా సమయాన్ని ఎన్నుకోవాలి. ఆ రెండు సమయాలలో సర్వ ప్రపంచమూ గొప్ప ప్రశాంత స్థితిని పొందుతుంది. అందువలన ధ్యానస్థితికి చాలా అనుకూలంగా ఉంటాయి ఆ సమయాలు.'

అనుగ్రహ సూచకమైన దృష్టులు నా మీద బరపారు స్వామి. వారి ప్రశాంత గంభీర వదనాన్ని చూసి నా మనస్సు ముగ్ధత్వం పొందింది. స్వామి వారి సిద్ధిని తలచుకొని విభ్రాంతిని పొందాను. నాలో కలిగిన సంచలనాలు, సంక్షోభాలు స్వామి వారికెప్పుడూ అనుభవంలోకి రావు కదా! నన్ను నేను నిగ్రహించుకోలేకపోయాను.

'స్వామీ! నా ప్రయత్నంలో నేను విఫలుణ్ణి గనక అయితే, మిమ్మల్ని వచ్చి ఆశ్రయించవచ్చును కదా!'

స్వామి మృదువుగా తల ఊపారు.

'నేను పీఠాధిపత్యం వహించి ఉన్నవాణ్ణి. నాకు కొంచెమైనా విరామమంటూ ఉండదు. ఉండేందుకు ఆస్కారం లేదు. సంవత్సరాల తరబడి రాత్రుళ్ళు మూడు గంటలసేపు మాత్రమే నేను నిద్రపోగలిగిన వ్యవధి లభిస్తున్నది. అందువలన ప్రత్యేకంగా నేను శిష్య స్వీకారం చేసి, వారికేవిధంగా ఉపకరించగలను? తమ కాలాన్నంతా శిష్యులకై వినియోగించగల మహాత్ముణ్ణి ఎవరినైనా దర్శించాలి నీవు.'

'కాని అచ్చమైన గురువు లభించటం అరుదని నేను విన్నాను. అంతేకాక నా వంటి పాశ్చాత్యుడేవిధంగా కోర్కె సిద్ధింప చేసుకోగలడు? ఈ విషయం వారు ఒప్పుకొన్నట్లుగా తల ఊపి ఇట్లా అన్నారు:

'ఉన్నదేదో స్థిరంగా, శాశ్వతంగా ఉన్నది. దానిని తెలియవచ్చును.'

'మీరు అలాంటి సిద్ధపురుషుని అనుగ్రహానికి నన్ను పాత్రుణ్ణి చేయలేరా? వారి దగ్గరకు నన్ను పంపండి. అయితే ప్రత్యక్షంగా వారు యోగసిద్ధిని చూపాలి.'

శ్రీచరణులు మౌనధారి అయినారు. పరచుకొన్న నిశ్శబ్ద ప్రశాంతత కొంత గడిచిన తరువాత.

'ఈ దేశంలో ఇరువురు సిద్ధపురుషులను మాత్రమే నే నెరుగుదును. నీ జిజ్ఞాసను వారు తీర్చగల సమర్థులు. ఉత్తర దేశంలో (కాశీ ప్రాంతం) చాలా దూరంగా మహారణ్య మధ్యంలో, మౌనవ్రతం పూని అందొకరు తపస్సు చేస్తున్నారు. ఏ కొద్ది మందికో తప్ప వారి దర్శనం దుస్సాధ్యం, దుర్లభం, ఏ పాశ్చాత్యుడూ ఇంతవరకు వారిని దర్శించనూ లేదు. వారి ఏకాంత స్థితిని చూడనూ లేదు. నేను నిన్ను అక్కడికి పంపించగలను. కాని వారి వలన నీ మనోరథం సిద్ధిస్తుందా, యూరోపియన్‌ను వారు మన్నిస్తారా?' అని సంకోచిస్తున్నాను.

'ఇంకొకరు జనం మధ్యనే ఉన్నారు. వారు పరిపూర్ణులైన సిద్ధ పురుషులు. నిన్ను వారి వద్దకు వెళ్ళమంటాను.'

'ఎవరు వారు?'

'ఆయన్ను మహర్షి అంటారు. ఉత్తర ఆర్కాట్ జిల్లాలో తిరువణ్ణామలై అనే చిన్న ఊరికి సమీపాన జ్యోతిర్లింగ క్షేత్రమైన అరుణగిరి స్వామి నివాసస్థానం. నీవు వారిని దర్శించేందుకు అవసరమైన అన్ని వివరాలూ చెప్పేదా?'

నా మనో నేత్రం ముందు ఏదో ఒక దివ్య రూపం మెరుపు మెరిసినట్లైంది. ఒకానొక సన్యాసి, తన గురువైన మహర్షి వద్దకు నన్ను తీసుకొని వెళ్ళాలని చేసిన వ్యర్థ ప్రయత్నం నాకు తటాలున జ్ఞాపకం వచ్చింది. అతడు చెప్పిన ప్రదేశం గుర్తు వచ్చింది. 'అరుణాచలం....... జ్యోతిర్లింగ క్షేత్రం......' ఔను అదే!

'స్వామీ! చాలా కృతజ్ఞుణ్ణి. ఆ ప్రాంతం వాడే అయిన 'గైడ్' ఒకతను నాకు తెలుసు. కనుక ఆ విషయం నేను చూసుకుంటాను.'

'అయితే అక్కడకు వెళ్ళటం నిశ్చయమేనా?'

నేను వెనకా ముందుగా ఆలోచిస్తున్నాను.

'దక్షిణ దేశం వదిలిపెట్టి వెళ్ళిపోవడానికి, అదిన్నీ రేపే బయలుదేరడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసుకున్నాను' అంటూ నీళ్ళు నములుతూ సందిగ్ధంగా చెప్పాను.

'అట్లా అయితే నా కోరిక ఒకటి ఉంది. అభ్యర్థన అన్నమాట' అన్నారు స్వామి.

'అంతకన్నా నాకు కావల్సింది ఏముంది స్వామీ! చెప్పండి.'

'మహర్షిని దర్శించకుండా, దక్షిణదేశం వదలిపోనని వాగ్దానం చెయ్యాలి. నేను కోరేది అంతమాత్రమే.'

**ఉదారత ఒక దైవీ తత్వం.**

స్వామి కన్నులలో నన్ను అనుగ్రహించాలన్న కాంక్ష గట్టిగా కనపడింది. నేను సరేనన్నాను.

స్వామి పెదవులపై దయతో కూడిన మందహాసం. వారి వదనం వెలిగిపోయింది.

'తొందరపడవద్దు. నీ కోర్కె సిద్ధించాలి.'

స్వామి విడిది ముందు విడిసిన జనసందోహం నుంచి వెలువడిన సంరంభం ఆ గదిలో మెల్లగా వినవచ్చింది.

'క్షమార్హుణ్ణి స్వామీ! తమ అమూల్యమైన కాలమెంతో నాకై వ్యయమైంది. నన్ను మీరు మన్నించాలి.'

శ్రీవారి గంభీరవదనంలో పెదవులు విడివడ్డాయి. నా వెనుకనే ముందు గదిలోకి వచ్చిన నా మిత్రుని చెవిలో ఏదో మెల్లగా చెప్పారు. వారు మాట్లాడిన మాటల్లో నా పేరు మాత్రమే నేను గ్రహించగలిగాను. గుమ్మం దాటుతూ స్వామికి ప్రణామం చెయ్యడానికి వెనుదిరిగాను. వెళ్ళిపోతున్నాను కదా, స్వామివారు నన్ను తమ వద్దకు రమ్మని పిలిచి, వీడ్కోలు సందేశాన్ని ఇచ్చారు.

'నన్ను జ్ఞాపకం ఉంచుకోండి. నిన్ను ఎప్పుడూ నేను జ్ఞాపకం ఉంచుకుంటాను.'

అంతరార్థంతో కూడి గురు గంభీర భావపూరితములైన ఈ మాటలు వింటూ అయిష్టంగానే స్వామి వారి దగ్గర సెలవు తీసుకొన్నాను. లేతవయస్సులోనే భగవదంకితమైన పూతచరిత్రగల మహానుభావుడు ఈయన. ప్రాపంచిక భోగ భాగ్యాలకు, సుఖదుఃఖాలకు, సమస్త ద్వంద్వాలకు, అతీతుడైన వైరాగ్య చక్రవర్తి. సర్వసంగ పరిత్యాగి. నిర్లిప్తుడు, నిరీహుడు, సమస్తాన్ని సన్యసించినవాడు. సమస్త పరిత్యాగమొనర్చినవారు. ప్రాపంచిక వస్తుజాతం ఏదైనా ఆ స్వామికి సమర్పణం చేయబడితే, పాత్రులకు, అర్థులకు, మళ్ళీ ఆ వస్తువులన్నీ అనుగ్రహించబడడమే జరుగుతుంది. పరమ సుందరమూ, స్నిగ్ధమూ, మనోజ్ఞమూ అయిన స్వామి వారి మూర్తి నా మనోఫలకంపై శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

ఆ సాయంకాలం వరకూ చెంగల్పట్‌లోనే అటూ ఇటూ తిరుగుతూ గడిపాను. సాయంకాలం చెంగల్పట్ విడిచే ముందు మళ్ళీ ఇంకోసారి స్వామి దర్శనం చేసుకున్నాను. చెంగల్పట్ విడిచి పెట్టే ముందు స్వామిని ఆ ఊళ్ళో పెద్ద దేవాలయంలో దర్శించాను. ఆడా, మగా, పిల్లా, పాపలతో గుమిగూడి ఉన్న జనసందోహానికి ఉపన్యాసం శ్రీవారు చెబుతున్నారు. గంభీరమైన నిశ్శబ్దం అంతటా నిండి ఉండగా స్వామి వారి ఉపన్యాసాన్ని భక్తి శ్రద్ధలతో ఆలకిస్తున్నారు వారు. వారు ప్రసంగిస్తున్న భాష నాకు తెలియక పోయినప్పటికీ పండితుడి మొదలు పామరుడి దాకా శ్రద్ధాళురై వింటున్నారని మాత్రం ప్రత్యక్షంగా గ్రహించగలిగాను. అత్యంత గహనములైన విషయాలను అతి సులభమైన తీరుతెన్నులతో బోధించగలవారు వారని, వారి పరిచయం వలన నేను తెలుసుకోగలిగాను. అంతులేని ఆ జనసందోహాన్ని అంటే భక్తి శ్రద్ధలతో స్వామి వాక్కులను వింటున్న ఆ శ్రోతలను చూసి వారి అచంచలమైన, విశుద్ధమైన భక్తి ప్రపత్తులను చూసి నాకు అసూయ లాంటిది, అసంతృప్తి లాంటిది కలిగింది. స్వామి వారు పరమ పురుషులే. ఈ ప్రజల గాఢమైన శ్రద్ధాభక్తులను చూసి నాకు అట్టి మనఃస్థితి లేదు కదా అన్న అసూయ ఆ ప్రజలపైన నాకు కలిగింది. ఎందుకంటే ఆ ప్రజలకు భగవంతుని అస్తిత్వం పట్ల అపారమైన అచంచలమైన విశ్వాసం ఉన్నది. వాళ్ళెప్పుడూ సంశయాత్మకులు కాలేరు. కారు. భగవంతుని అస్తిత్వాన్ని గూర్చిన అనుమానాలకు, తర్కాలకు వారి మనస్సుల్లో తావులేదు. భగవంతుడున్నాడు అనే ఆ భావనే గొప్ప బలమూ, రక్షా వారికి. అనంతమైన సృష్టిలో ఈ చిన్న భూగోళమూ, ఆత్మ, పరమాత్మ, ఆత్మజ్ఞానమూ, జిజ్ఞాసా, ఆర్తీ, మనోవ్యాకులత్వమూ, వీటిని గూర్చిన ఆసక్తిని వాళ్లు వ్యక్తపరచరు.

నక్షత్రఖచితమైన నీలాకాశం క్రింద చంగల్‌పట్‌ను విడిచి రోడ్డు మీద ప్రయాణం చేశాము. ఎత్తైన తాటిచెట్లు తలలూపుతూ హోరుమనే గాలిలో తమ గుసగుసలను పరివ్యాప్తం చేయడం చూశాను.

నా మిత్రుడు మా మధ్య నిశ్శబ్దాన్ని భంగం చేశాడు.

'నీవు నిజానికి అదృష్టవంతుడివి'

'ఎందుకని?'

'యూరోపియన్ రచయితలలో స్వామి వారి సందర్శనాన్ని, పరిచయాన్ని పొందినవాడివి నీవొక్కడివే ఇప్పటివరకూ.'

'ఓహో!'

**ఉదారత మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది.**

'ఈ పరిచయం వలన స్వామి అనుగ్రహాశీస్సులను పొందగలిగావు.'

నేను నా విడిది చేరుకునేటప్పటికి అర్థరాత్రి అయింది.

తల ఎత్తి ఆకాశం వేపు చూశాను. ఆకాశం నిండా గుంపులు గుంపులుగా చుక్కలు కాంతులీనుతున్నాయి. యూరోపులో ఎక్కడా అగణితమైన నక్షత్ర సంఖ్యలనెవ్వరూ చూడలేరు. బేటరీలైట్ వెలుగును ముందు పరుపుతూ వడివడిగా మెట్లెక్కి వరండాలో అడుగు పెడుతున్నాను.

ఆ చిమ్మ చీకటిలోనుంచి ముడుచుకొని కూచున్న ఆకారం ఒకటి లేచి నన్ను పలకరించింది.

'సుబ్రహ్మణ్యా! నువ్వా!' అని ఆశ్చర్యమూ, నివ్వెరపాటూ కనపరిచాను.

'ఏం చేస్తున్నావిక్కడ?'

కాషాయ వస్త్రాల సాధువు పళ్ళు బిగబట్టాడు కాసేపు ఏదో మహత్తరమైన ఆలోచనలో మునిగినట్లు.

'నేను మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటానని చెప్పాను కదా సార్!' అని జ్ఞాపకం చేసాడు సరిగ్గా.

'అవుననుకో!' గదిలో ప్రవేశించగానే హఠాత్తుగా ఓ ప్రశ్న అడిగాను.

'నీవు చెప్పావే ఇదివరలో, మీ స్వామి అని. మీకు గురువని, ఆయన్ను మహర్షి అంటారు కదూ!'.

విస్తుపోయాడు హఠాత్తుగా ఈ ప్రశ్న వేసేటప్పటికి.

'మీకెలా తెలిసింది? ఎవరు చెప్పారు మీకు?'

'అదలా ఉంచు. రేపొద్దున మనం స్వామిని దర్శించాలి. నా కార్యక్రమం మార్చుకున్నాను.'

'నాకెంత సంతోషంగా ఉందో! ఇది చాలా సంతోష వార్త' అన్నాడు సుబ్రహ్మణ్యం.

'కాని అక్కడ నేను ఎక్కువ కాలం నిలవడానికి వీలుండదు. మహా అయితే, ఒకటి రెండు రోజులుండగలనేమో!'

ఓ అరగంట సేపు ఏవేవో అడిగి తెలుసుకున్నాను. బాగా అలసిపోయాను. నిద్రకు ఉపక్రమించాను. ఈతాకుల చాప మీద పరమ సంతృప్తిగా మేను వాల్చాడు సుబ్రహ్మణ్యం. నేను వేరే బట్టలు ఇస్తానన్నా వినక ఒక దుప్పటి మాత్రం కప్పుకొని పడుకున్నాడు.

తరువాత హఠాత్తుగా ఎప్పుడో నాకు మెలకువ రావడం మాత్రమే నాకు తెలిసిందీ, గుర్తున్నదీ. అప్పటి వరకూ గాఢనిద్రలో కూరుకొని పోయినాను. గదంతా చీకటిగా ఉంది.

నా నరాలన్నీ విచిత్రంగా బిగదీసినట్లుగా ఉన్నాయి. గదంతా వెచ్చగా 'ఫాన్' తిరుగుతున్నప్పుడు లాగా గాలి నిండింది. తలగడ క్రింద గడియారం తీసి రేడియం ముళ్ళు చూస్తే పావు తక్కువ మూడైంది. అప్పుడు సరిగ్గా ఈ సమయంలో నా పక్క ముందు విచిత్రమైన వెలుగు కనబడితే చప్పున లేచి పక్కమీదనే కూచున్నాను. ఆ వెలుగు వేపు కన్నార్పకుండా చూశాను. క్రమంగా నేను ఏకాగ్రతతో చూస్తూనే ఉన్నాను. అక్కడ ఆ సమయంలో కామకోటి భగవత్పాదుల వదనమూ, అటు పిమ్మట ఆయన మూర్తీ స్పష్టంగా ఆ వెలుగులో నాకు కన్పించి విస్మయం పొందాను. ప్రత్యక్షంగా స్పష్టంగా స్వామి మూర్తిని దర్శించాను.

ఈ సాక్షాత్కారం అత్యద్భుతాలతో కూడినది కదా? చెంగల్పట్టులో స్వామిని దర్శించి నేను తిరిగి రాలేదా? ఆ విషయంలోని యథార్థం గ్రహించాలని కళ్ళు గట్టిగా మూసుకున్నాను. నా కళ్ళ ముందు దృశ్యం యథా పూర్వకంగా ఉంది. అదే పరివేషమండలం. అదే మూర్తి. స్పష్టాతిస్పష్టంగా స్వామి వారి దయ, అనుగ్రహం అనుభవిస్తున్నట్లుగానే ఉన్నది. కళ్లు తెరిచాను. కావిరంగు వస్త్రాల్లో ఆ అనుగ్రహ మూర్తిని భక్తితో దర్శించాను.

ఇంతలో వారి వదనంలో హాసరేఖ తళుక్కున మెరిసింది. పెదవులు విడివడి ఇట్లా నన్ను హెచ్చరించినట్లనిపించింది. ప్రత్యక్షంగా ఎట్ట ఎదుట నిలుచుని నన్ను సంబోధిస్తున్నట్లు అనుభూతి నా కెందుకు కలగాలి? నాకు జరిగిందంతా స్వప్నమో, భ్రాంతో అని కాక, యథార్థంగానే అనిపిస్తున్నది. ఏదో ఒక విచిత్రమైన అనుభూతికి నేను లోనైనాను. స్వామి పెదవుల నుంచి 'వినయాన్ని ఎంతగా ఆశ్రయిస్తే అంత త్వరగా నీ కోర్కె సిద్ధిస్తుంది' అన్నట్లు వినిపించింది.

★★★

**కర్మ పరిపక్వం కావడానికి సమయం పడుతుంది.**

ఆచరణలో అధ్యాత్మ

# మనస్సును అదుపులో ఉంచుకోవాలి

సామాన్యజనుల మానసిక స్థితి పరిస్థితులకు అనుకూలంగా మార్పుచెందుతూ ఉంటుంది. పిల్లవానికి ఆకలికాగానే ఏడుస్తాడు. ఆటబొమ్మ దొరికితే నవ్వుతాడు. అదే పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యాక తన మనస్సును నియంత్రించుకుంటాడు. చిన్నదానికి, పెద్దదానికి బయటపడడు. పెద్ద వారయ్యాక చిన్నపిల్లల మనస్తత్వం శోభనివ్వదు.

గడ్డిపోచలు గాలికి ఎగిరిపోతై. ఆకులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతై. మానవుడు మాత్రం సౌకర్యాలను చూచుకోడు. ఏ పని చేయాలన్నా ఔచిత్యాన్ని ఆలోచించాల్సి ఉంటుంది. ప్రతిష్ఠను నిలబెట్టుకోవాల్సి ఉంటుంది. కాని పరమహంసలు, పిచ్చి వారు మాత్రం పైవిధంగా ఆలోచించుకోరు.

మానవుడు మానసిక వేగాలను అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తాడు. పశుపక్ష్యాదులు అలా చేయవు. ఒక్కొక్కసారి పరిస్థితులు, అవసరాలు చేయగూడని పనులను చేయిస్తుంటాయి. అయినా తన ఆవేశాలను అణచిపెట్టి శిష్టాచారాలను పాటించాల్సి ఉంటుంది. ఆ సందర్భాలలో మనస్సుకు నచ్చకపోయినా చేయాల్సి వస్తుంది.

ఆకలితో ఉన్న కోతి ఇతరులను బెదిరించి, మోసగించి ఆహార పదార్థాలను తీసికొని పారిపోతుంది. కాని మానవుడావిధంగా చేయలేడు. అదేవిధంగా కోపం వచ్చినా ఆపుకోవాల్సి ఉంటుంది. ప్రతిక్షణం మనస్సును అదుపులో పెట్టుకోవాల్సి వస్తుంది. ఇతరుల ధనాన్ని చూచి దోచుకోవాలనుకున్నా దోచుకోలేడు. తరువాత కలిగే పరిణామాలు గుర్తుకు తెచ్చుకుని జాగ్రత్త వహిస్తాడు. సౌందర్యవతిని చూచినప్పుడు మనస్సు తొందరపెట్టినా కండ్లతో చూచి తృప్తి పడతాడే తప్ప శిష్టాచారాన్ని విడిచిపెట్టడు. జన్మజన్మాంతరాలలో కూడ బెట్టిన పశుప్రవృత్తులు చెడు మార్గం వైపు ప్రోత్సహిస్తూ ఉంటాయి. కాని సభ్యసమాజంలో సభ్యుడుగా ఉండడాన మనస్సును స్థిరపరచుకుంటూ ఉంటాడు.

పరిస్థితులననుసరించి తన భావాలను ప్రకటించడంగాని, ఆచరించడంగాని చేయలేకపోతాడు. స్వాభిమానులైనవారు కూడ ప్రతిక్షణం మనస్సును అదిమిపెట్టి పశుప్రవృత్తులను అణచివేసే ప్రయత్నం చేస్తారు. సంస్కారవంతులలో కూడ హీనభావాలు తలెత్తుతూనే ఉంటాయి. కాని వారు వివేకాన్ని కోల్పోకుండా జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఈ ప్రయోజనాన్ని పూర్తి చేయడానికే ధర్మం, నీతి, సదాచారం మొదలైనవి సహకరిస్తాయి.

సాధనావిజ్ఞానంలో మనోనిగ్రహం అనేది తప్పనిసరి విభాగం. దాన్ని సాధించాలంటే మనోరంగంపైకి అవాంఛితమైన ఆలోచనలు, అనవసరమైన ఉద్రేకాలను రానీయ కూడదు. ఒకవేళ ప్రవేశించినట్లైతే కలుపుమొక్కల్లా భావించి పెరికి వేయాలి. మనో నిగ్రహానికి రెండవ పక్షం సౌజన్య సద్భావాలే. వంకరపోయిన వస్తువులను సాగగొట్టి వంకర తీస్తుంటాం. త్రవ్వకాలలో లభించిన లోహాన్ని భట్టీలో కాల్చి శుద్ధి చేస్తాం. తరువాత మనకు కావలసిన వస్తువుగా తయారు చేసికుంటాం. ఇదేవిధంగా ప్రయత్న పూర్వకంగా కుసంస్కారాలను మనస్సునుండి తొలగించాలి, సుసంస్కారాలతో నింపి వేయాలి. సుసంస్కారాల విషయంలో అనేక ప్రయోగాలు, విభాగాలు ఉన్నాయి. అన్నింటికన్నా లాభదాయకమైనదీ, సులభతరమైనదీ, అతిముఖ్యమైనదీ ఒకటున్నది. అన్నివేళలా సంతోష భరితమైన ముద్ర ముఖంలో కనిపిస్తూ ఉండాలి. దీనిని అలవాటుగా మార్చుకోవాలి. దీనివలన వ్యక్తిత్వ విలువ పెరుగుతుంది. ముఖం ఆకర్షిస్తుంది. ఆకర్షణ వల్ల ఆత్మీయత కలుగుతుంది. ఆత్మీయతవల్ల స్నేహం బలపడుతుంది. స్నేహం ద్వార అనుకున్న కార్యాలను సఫలంచేసికోవచ్చు.

నవ్వు ముఖంద్వారానే వ్యక్తి సమర్థత స్పష్టమౌతుంది. నవ్వుముఖం ద్వారానే మానసిక పరిస్థితిని అంచనా వేయవచ్చు. యవ్వన సౌందర్యంకన్నా నవ్వు ముఖమే అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. మనస్సుకు దర్పణం ముఖమేనంటారు. నవ్వు ముఖం లేమిని, విచారాన్ని, విరోధాన్ని బయటకు పొక్కకుండా దాచిపెడుతుంది. పరిచయస్థులంతా పరమ మిత్రులవుతారు. విచ్చుకున్న పుష్పాలు ప్రతి ఒక్కరికి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. మానవులేకాదు. తుమ్మెదలు, సీతాకోక చిలుకలు పుష్పాలకు ప్రియనేస్తాలు. చిరునవ్వుతోనే అసంభవకార్యాలను సంభవం చేయవచ్చు.

మనస్సును అదుపులో పెట్టుకున్న వ్యక్తి కుసంస్కారాలను తొలగించుకుని, సుసంస్కారాలను పెంచుకుంటాడు. నవ్వుతూ నవ్వుతూనే అనుకున్న కార్యాలను సాధిస్తాడు. నవ్వు మానసిక వ్యాధికి టానిక్కువంటిది. ఈ టానిక్కు ద్వార నిరంతరం నూతన శక్తిని పుంజుకుంటాడు. అందువల్లనే మొట్టమొదట మనస్సును అదుపులో ఉంచుకోవాలి.

అనువాదం - పొన్నూరు హైమవతీశాస్త్రి

★★★

శ్రమ ఇచ్చే వరాలు-ఆరోగ్యం, ఆయుష్షు, గాఢ నిద్ర, చైతన్యం, స్ఫూర్తి, సాహసం, ఆత్మవిశ్వాసం

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-39

# పంచకళలతో తాత్త్విక సాధన

పంచకళలతో తాత్త్విక సాధన చెయ్యాలని పరమ పూజ్య గురుదేవులు చక్కగా వివరించారు.

**పృథ్వీతత్వం:-** ఈ తత్వం యొక్క స్థానం మూలాధార చక్రం. అనగా గుదమునకు రెండు అంగుళాలపైన అండకోశంవైపుకు ఉన్నది. సుషుమ్న ఈ స్థానం నుండే ఆరంభం అవుతోంది. ప్రతి చక్రం నందు ఆధారకమలం పుష్పంలాగ ఉంటుంది. ఇది భూలోకానికి ప్రతినిధి. పృథ్వీ తత్వ సాధన ఈ మూలాధార చక్రంలో చెయ్యాలి.

పృథ్వీతత్వం యొక్క ఆకృతి చతుష్కోణం. రంగు పసుపు. గుణం గంధం. అందువలన దీనిని తెలిసికొనే జ్ఞానేంద్రియం ముక్కు. కర్మేంద్రియం మలద్వారం. ఈ తత్వం యొక్క వికృతివల్ల తెల్లకామెర్లు, పచ్చకామెర్లు వంటి జబ్బులు వస్తాయి. భయము మొదలైన మానసిక వికారాలకు దీని ప్రాధాన్యత హెచ్చు. ఈ తత్వంయొక్క వికారాలు మూలాధార చక్రంమీద ధ్యానం ఉంచి శమిస్తాయి.

**సాధనా విధి:-** తెల్లవారు జామున జాముప్రొద్దుండగానే నిద్రలేవాలి. ఒక ప్రశాంతమైన స్థలంలో పవిత్రమైన ఆసనం మీద రెండుకాళ్లు వెనుకకు మడిచి, వాటిపై కూర్చోవాలి. రెండు చేతులు వెనుకకు త్రిప్పి మోకాళ్లమీద పెట్టుకోవాలి. చేతుల వ్రేళ్లు పొట్టను చూస్తూ ఉండాలి. దృష్టిని ముక్కు చివరి భాగాన కేంద్రీకరించాలి. మూలాధార చక్రమునందు 'లం' బీజమున్న పసుపుపచ్చ చతుష్కోణాకార పృథ్విపై ధ్యానముంచాలి. ఈ విధంగా చేయడంవల్ల నాసిక సుగంధంతో నిండిపోతుంది. శరీరం ఉజ్వలకాంతితో నిండిపోతుంది. ధ్యాన సమయంలో పృథ్వీతత్వం యొక్క గుణాలను ప్రయత్న పూర్వకంగా గుర్తుకు తెచ్చుకోవాలి. 'లం' అనే బీజమంత్రమును మనసునిండా ధ్యాన రూపంలో మౌనంగా జపిస్తూ ఉండాలి.

**జలతత్వం:-** పొత్తికడుపుక్రింద, జననేంద్రియంపైన మూలభాగంలో స్వాధిష్ఠాన చక్రంలో జలతత్వం ఉంటుంది. ఈ చక్రం భువర్లోకానికి ప్రతినిధి. రంగు తెలుపు. ఆకారం అర్థ చంద్రాకారం. గుణం రసం, కారం, పులుపు, చేదు, తీపి మొదలైన రసములన్నింటి రుచి ఈ తత్వం కారణంగానే వస్తుంది. దీనిని తెలుసుకునే జ్ఞానేంద్రియం నాలుక. కర్మేంద్రియం జననేంద్రియం. ఈ తత్వం యొక్క వికృతివల్ల మోహం మొదలైన వికారాలు పుట్టుకొస్తాయి.

**సాధనావిధి:-** పైన చెప్పిన విధంగానే ఆసనంలో కూర్చోవాలి. స్వాధిష్ఠాన చక్రంలో 'వం' బీజంతో కూడిన అర్ధచంద్రాకారం కాంతిని వెదచల్లుతూ ఉన్న జలతత్వాన్ని ధ్యానించాలి. దీనివల్ల ఆకలిదప్పులు తగ్గిపోయి సహనశక్తి కలుగుతుంది.

**అగ్నితత్వం:-** నాభి స్థానము నందలి మణి పూరకచక్రంలో అగ్నితత్వం ఉంటుంది. ఇది స్వర్లోకానికి ప్రతినిధి. ఇది త్రికోణాకారంలో ఉంటుంది. రంగు ఎరుపు. గుణం రూపం. జ్ఞానేంద్రియం కన్ను. కర్మేంద్రియం పాదం. ఈ తత్వంయొక్క వికృతివల్ల క్రోధము మొదలైన మానసిక వికారాలు, వాపులు మొదలైన శారీరిక వికారాలు పుట్టుకువస్తాయి. ఇది స్థితిపొందినట్లైతే ఆకలి లేకపోవడం, అజీర్ణం మొదలైన వికారాలు దూరమవుతాయి. కుండలినీ శక్తి జాగృతం అవుతుంది.

**సాధనావిధి:-** పైన చెప్పిన విధంగానే ఆసనంలో కూర్చోవాలి. 'రం' బీజమంత్రంతో కూడిన త్రికోణాకారంలో ఎర్రని రంగుతో ప్రకాశిస్తూ మణిపూరక చక్రమునందున్న అగ్నితత్వాన్ని ధ్యానించాలి. ఈ తత్వం సిద్ధిని పొందితే సహనశక్తి ఎక్కువగా లభిస్తుంది.

**వాయుతత్వం:-** ఈ తత్వం హృదయప్రదేశంలో ఉన్న అనాహత చక్రంలో ఉంటుంది. ఇది మహర్లోకానికి ప్రతినిధి. రంగు ఆకుపచ్చ. ఆకారం షట్కోణం కావచ్చు, గోళాకారం కావచ్చు. రెండు రకాలుగానూ ఉంటుంది. గుణము స్పర్శ. జ్ఞానేంద్రియం చర్మము. కర్మేంద్రియం చేతులు. దీని వికృతివల్ల వాతరోగాలు, ఉబ్బసం మొదలైనవి వస్తాయి.

**సాధనావిధి:-** పైన చెప్పిన విధంగానే ఆసనంలో కూర్చోవాలి. 'యం' బీజ మంత్రంగల గోళాకారం లేక షట్కోణపు ఆకారంలో, ఆకుపచ్చ రంగుతో విలసిల్లుతూ అనాహతచక్రంలో ఉన్న వాయుతత్వాన్ని ధ్యానించాలి. దీని సిద్ధివల్ల శరీరము, మనస్సు తేలికపడతాయి.

**ఆకాశతత్వం:-** ఇది శరీరంలోని విశుద్ధచక్రంయొక్క కంఠ స్థానంలో ఉంటుంది. ఇది జనలోకానికి ప్రతినిధి. రంగు నీలం. అండాకారంలో ఉంటుంది. గుణం శబ్దం. జ్ఞానేంద్రియం చెవి. కర్మేంద్రియం వాక్కు

శ్రమ ఒక బంగారపు ముద్ద. దాన్ని ఏ మూసలో పోస్తే ఆ ఆభరణం తయారవుతుంది.

**సాధనా విధి:–** పైన చెప్పిన విధంగానే ఆసనంలో కూర్చోవాలి. 'హం' అనే బీజమంత్రంతో, విశుద్ధ చక్రంలో అండాకారంలో ఉన్న నీలవర్ణ ఆకాశతత్వాన్ని ధ్యానించాలి. దీని సిద్ధివలన మూడుకళల యొక్క విజ్ఞానం, ఐశ్వర్యం, అనేక సిద్ధులు కలుగుతాయి. ప్రతిరోజు పంచతత్వాలను ఆరుమాసాలపాటు అభ్యాసం చేస్తూ ఉంటే తత్వసిద్ధి కలుగుతుంది. తత్వాలను ధరించడం, నిరోధించడం, పెంచడం తేలికగా జరిగిపోతాయి. తత్వం యొక్క సామర్థ్యం, కళలు పెరగడంతో సాధకుడు కళాధరుడు అవుతాడు. వాని కళలు, మహత్తు స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి.

**తురీయావస్థ:–** మనస్సును పూర్తిగా సంకల్పరహితం చేయడం వల్ల ఖాళీగా ఉన్న మనస్సుకు నిర్వికల్ప స్థితి కలుగుతుంది. దీనినే తురీయావస్థ అంటారు. ధ్యానం, భావం, ఆలోచన, సంకల్పం, ఇష్టం, కోరిక అనేవి మనస్సు నుండి పూర్తిగా తొలగింపబడతాయి. భావరహితమై, కేవలం ఆత్మను మాత్రమే అంతఃకరణలో నిలుపుకున్న సాధకుడు తురీయావస్థలో అడుగు పెట్టినట్లే అవుతుంది. అప్పుడు కలిగే ఆనందం వర్ణనాతీతం. అతనికి ఇతర ప్రపంచంతో ప్రమేయమే లేకుండా పోతుంది. శరీర సంచాలన క్రియకూడ నిలిచిపోయినట్లు అవుతుంది. అంతవరకు చెల్లాచెదరుగా ఉన్న ఆనందం ఒకేచోటకు గుమిగూడి నిలిచిపోతుంది. ఈ స్థితినే సమాధి స్థితి అంటారు.

సమాధి సమయంలో తన సంకల్పమే ఒక సజీవ శక్తిశాలి అయిన దేవతగా దర్శనం ఇస్తుంది. సమాధిస్థితిలో దివ్యేంద్రియాలు, చిత్తవృత్తులు ఏకమై ఆ సంకల్పం మీదనే స్థిరపడి ఉంటాయి. అప్పుడా సంకల్పం అన్ని విధాల చైతన్యవంతం అవుతుంది. కొంతమందికి ఒక్కొక్కసారి ఈశ్వర సాక్షాత్కారం లభిస్తుంది.

భావావేశంకూడ క్షణికంగా సమాధిస్థితిని కలుగచేస్తుంది. భూతప్రేతాలు ఆవేశించినప్పుడు, విపరీతంగా ఆవేశం కలిగినప్పుడు, దైవోన్మాదం కలిగినప్పుడు, సంతోషం పెరిగిపోయినప్పుడు, శోకం ముంచుకవచ్చినప్పుడు, తన్ను తాను మరచిపోయినప్పుడు, నృత్యవాద్యములలో ఊయలలు ఊగినప్పుడు భావావేశంలో ఆత్మహత్య చేసికోవడంగాని, ఇతరులను హత్య చేయడంగాని అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుంది. క్రోధంతో తిరగబడినప్పుడు, వియోగానంతరం కలుసుకున్నప్పుడు, సంగీతసాధనలో భావవిహ్వలత చెందినప్పుడు, అవమానించబడినప్పుడు, భరించలేని నొప్పితో బాధపడుతున్నప్పుడు ఆయా విషయాలపై సమాధిస్థితి కూడా కలుగుతుంది. దాని ఫలితంకూడ సుఖంకాని, దుఃఖంకాని అదే మోతాదులో ఉంటుంది. భయంవల్ల అధికంగా ఆవేశపడిపోతే మరణించిన సంఘటనలు కూడ లేకపోలేదు. కొంతమంది ఉరికంబం ఎక్కక మునుపే భయంతో ప్రాణాలు వదలిన గాథలున్నాయి.

ఆవేశంలో ఉన్నప్పుడు ఆంతరంగిక శక్తులు, ప్రవృత్తులు కలసిపోయి ప్రచండ భావోద్వేగం కలుగుతుంది. దానివల్ల వేర్వేరు దశలలో మూర్ఛరోగం, ఉన్మాదం, ఆవేశం అనే పేర్లతో బాధపడుతూ ఉంటారు. కాని అదేస్థితిలో ఆత్మతన్మయత కలిగినట్లైతే దానిని సమాధి అంటారు. పూర్ణ సమాధిలో పూర్ణ తన్మయత కారణంగా పూర్ణ ఆనందం అనుభవానికి వస్తుంది. మొదట్లో స్వప్నరూపంలో ఆంశిక సమాధి కలుగుతుంది. దైవ చింతనలో ఏకాగ్రత, తన్మయత్వంతో కూడిన భావావేశం కలిగినప్పుడు కళ్లు మూతలు పడిపోతాయి. చేతిలోని మాల జారిపోతుంది. జపం చేస్తున్న నాలుక అనుకోకుండా ఆగిపోతుంది. తన ఇష్టదేవత రూపం లీలగా గోచరిస్తుంది. ఒకసారి అటువంటి క్షణికానుభూతి కలిగిన తరువాత ఐహిక విషయాలమీద విరక్తి కలుగుతుంది. ఈ విరక్తి ఆరంభంలో స్వల్పంగా అనిపిస్తుంది. రానురాను తురీయావస్థలో నడిచినడిచి చివరకు సిద్ధి కలుగుతుంది.

ఆనందమయకోశంలో ప్రధానమైన అంగాలు నాలుగు. (1) నాదము (2) బిందువు (3) కళ (4) తురీయము. ఈ నాల్గింటిని గూర్చి సాధనచేసిన సాధకుడు తన పంచమ భూమిక యందు ఉత్తీర్ణుడు అవుతాడు. గాయత్రి యొక్క ఈ అయిదవ ముఖమును వికసింపచేసినప్పుడు సాధకుడు ఒకటి తర్వాత ఒకటిగా పంచముఖములనుండి గాయత్రీ మాత ఆశీస్సులను పొందగలడు. ఆ తరువాత ఆతనికి లభించవలసింది ఏమీ ఉండదు.

★★★

## పండుగలు

**మార్చి 2009**

| | |
|---|---|
| 11 | హోలి |
| 27 | ఉగాది |

**ఏప్రియల్ 2009**

| | |
|---|---|
| 3 | శ్రీరామనవమి |
| 7 | మహావీరజయంతి |
| 9 | హనుమజ్జయంతి |
| 27 | పరశురామ జయంతి |
| 29 | శంకరాచార్య జయంతి |

**మానవాళి ప్రగతికి మూలాధారం సహకార ప్రవృత్తి.**

జీవించేకళ

# వ్యక్తిత్వవికాసం

**మానవజీవితం కల్పవృక్షం వంటిది :**

భగవంతుని సృష్టి నిర్మాణ కార్యక్రమంలో మానవ జన్మ అతి మహత్వ పూర్ణమైనది. బ్రహ్మదేవుడు సృష్టించిన జీవరాశులలో మనిషి జన్మ మకుటాయ మానమని, దేవతలు కూడా మానవజన్మ కోరుకుంటారని పండితుల అభిప్రాయం. ఇలాంటి మహత్తరమైన, బహు దుర్లభమైన మానవ జన్మ లభించినప్పటికి, జీవితంలో కలిగిన బాధలను, కష్టాలను తట్టుకోలేక, అనేక మంది జన్మరాహిత్యం కోరుకోవటం కద్దు. మనిషి తన స్థాయిని తెలుసుకొని, తనలోని శక్తి సామర్థ్యాలను గుర్తించి, వాటిని ఉపయోగించుకోగలగాలి.

మానవ శరీర నిర్మాణం, అతని మానసిక సామర్థ్యం, ఇతర జీవులకంటె గొప్పగా కనిపిస్తాయి. మానవుడికి ప్రసాదించిన తెలివి తేటలతో, సామర్థ్యంతో ప్రకృతి రహస్యాలను తెలుసుకోగలుగుతున్నాడు, భౌతిక జగత్తులో అద్భుత పురోగతి సాధించాడు. మానవుని సామాజిక జీవితం కూడా ఇతర జీవులకన్న ఉన్నతమైనది. స్వర్గంలో ఉండే సుఖసౌఖ్యాలు ఊహించుకుంటే వాటిని స్వర్గంనుండి భూమిమీదకు తెచ్చుకున్నాడా అని అనిపిస్తుంది.

మనిషి అంటే భౌతిక శరీరం, భౌతిక తలమేకాక, అనేక తలములు, స్థాయిలు ఉన్నాయి.

**1. భౌతిక తలము :-** ఇది చాల ముఖ్యమనిపిస్తుంది. మనకు ఏమి చేసినా భౌతిక తలంలో ఫలితాలు కనిపించాలి. లేకపోతే తృప్తి ఉండదు. మన భౌతిక శరీరానికి పంచ జ్ఞానేంద్రియాలు (కన్ను, చెవులు, నాశిక, నాలుక, చర్మం), పంచ కర్మేంద్రియాలు (చేయి, పాదాలు, వాక్కు, జననేంద్రియాలు, గుద ద్వారం). పంచ జ్ఞానేంద్రియాల ప్రపంచం చాల ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. నేత్రాలతో రంగు రంగుల ప్రపంచాన్ని చూడగలుగుతాము. చెవులతో ప్రకృతిలోని శబ్దములను గ్రహించ గలుగుతాము. నాశికతో సువాసనలను ఆస్వాదించగలుగుతాము. స్పర్శతో సుఖప్రదమైన అనుభూతులు పొందుతాము. భౌతిక ప్రపంచం ఎంత దగ్గరగా సత్యంగా గోచరిస్తుందంటే, అదే అన్నింటి కన్నా ముఖ్యం అనిపిస్తుంది. అందుకే జీవిత కాలమంతా శారీరిక సుఖాలకొరకు వెచ్చిస్తుంటారు, సుఖములను వెతుకుటలోనే జీవితాన్ని వెళ్ళదీస్తుంటారు.

**2. భావనాత్మక తలం :-** సంవేదనాశీలత సుకోమలమైన సూత్రములతో ఈ తలం రచింపబడింది. స్నేహం, ప్రేమ, దయ, కరుణ, భక్తి మొదలైన అమూల్య రత్నములు ఈ పరిధిలోకి వస్తాయి, మానవీయ సంబంధాలకు పునాదులు తయారు చేస్తాయి, మనుష్యులను చేరదీస్తాయి. కలసి ఉన్నప్పుడు కలిగే ఆనందం, విడిపోయినపుడు కలిగే బాధ భావనాత్మక సంవేదనల ఫలితమే. “ఇది మనది, ఇది పరాయిది” అనేది భావనల ప్రభావమే. భావనలలో కలిగిన తృప్తి మనిషి యొక్క ఉన్నతిలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

**3. మానసిక తలం :-** మానసిక తలం మానవజీవితంలో చాల ప్రముఖ పాత్ర వహిస్తుంది. సుఖం, దుఃఖం, పట్టుదల లేదా పట్టుదల లేకపోవడం(లక్ష్యహీనత), రిలాక్స్‌డ్‌గా ఉండటం, కంగారు పడటం మొదలైనవి ఈ తలానికి సంబంధించినవి. మానసిక ఆలోచనల బట్టి మనిషి ఉచ్చస్థితికి చేరుకోవచ్చు. లేదా అధోగతి పొందవచ్చు. పంచ జ్ఞానేంద్రియాలు సవ్యంగా పని చేయాలంటే అక్కడ మనస్సు ఉండి తీరాలి. ఉదాహరణకు మనం రోడ్డు మీద ఏదో ఆలోచించుకుంటూ వెళ్తున్నాము. ఇంతలో ఒక స్నేహితుడు ఎదురుగా వచ్చాడు, పలకరింపుగా నవ్వాడు. కాని మనం గమనించలేదు. కన్ను గుర్తించింది కాని మనస్సు అక్కడ లేకపోవడం వల్ల, ఎదురుగా ఉన్న స్నేహితుడిని గుర్తించలేని

సమైక్య శక్తి, సామాజిక భావన సహకారానికి రూపాంతరాలు.

పరిస్థితి. ఈ సూత్రమే అన్ని జ్ఞానేంద్రియాలకు వర్తిస్తుంది. అందువల్ల జ్ఞానేంద్రియాలు సవ్యంగా పనిచేయాలంటే చూచే దాని మీద, వినేదాని మీద మనస్సు ఉండాలి. మనస్సు భౌతిక జగత్తు యొక్క కష్టసుఖాలను అనుభవిస్తుంది.

**4. బుద్ధి తలం :–** వ్యక్తి యొక్క విశ్లేషణాత్మక క్షమత ఈ పరిధిలోకి వస్తుంది. ఏమి చెయ్యాలి, ఏమి చెయ్యకూడదు, ఏది ముందు చెయ్యాలి, ఏది తరువాత చెయ్యాలి అనే విచక్షణా జ్ఞానం.

**5. సామాజిక తలం :–** మనిషి ఒక సామాజిక ప్రాణి. అందువల్ల సమాజంలోనే ఉండటానికి ఇష్టపడతాడు. సమాజంలో ఏ క్షేత్రంలో ఉన్నాడో, అక్కడ సంతోషంగా జీవించటానికి మార్గాలు వెతుకుతాడు. అది లభించినపుడు ఆ స్థలం ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. అక్కడ పేరు ప్రతిష్ఠలు, గౌరవ సన్మానాలు, ఐశ్వర్యం పొందాలనే ఆకాంక్ష తయారవుతుంది.

**ఆధ్యాత్మిక తలం :–** ఆధ్యాత్మిక తలంలో అనేక స్థాయిలు ఉన్నాయి, అసంఖ్యాకమైన పరిధులున్నాయి. ప్రతి పరిధి ఒక ప్రత్యేకమైన లోకంగా గోచరిస్తుంది. ఆధ్యాత్మిక తలంలో ప్రవేశించటానికి కావలసినది తపస్సు. పురాణ కాలంలో చెప్పబడిన తపస్సులు ఈ కాలంలో, ఈనాటి మనిషి చేయలేడు. ఈనాడు చెయ్యవలసిన తపస్సు వేరేగా ఉన్నది. మానవుడు విభిన్న తలాలను క్రమక్రమంగా దాటి ఆధ్యాత్మిక తలం చేరుకుంటాడు. జీవితం యొక్క సర్వోత్తమ లక్ష్యాన్ని పొందుతాడు. ప్రతి ఒక్కరు అన్ని తలముల అనుభవం పొంది జీవితంలో ముందుకు పోతుండాలి. మానవ జీవితం శాశ్వతము, సనాతనమైనది. దీని వికాసం కొరకు నిరంతరం ప్రయత్నిస్తుండాలి.

### మానవ జీవితం భగవంతుని అనుపమ వరదానం

మానవ జీవనం బహుమూల్యమైనది. కనుపించే భౌతిక శరీరం, అది నిర్వర్తించే కార్యక్రమాల పరిధిలో మనిషి లేడు. మానవ శరీరం లెక్కలేనన్ని శక్తులు, గుణముల సమూహం. శరీరంలో చేతనత్వం ఎప్పుడైతే వికసిస్తుందో, సాధారణ వ్యక్తి అసాధారణంగా రూపొందుతాడు; దేవతగా, మహా పురుషుడుగా తయారవవచ్చు.

సైంటిస్టులు, డాక్టర్లు కంటికి కనుపించే మానవ శరీర విలువను కట్టే ప్రయత్నం చేశారు. కాని మనుష్య జీవితం చాల విలువైనది; జాగ్రత్తగా గమనిస్తే మానవ శరీర విలువ సవ్యంగా లెక్కగట్టలేమని తెలుస్తుంది. మనిషి మనస్సు, బుద్ధి చాల విలువైనవి. వీటి సామర్థ్యం అనుపమానం, అద్వితీయం. వీటికి ఏమి విలువ గట్టగలము? విచక్షణా జ్ఞానం, ప్రతిభ ప్రతిక్షేత్రంలో ఉపయోగించుకోవచ్చు. అన్వేషించే బుద్ధి వలన మనిషి మనీషిగా, ఫిలాసఫర్‌గా తత్వవేత్తలుగా పనిచేయగలుగుతారు.

ఒక శతాబ్దం క్రిందట మనిషి యొక్క ప్రతిభ, సామర్థ్యముల గురించిన అవగాహన లేదు. విభిన్న క్షేత్రాలకు, మనో విజ్ఞాన క్షేత్రాలకు సంబంధించిన ఉన్నతి గమనిస్తే, మనిషి ఆలోచించగలిగిన ప్రతీది అతని ప్రజ్ఞతో సాధించుకొనవచ్చని తెలుస్తుంది. వెనుకకు తిరిగి చూచినట్లైతే సుగంధ పూరిత చందనం వంటి జీవితాన్ని నల్లబొగ్గుగా భావించి వ్యర్థం చేసుకున్నట్లు తెలుస్తుంది.

### అత్యుత్తమ అవకాశాలు, వాటి వికాసం

మనిషి భగవంతుని అద్భుత సృష్టి. ఇతర ప్రాణులకన్న మనిషికి లభించిన సౌకర్యాలతో అతను సుఖంగా జీవించవచ్చు. అతనికి లభించిన శక్తితో ఎటువంటి లోటునైనా తీర్చుకోగల సామర్థ్యం ఉన్నది. దుర్గుణాలను దూరం చేసుకొని, ఆదర్శజీవితం జీవించి ఒక దైవీ వ్యక్తిగా రూపొందించుకోగలగాలి. లేదా వీటిని ఉపేక్షించి, అత్యంత నిమ్నస్థితిలోకి పడిపోవచ్చు.

అన్యప్రాణులకు లేని విధంగా మానవునికి అందమైన శరీరం, ఆలోచించగలిగే శక్తి, వివేకం, భాష ఇవ్వబడ్డాయి. వీటిని సవ్యంగా ఉపయోగించుకోగలిగితేనే సార్థకత లభిస్తుంది. కామ, క్రోధ, లోభ, మోహములు వ్యక్తి పవిత్రతను తగ్గిస్తాయి. బ్రహ్మచర్యం, శ్రద్ధ, ప్రేమ మొదలైన గుణాలను పెంచుకొనే ప్రయత్నం చేయాలి. ఈ మార్గం కష్టతరమైనది. జటిలమైనది. కాని ఈ మార్గంలో అన్ని రకాల కష్టాలను నివారణ చేసుకోవచ్చు, ఆనందంగా జీవించవచ్చు.

ప్రేమ అన్ని రకాల దోషాలను, దుర్గుణాలను నివారిస్తుంది. ప్రేమ ఉన్నచోట దయ, కరుణ సహజంగా కలుగుతాయి.

> పదిమంది గురువులు నేర్పలేని దాన్ని కష్టాలు నేర్పుతాయి.

ఇతరులకు సహాయ సహకారాలను సహజంగా, ఆనందంగా అందిస్తాడు, లోభ మోహములను దరిజేరనీయడు.

జ్ఞానమును మించిన సంపద లేదు. జ్ఞానమునే కామధేనువంటారు. సవ్యమైన జ్ఞానముతో అన్ని ఇబ్బందులను దాటి, అన్ని కోరికలను నెరవేర్చుకొనవచ్చు. విద్య అంటే ప్రకృతిని అధ్యయనం చేయటమే. ప్రకృతి నియమాలు తెలిసిన వానిని జ్ఞాని అంటాము. కాలేజీలో కెమిస్ట్రీ చదువుకున్నా, బయాలజి చదువుకున్నా ఇవి ప్రకృతిలోని భాగములే. కంప్యూటర్ సైన్స్ కూడా ప్రకృతిలోని భాగమే. అన్ని రకాల విద్యలు ప్రకృతిలోనివే. ప్రతి వ్యక్తి ప్రకృతిలో భాగమే.

జ్ఞానం సంపాదించుకొనటానికి సత్సంగం అనివార్యం. సత్సంగం అంటే గొప్పవారి మాటలను వినటం మాత్రమే కాదు. వారు మాట్లాడినవి మాటలు మాత్రమే కావు. అవి వారి క్రియావంతమైన అనుభూతుల ప్రయోగ ఫలితాలు. వారి పలుకులు వినటం వల్ల అజ్ఞానమనే కారుమేఘాలు కొట్టుకుపోతాయి.

### జీవితం యొక్క గొప్పదనం, దాని సదుపయోగం

సృష్టికర్త సంపూర్ణ సృష్టి గావించి, దానిని సవ్యంగా ఉంచే బాధ్యతను మనిషికి ఇచ్చాడు. అందువల్ల ఇతనికి సర్వశ్రేష్ఠమైన బుద్ధి, ఉచ్చశ్రేణి వివేకం ఇవ్వబడ్డాయి. ఇలాంటి మానవ జాతి ఉన్న పృథ్వి గ్రహంలాంటి గ్రహం ఎక్కడా కానరాదు. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు జరిగిన ప్రగతి– జ్ఞానక్షేత్రంలో, విజ్ఞాన క్షేత్రంలో, చికిత్సా విధానములలో, దూర సంచార (టెలిఫోన్, ఇంటర్‌నెట్) క్షేత్రంలో లభించిన ప్రగతి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మనిషి యొక్క మస్తిష్కంలో ఉన్న సామర్థ్యాన్ని చూస్తుంటే మనిషికి అసాధ్యమైనది ఏమీ లేదనిపిస్తుంది.

మనిషి తన గొప్పదనాన్ని గుర్తించాలి, గౌరవ ప్రదమైన జీవితం జీవించాలి. హేయమైన జీవితం అతనికి ఏ విధంగానూ ఉచితం కాదు. కాని అతను అలా జీవిస్తే అంతకంటే దౌర్భాగ్యం ఏముంటుంది? మనిషి కష్టాలపాలయి, బాధ పడుతుంటే, అతడు ఏవో తప్పులు చేసి ఉంటాడు. ఆ తప్పులను సరిదిద్దుకుంటే సుఖమయ జీవనాన్ని సాధించుకోవచ్చు.

### మన పురోభివృద్ధి మన చేతులలోనే ఉన్నది

మంచి ఆలోచనలు, మంచి అలవాట్లు మంచి సంకల్పాలు చేసుకోవాలి. అన్య ప్రవృత్తులు కూడా అతనిలో ఉంటాయి. ముఖ్యంగా "బద్ధకం" అన్నింటికి అడ్డువస్తుంది. "రేపు చేద్దాంలే" ఇలాంటి ఆలోచనలే అసలైన విఘ్నాలు. కాని మంచి ఆలోచనలతో, సంకల్పాలతో దీనిని దాటాలి. ఈ విధంగా బయట ప్రపంచంలోని దోషాలు, దుర్గుణాలు అతనిలోకి ప్రవేశించలేవు. కాని మనిషి అప్రమత్తంగా లేకపోతే చెడు ప్రవృత్తులు లోనికి ప్రవేశించే ప్రమాద మున్నది.

**సాఫల్యం ఒక అలవాటు :** అనుకున్నది అనుకున్నట్టు(ఇతరులకు ఇబ్బంది కల్గించకుండా) చేసుకుంటూ పోతుంటే ప్రతి పని జరిగిపోతుంది. ప్రొద్దున నిద్ర లేచే సమయం, రాత్రి పడుకునే సమయం, భోజనం చేసే సమయం, ఆఫీసుకు బయలుదేరే సమయం, జపం చేసుకునే సమయం. ఈ పనులు అనుకున్న సమయానికి చేసుకుంటూ పోవటమే సాఫల్యానికి పునాది అవుతుంది.

**మీ సామర్థ్యంపై నమ్మకం ఉంచుకోండి:** ప్రతి మనిషిలో అద్భుత శక్తులున్నాయి. వీటి అవగాహన కావాలి. నెపోలియన్ పుట్టుకతో బీదవాడే. సామాన్యుడిగా జన్మించినప్పటికి, అతని ఆత్మవిశ్వాసం అతనిని ఉన్నత శిఖరాలకు చేర్చింది. ఎలాంటి పని అయినా తను సాధించగలననే పరిపూర్ణ విశ్వాసంతో ఉండేవాడు. ఎన్నో యుద్ధాలు చేశాడు, ప్రతిసారి గెలిచాడు. ఇలాంటి ఉదాహరణలలో అబ్రహాం లింకన్‌ను, మహాత్మా గాంధీని తీసుకొనవచ్చు.

ఆలోచనా శక్తి ఒక ఆధ్యాత్మిక శక్తి. ఇది లౌకిక శక్తుల కన్నా మిన్న. దృఢమైన ఆలోచనలే ప్రపంచాన్ని శాసిస్తాయి. వ్యక్తి తన వ్యక్తిగత, కుటుంబ, సామాజిక నిర్మాణానికి నియమబద్ధంగా ఒకే దిశలో, ఒకే విధమైన ఆలోచనలతో ముందుకు సాగాలి. ఆలోచనలతో ఆచరణను కలుపుకోవాలి.

★★★

**మన వివేకానికీ, కార్యశూరతకూ భగవంతుని సవాళ్లు ఆపదలు.**

## ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-30

# శక్తిపీఠాల స్థాపన-2

గుజరాత్ తర్వాత మధ్యప్రదేశ్ పర్యటనకు బయలుదేరాము. మూడు శక్తిపీఠాలకు ఒకరోజే ప్రారంభోత్సవం చేయాలి. ప్రయాణ దూరం చాలా ఉంది. 'దల్లి రాజ్‌హర'కు వెళ్లాము. సాయంత్రం 2 గంటలైంది. అక్కడి ప్రధాన కార్యకర్త 'కాళీచరణ్'. ప్రయాణంలో ఆలస్యమైనందువల్ల మేము భోజనం చేయలేదు. ప్రారంభోత్సవం తర్వాత, గురూజీ తన సందేశం ఇవ్వడం ప్రారంభించారు. నాకు బాగా ఆకలిగా ఉంది. భోజనం ఏర్పాట్లు ఎక్కడ జరిగాయో తెలియదు. గురూజీ ప్రసంగం కొనసాగుతూ ఉండగా, నేను కొందరి మిత్రులతో కలసి కాళీచరణ్‌జీ నివాసానికి వెళ్లాను. ఆరుగురి కోసం భోజనం ఏర్పాట్లు జరిగి ఉన్నాయి. ఆయన నివాసం తాళంవేసి ఉంది. మేము తాళాలు తేలేదు. మిత్రుల దగ్గరున్న తాళాంచెవితో ప్రయత్నించి తాళం తీశాము. అందరం భోజనం చేసాము. కూరలు చల్లబడ్డాయి. కొంచం వేడి చేసి తిన్నాము. తిరిగి సమావేశ ప్రదేశానికి చేరుకున్నాము.

గురూజీ ప్రసంగం పూర్తి అయింది. కాళీచరణ్‌జీ నన్ను భోజనానికి రమ్మని పిలిచారు. 'ఇప్పుడే భోజనం పూర్తి చేసుకొని వస్తున్నాము'- అన్నాను. 'అది మీ ఇంటివద్దే మా తాళంచెవితో, మీ ఇంటి తాళం తెరచాము'- అని చెప్పాను. 'గురుదేవులు ఇప్పటి వరకు మంచినీరు కూడా త్రాగలేదు. ఇంకొక శక్తిపీఠం ప్రారంభానికి వెళ్లాలి. వారికి భోజనం ఏర్పాట్లు చేయి అన్నాను. గురుదేవులను భోజనానికి రమ్మంటే, వారు రానన్నారు. "ఇప్పటికే చాలా ఆలస్యమైంది. వెంటనే బయలుదేరాలి'- అన్నారు. టీ త్రాగారు. అక్కడినుండి బయలుదేరాము. భోజనం రాత్రి 11 గంటలకు చేయవలసి వచ్చింది. అంత తీరికలేకుండా పోయింది. బస్తరులోని శక్తిపీఠాన్ని ప్రారంభించడానికి అక్కడి నుండి వెళ్లాము.

తర్వాత జగదల్‌పూరు శక్తిపీఠం ప్రారంభానికి బయలుదేరాము. అది ఘాట్‌రోడ్డు. కొండపైకి పోతున్నపుడు, కారుకు ఇబ్బంది ఏర్పడింది. గురుదేవులనూ, కపితోజీనీ మరొక కారులో వెళ్లడానికి ఒప్పించాను. అలా కాకపోతే- ప్రారంభోత్సవం బాగా ఆలస్యం కావచ్చు. వారు బయలుదేరారు. నేను పాడైన కారుతో, దాని డ్రైవరుతో అక్కడ ఆగాను. అదంతా అరణ్య ప్రదేశం. మేము కారులో కూర్చుని ఉండగా ఒక బాటసారి అటు వెళుతూ కనిపించాడు. మమ్మల్ని చూసి, 'ఎందుకు ఇక్కడ కూర్చున్నారు? చావాలని ఉందా'- అన్నాడు. 'ఇక్కడ మనిషి మాంసం రుచి మరిగిన ఒక పులి ఉంది. అది వస్తే మీ పని అంతే'- అన్నాడు. మేము కారులో కూర్చుని, బిస్కట్లు తిని, టీ త్రాగాము. నిప్పును చూస్తే పులి అక్కడకు రాదని చిన్నతనంలో విన్నది గుర్తుకువచ్చింది. పుల్లలు, కట్టెలు ప్రోగుచేసి మంట వేశాము. మేము కారులో కూర్చున్నాము. సాయంత్రం అవుతున్నా కారు బాగుపడే సూచన లేదు. ఇంతలో గురుదేవుల సాహిత్యాన్ని తెస్తున్న కారు వస్తూ ఉంది. దానిని ఆపాము. మా కారును దానితో కలిపి త్రాడుతో కట్టాము. రాత్రి 10 గంటలకు ఒక చిన్న గ్రామం చేరాము. బాగా చలిగా ఉంది. అందరం ఆకలితో ఉన్నాము. మనం ఇక్కడ ఆగిరేపు ఉదయం బయలుదేరుదాము అన్నాను. కార్లు ప్రక్కగా ఆపి, మనం కారులోనే నిద్రిద్దాము- అని చెప్పాను. ఆకలితో నిద్రపట్టేటట్లు లేదు. అంతలో ప్రక్క ఇంటినుండి ఒక స్త్రీ బయటకు వచ్చి, మీరు భోజనం చేశారా- అని అడిగింది. 'ఈ ఊరిలో అలాంటి ఏర్పాట్లు ఎక్కడ దొరుకుతాయి సోదరీ?'- అన్నాను. 'మీరు మా ఇంటి గడపలో ఆగారు. మీ ఆకలి తీర్చటం నా బాధ్యత'- అని, ఆమె భోజనానికి ఏర్పాట్లు చేసింది. 'అమ్మా! మందపాటి రొట్టె చేయి. మేము అవే తింటాము'- అన్నాను. కొంచం సేపటికి భోజనం తయారయింది. రాత్రి 11 గంటలకు అందరం భోజనం చేశాము. గురూజీని స్మరించాను. అడవిలో కూడా మాకు భోజనం ఏర్పాట్లు చేయించారు వారు. ఉదయాన్నే మాకు ఆమె టీ ఇచ్చారు. ఆమెకు నాలుగు గేదెలు ఉన్నాయి. పాలు కొనే పనిలేదు. నాకు అనిపించింది- గురుదేవులు ఎల్లప్పుడూ నా వెనకే ఉంటారు, భయపడవలసిన పనిలేదు. కారుని బాగు చేయించి సాయంత్రానికి జగదల్‌పూరు

**సఫలతకు ఆధారం ఇచ్ఛాశక్తిలోని బలం.**

చేరాము. గురూజీ సరైన సమయానికే అక్కడకు చేరి శక్తిపీఠం ప్రారంభోత్సవం జేశారు.

మరొకసారి ప్రజ్ఞాపీఠాన్ని ప్రారంభోత్సవం చేయడానికి గురుదేవులతో నేను 'ఖోఖార్కలా' వెళ్లాను. అదొక గ్రామం. చుట్టుప్రక్కల మామిడి తోటలు. గురూజీ కార్యక్రమం అక్కడ ఏర్పాటు చేశారు. భోపాల్ నుండి షుమారు 400 మంది కార్యకర్తలు గురూజీ దర్శనానికి వచ్చారు. అక్కడ గుడారాల లాంటివి ఏమీలేవు. మామిడి చెట్ల నీడన కూర్చున్నారు. వేసవి కాలం. ప్రారంభోత్సవం కొంత ఆలస్యమైంది. భోపాల్ నుండి వచ్చిన జనం ఆరాత్రికి అక్కడే ఉండవలసి వచ్చింది. భోజనం ఏర్పాట్లు ఏమీలేవు. గురూజీ నన్ను పిలిచి, 'భోజన ఏర్పాట్లు లేని ప్రదేశానికి నన్ను ఎందుకు తీసుకువచ్చావు?'- అన్నారు. వెంటనే ఆ ఏర్పాట్లు చేయిస్తానని, గ్రామస్థులను పిలిచి ప్రతి ఇంటినుండి వంటకు కావలసిన వస్తువులు, ఇక్కడకు తెప్పించి, భోజనం ఏర్పాట్లు చేయించదని కోరాను. వారిలో ఒక వ్యక్తి, 'పండిట్‌జీ, మా యింట్లో పెండ్లి జరుగబోతోంది. పిండి, నూనె, నెయ్యి కావలసినంత ఉంది. పెండ్లికి కావలసిన వస్తువులు మళ్లీ కొనవచ్చు. ఇప్పటికి పని జరిగిపోతుంది'- అన్నారు. నేనే పిండి కలిపి, పూరీలు జేయడానికి పూనుకొన్నాను. ఇంతలో గ్రామంలోని స్త్రీలు వచ్చారు. కొందరు పురుషులు కూడా నడుంకట్టారు వంటకు. ఆ విధంగా సోదర సోదరీ మణులందరికీ భోజనం ఏర్పాట్లు జరిగాయి. అందరూ గురూజీతో, 'పండిట్‌జీ స్వయంగా పూరీలు వత్తారు'- అని చెప్పారు. అప్పుడు గురూజీ 'నాకు నమ్మకం ఉంది. ఆయన అందరి భోజనాల ఏర్పాట్లు చేస్తాడని'- అన్నారు. రాత్రి ఒంటిగంటకు గురూజీ దగ్గరకు వెళ్లాను. ఆయన నవ్వి, 'కుమారా, నేను ఈ ఏర్పాట్లు ముందుగానే చేశాను. నీ ధైర్యాన్ని పరీక్షించాను'- అన్నారు. తర్వాత అక్కడ ఉన్న వారితో, "ఇతని ధైర్యాన్ని చూసే నేను ఇతనిని నాతో తీసుకొని వెళుతున్నాను. గాయత్రీ తపోభూమి సంచాలకుడుగా చేసాను." అన్నారు. ఈ రకంగా మేము శక్తిపీఠాల ప్రారంభోత్సవాలకోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాము. అలా ఒక సంవత్సరకాలం జరిగింది.

★★★

## ఎన్ని ఉన్నా హృదయం లేకపోతే సున్నా

*కాశీరాజు కుమారుడు సందీపుడు అన్ని విధాల యోగ్యుడుగా పేరు తెచ్చుకున్నాడు. బ్రాహ్మీముహూర్తంలో లేచి వ్యాయామం, గుర్రపు స్వారీ చేసేవాడు. అన్ని పనులు క్రమశిక్షణతో సమయం దాటకుండా చేసేవాడు. విద్య, విజ్ఞానం, పాండిత్యం దేనికీ కొరతలేదు. రాజకార్యాలపట్ల ఆసక్తి చూపేవాడు. అతనిలో అందరికీ శుభలక్షణాలే కనపడేవి. కుటుంబ సభ్యులు, ప్రజలు కూడ సందీపుని చూచి మురిసిపోయేవారు. ఒకరోజు సందీపుడు గుర్రం ఎక్కి నగరంలో తిరుగుతూ ఉన్నాడు. రాజకుమారుని చూడగానే ప్రజలు, స్నేహితులు అతని దగ్గరకు వచ్చారు. ప్రేమతో స్నేహంగా మాట్లాడుతున్నారు. ఇంతలో ఒక 10 సంవత్సరాల పిల్లవాడు కూడ వచ్చాడు. అమాయకంగా అందర్నీ నెట్టుకుంటూ ముందుకు వచ్చాడు. అనుకోకుండ గుర్రందెక్క తగిలి కిందపడ్డాడు. బాగా దెబ్బలు తగిలాయి. బాధతో విలవిలలాడిపోతున్నాడు. ఏమంటే ఏంజరుగుతుందో అన్న భయంతో అందరు మౌనంగా నిలబడ్డారు. రాజకుమారుడికి కొంచెం కూడా బాధకలుగలేదు. పిల్లవానిని లేవదీయలేదు సరికదా "రోడ్డుమీద ఎట్లా నడవాలో తెలియక పోతే ఇట్లాగే జరుగుతుంది. ఒళ్లు దగ్గరపెట్టుకుని నడవడం నేర్చుకో." అని తిరస్కారంగా పలుకుతూ గుర్రంఎక్కి వెళ్లిపోయాడు. ఇదంతా చూస్తున్న ప్రజలు రాజకుమారుని చేష్టకు అసహ్యించుకున్నారు. పిల్లవానిని లేవదీసి ఉపచారాలు చేశారు. ప్రథమ చికిత్స చేసి వైద్యుని దగ్గరకు తీసికొనిపోయారు. వార్త రాజుగారి చెవిని పడింది. కుమారుని నిర్దయకు రాజు చాల వ్యధ చెందాడు. బాగా ఆలోచించాడు. క్రమశిక్షణగా కార్యాలు కొనసాగించినంత మాత్రాన సరిపోదని గ్రహించాడు. కాబోయే రాజుకు పనులలో నేర్పున్నంత మాత్రాన యోగ్యుడైనరాజు కాలేడు. ఇలాంటి వారు పెరిగి పెద్దవారయ్యాక క్రూరకర్ములుగా తయారైనా తయారౌతారు. కాబట్టి ఇలాంటి వారికి గురుకులాలలో శిక్షణ ఇప్పించడమే మంచిది అనుకున్నాడు. వెంటనే సందీపుని గురుకులంలో చేర్పించాడు. హృదయం స్పందించే విద్యను నేర్పించమని గురువును ప్రార్థించాడు. గురుకులంలో సందీపుడు హృదయం ఉన్న వ్యక్తిగా తీర్చిదిద్ద పడ్డాడు.*

**ఆకాంక్ష అనే ఆకర్షణ శక్తి అనుకూల పరిస్థితులను మనవైపునకు లాగికొనివస్తుంది.**

మనం-మన ఆరోగ్యం : ఆయుర్వేద విజ్ఞానం

# ఆయుర్వేదంలో జల ప్రాధాన్యత

ప్రాచీన కాలంలో ప్రజలు ఎక్కువగా నదులు, సరస్సులు, కాలువల సమీపంలో నివసిస్తూ ఉండేవారు. ఇప్పటికీ చాలా నగరాలు, మహా నగరాలు నదుల సమీపంలోనే ఉంటున్నాయి. కానీ మురికినీటిని నదులలోకి వదలడం వల్ల నీరు విషపూరితమై జీవనశైలి వికృతంగా మారింది. ఋతుల పరివర్తనలవల్ల కూడ నదులు కుంచించుకుపోయాయి. చెరువులూ, సరస్సులూ కూడ లేకుండ అయ్యాయి. కాలువలు ఎండిపోయి నీటి సమస్య చాలా జటిలమయింది. నీటిని శుభ్రపరచి పంపులద్వారా బస్తీలకు పంపే ఏర్పాట్లు జరుగుతున్నా కూడ త్రాగునీటి సమస్య మాత్రం యధాతథంగా ఉంటున్నది. బోర్‌వెల్స్ ద్వారా నీటి సరఫరా జరుగుతుందంటే అది ఇంకా కఠినంగా తయారయ్యింది. వేయి అడుగులు త్రవ్వినా నీరు లభించడంలేదు.

ఆయుర్వేద విద్వత్తులైన ఋషులు నీరులేకపోతే జీవించడం కష్టమనీ అందులోనూ పరిశుభ్రమైన నీరు కావాలనీ చెప్పారు. మన శరీరంలో మూడింట రెండువంతులు జలసంబంధమైన అంశముంది. శరీర కార్యకలాపాలకు కూడ నీరు అత్యంత ఆవశ్యకము. రక్తము, మాంసకండరాలు, శరీరము, మస్తిష్కములోని నాడులలో కూడ ఎనభై శాతం నీరు ఉంటుంది. నీరు శరీర బాహ్య, అంతరిక పరిశుభ్రతకు అత్యంత అవశ్యకము, నీరు శరీరంలో ఈ విధంగా పనిచేస్తుంది.

(1) తిన్న ఆహారం జీర్ణం కావడానికీ, తరువాత శరీరంలోకి సరఫరా కావడానికి మాధ్యమం.

(2) శరీరంలోని టిశ్యూలలో నీటి పరిణామం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండేటట్లు చేస్తుంది.

(3) రక్తం గడ్డ కట్టకుండా చూడడం.

(4) వ్యర్థ పదార్థాలను బయటకు పంపుటకు సహాయకారి.

(5) శరీర ఉష్ణోగ్రతను సమంగా ఉంచడం

(6) జీర్ణరసాలు తయారు కావడానికి సహాయకారి.

సాధారణంగా ప్రతివ్యక్తికీ ముప్పది గాలనుల నీరు అవసరము. త్రాగడానికీ, వంట చేయడానికీ ఒక గాలను, స్నానము, బట్టలు ఉతకడం, ఇల్లు శుభ్రంచేసుకోవడానికీ పదకొండు గాలన్లూ, శౌచాలయం మొదలైన వాటికి ఐదుగాలన్లు, కార్ఖానాలకు ఐదు గాలన్లూ, వీధులు శుభ్రపరచడానికి ప్రజలకోసం బయట నిర్మితమైన స్నాన గృహాలకు, నిప్పు చల్లార్చడానికి ఐదు గాలన్లూ, పశువుల కొరకు మూడు గాలన్లు, ఈ విధంగ 30 గాలన్ల నీరు అవసరమౌతుంది. జీవన శైలిననుసరించి ఇంకా కూడ ఎక్కువ ఖర్చుకావచ్చు. కనుక నీటిని తగుమాత్రంగా వాడుకునే విధంగ ప్రజలకు తెలియచెప్పాలి. నీటి పొదుపును గురించి వివరించకపోతే నీరు వృధా అవుతుంది. నీటి ఉపలబ్ధి సామాన్యంగా ఉంది. గ్లోబల్ వార్మింగ్ వల్ల ఇంకా తక్కువవుతూ ఉంది. జనసంఖ్యకూడ పెరిగింది.

జలం లభ్యమయ్యే విషయాన్ని పరిశీలిస్తే, సముద్రంనుండే మనకు నీరు లభిస్తోంది. సముద్రంలోని నీరు ఆవిరై వర్ష రూపంలో, మంచురూపంలో లభ్యమవుతున్నది. ఇదే నీరు కాలువలు, లేదా భూగర్భ జలాలుగ లభ్యమవుతున్నది. వర్షపు నీటిని నిలువ చేయడంవల్ల బావులలో నీటిమట్టం పెరుగుతుంది. నదులలో, చెరువులలో కూడ నీరు నిల్వ ఉంటుంది. నీటిని నిల్వ చేసే విషయం నేడు అత్యంత ఆవశ్యకము.

చరకుడి 25వ సూత్రప్రకారం ఆయుర్వేదంలో ఈవిధంగా చెప్పబడింది స్వతహాగ శీతలము, పవిత్రము, నిర్మలము, కల్యాణ కారిగా, స్వల్ప గుణాలతో కలసి ఉంటుంది. నేలమీద పడేసరికి భూమికి అనుగుణంగా నీటి గుణాలు కూడ మారిపోతాయి. ఆకాశం నుండి పడ్డనీరు నాలుగు విధాలుగా ఉంటుంది– ధారరూపంలో, వడగండ్ల రూపంలో, మంచు రూపంలో, మంచుగడ్డలలాగ ఆకాశం నుండి పడ్డనీరు మూడుదోషాలను హరించేదిగా, రసాయనముగా, మేధస్సును పెంచేదిగా ఉంటుంది.

**కష్టం భయంకర రూపం దాల్చిన కాగితపు పులి.**

దీనిని గగనాంబు అనీ, భూమిపైన పడ్డనీటిని భౌమాంబువు అని అంటారు. ఋతువులు మారినపుడు జలముయొక్క గుణాలు కూడ మారతాయి.

వర్షకాలములోని నీరు ఉత్తమోత్తమమైంది. ఇది శ్రేష్ఠమైనదిగా, మధురంగా ఉంటుంది. శరదృతువు నందలి జలము తేలికగా, స్వల్ప గుణాలు కలదిగా ఉంటుంది. హేమంత ఋతువులో స్వచ్ఛంగా, బరువుగా, శిశిరఋతువులో జలము కఫాన్నీ, వాతాన్నీ హరించేదిగా, వసంత ఋతువులోని నీరు వగరుగ ఔషధగుణము కలదిగా, మధురముగా, గ్రీష్మ ఋతువులో తేలికగా ఉంటుంది. సుశ్రుతుడు ఇలా చెప్పారు– ఆకాశంనుండి పడేనీరు రుచి లేనిదిగా, అమృతసమానముగా, జీవము కలుగచేయునదిగా, పథ్య సమానంగా ఉంటుంది. భూమిమీద పడేసరికి పడేటటువంటి ప్రదేశాన్ననుసరించి ఇతర రసములతో కలసి నదులు, సరస్సులు, చెరువులు, బావులు, కాలువలు మొదలైన స్థానాలలో నిలిచిపోయి అచ్చట గుణాలను సంతరించుకుంటుంది. వరదలు వచ్చినపుడు నదీ జలాలతోపాటు సారవంతమైన మట్టితో సముద్రంలో కలుస్తుంది. ఏమైనప్పటికీ ఆకాశమునుండిపడే నీటిని వ్యవస్థిత రూపంలో నిలువ చేసే ప్రయత్నం చేయాలి. దీనివలన అందరికీ తగినంత నీరు లభ్యమవుతుంది. నీటిని వృథా చేయకుండా చూడాలి. ఎక్కువ లోతులేనివీ, బాగా లోతైనవీ, స్వతహాగా పుట్టిన బావులు, ట్యూబ్ వెల్స్ ఈవిధంగ నాలుగు రకాల బావులున్నాయి. పల్లెలలో ఎక్కువ లోతులేని బావులుండటంవల్ల దరిదాపులలోని మురికినీరు, పశువులను కడిగిన నీరూ మొదలైనవి కలసి నీరు కలుషితం అవుతుంది. ఎక్కువ రోగాలు రావడానికి ఈ నీరే కారణము, లోతైన బావులు, ట్యూబ్‌వెల్స్ నీరు వడగట్టబడి పరిశుభ్రంగానూ, సురక్షితమైనదిగనూ ఉంటుంది. ఆదర్శవంతమైన బావులు కాలుష్యానికి 200 అడుగుల దూరంలో ఉండాలి. ఎత్తున ఉండి, లోతుగ ఉండాలి. బావి గోడలు బలిష్ఠంగా ఉండి, చెట్లవేళ్ళు లోపలికి రాకుండ ఉండాలి. మూతవేయబడి ఉండి అప్పుడప్పుడూ శుభ్రం చేయబడుతూ ఉండాలి.

## పంచడంలో ఉన్న ఆనందం ఎందులోనూ ఉండదు

*స్వామిరామ తీర్థుడు గొప్ప విద్వాంసుడు. ఆయన లాహోర్ కాలేజీలో చదువుకున్నాడు. ఆరోజుల్లో చదువుపై చూపుతున్న శ్రద్ధను చూచి ప్రిన్సిపాల్ ముగ్ధుడయ్యాడు. ఎలాగైనా రామతీర్థుని సివిల్ సర్వీస్ పరీక్షకు పంపాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. రామ తీర్థునికి ఈ విషయం తెలిసింది. నేరుగా ప్రిన్సిపాలు దగ్గరికి వెళ్లాడు. నమస్కారం చేశాడు. "అయ్యా! నేను కష్టపడి చదువుకుని జ్ఞానం అనే పంటను పండించాను. నేను కష్టపడి పండించిన పంటను పదిమందికి పంచిపెట్టాలి అనుకుంటున్నాను. అలా చేయడానికి ఆఫీసరు పదవి అక్కరలేదు. అధ్యాపకవృత్తి సరిపోతుంది. నేను సేవ చేయడానికే పుట్టాను. సేవకుడిగానే ఉంటాను." అని గట్టిగా చెప్పాడు. ప్రిన్సిపాల్ ఎన్ని విధాల నచ్చచెప్పాలని చూచినా వినిపించుకోలేదు. తన మాట మీదనే నిలబడ్డాడు. అనుకున్నట్లుగానే తనకున్న జ్ఞానాన్ని కర్మ మార్గానికి జోడించి సమాజానికి పంచి ఇచ్చాడు. స్వామి రామతీర్థుడుగా ప్రసిద్ధి చెందాడు.*

ఆరోగ్యప్రణాళికలో బావినీటి ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ప్రాచీన కాలమునుండి బావులే నీటికి ఆధారంగా ఉండేవి. నగరాల్లో పంపులద్వారా నీటిని సేకరించి ట్యాంకులలో నింపి ఇండ్లకు సరఫరా చేస్తున్నారు. అటువంటపుడు వాటర్ ట్యాంకులను శుభ్రపరచడం, పరిశుభ్రమైన నీరు నింపడం, దారిలో ఏవిధమైన కాలుష్యం లేకుండునట్లుగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.. ఆయుర్వేదంలో బావినీటి విషయంలో, జల సేకరణలోనూ, శుభ్రపరచడంలోనూ పరంపరాగత ప్రయోగాలను గురించి చాలా విశదంగా చెప్పబడింది.

*మరికొన్ని వివరాలు వచ్చే సంచికలో............*

*అనువాదం– కె. అరవిందమ్మ.*

★★★

తపస్సు అంటే కష్టాలను సహిస్తూ సముచిత కార్యాలలో శ్రమించడం.

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-59

# మెరిసింది సరికొత్తవెలుగు-2

## సంప్రదాయంతోపాటు వివేకం

ఆగ్రా తిరిగివచ్చి, శ్రీరామ్ కొత్త పథకం గురించి బాబూ గులాబ్ రామ్‌కీ, జగత్ ప్రసాద్ రావత్‌కూ, కాశీకి చెందిన వేణీప్రసాద్ శర్మకూ తెలిపారు. వేణీ ప్రసాద్‌జీ ఆ రోజుల్లో ఆగ్రా వచ్చి ఉన్నారు., 'కళ్యాణి' పత్రిక సంపాదకులు హనుమత్ ప్రసాద్ పోద్దార్‌కూ, "కల్పవృక్ష" పత్రిక సంపాదకులు దుర్గాశంకర నాగర్‌కూ తమ పథకాన్ని గురించి లేఖలు వ్రాశారు. ధర్మం, అధ్యాత్మ, సాధన, సంస్కృతి, యోగం మున్నగు విషయాలపై ఆనాడు హిందీలో 'కళ్యాణి', "కల్పవృక్ష" అనే రెండు పత్రికలే వెలువడేవి.

కళ్యాణ్ పత్రిక సంపాదకులు ఇలా వ్రాశారు- మేము సాధుసంత్‌ల ఉపదేశాలకు ప్రాధాన్యం ఇస్తాము. వారి భావాలతో పాటు నమ్మకాలూ, విశ్వాసాలూ, అర్థాన్ని కోల్పోయిన ఆచార వ్యవహారాలూ ఉండవచ్చు. మేము వాటితో ఏకీభవించాల్సిన అవసరం లేదు. అయినా అవి సంత్‌ల వాక్కులు. కనుక మేము వాటిని యథాతథంగా ప్రచురిస్తాము. నేటి కాలానికి అనుగుణంగా మీరు కొన్ని సవరణలు చేయగలిగితే బాగుంటుంది. సంప్రదాయాలలో అనేకం వాటి ఉపయోగాన్ని కోల్పోయాయి. సంప్రదాయాలు అయిన కారణంగానే వాటికి ప్రాధాన్యం ఇవ్వకూడదనీ, వాటికి, వివేకాన్నీ, తర్కాన్నీ జోడించాలనీ మీరు వ్యక్తపరచిన అభిప్రాయం ఉత్తమంగా ఉంది.

## సలహాలూ, శుభాకాంక్షలు

ఆ లేఖలోని ఈ వాక్యాలను శ్రీరామ్ తన డైరీలో వ్రాసుకున్నారు. ఇతర విద్వాంసులు కూడ సలహాలు ఇచ్చారు. ధర్మాన్నీ, అధ్యాత్మనూ ఆచరణాత్మకంగా వ్యాఖ్యానించే మాసపత్రిక ఒకటి ప్రచురించ బడుతూన్నందుకు అందరూ పులకించిపోయారు. శ్రీరామ్ తన పథకం గురించి పంపిన పత్రంలో తన పరిచయాన్ని కూడ ఇచ్చారు. తాను స్వరాజ్య ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొంటున్నాననీ, పాత్రికేయ రంగంతో కూడ తనకు సంబంధం ఉన్నదనీ ఆయన ఆ పత్రంలో వివరించారు. ఈ వాస్తవాలను చర్చించిన విద్వాంసులు శుభాకాంక్షలతో పాటు తమ ఆశలనూ, అపేక్షలనూ కూడ వ్యక్తపరచారు. శ్రీరామ్ ఈ లేఖలకూ, అభిప్రాయ వ్యక్తీకరణలకూ తగువిధంగా జవాబులు వ్రాశారు.

ఉజ్జయినికి చెందిన దుర్గాశంకర నాగర్ ఇలా సలహా ఇచ్చారు- 'అఖండజ్యోతి'లో పరలోకానికీ, మరణం తర్వాత జీవితానికీ సంబంధించిన వ్యాసాలు కూడ తగినన్ని రావాలి. శరీరం జన్మించడం, ప్రాణం పోవడం- వీటికే పరిమితం కాదు జీవితం. జనన మరణాలమధ్య గల సమయం జీవితంలోని ఒక చిన్న భాగం. మిగతా భాగాన్ని ఉపేక్షిస్తే, జీవితంపై చర్చ సమగ్రం కాదు.

దుర్గాశంకర నాగర్ ఉన్నత స్థాయికి చెందిన ఆధ్యాత్మిక వ్యక్తి. సాధన, ఆత్మవిద్యలే కాక- ప్రేతాత్మలతో సంపర్కం జరిపే కళకూడ ఆయనకు తెలుసు. మరణించిన వ్యక్తుల ఆత్మలను సంపర్కం చేయడంలో, బంధువులతో వాటిని మాట్లాడించడంలో ప్రసిద్ధి పొందిన వ్యక్తి ఆయన.

శ్రీరామ్ పాతగది వదిలిపెట్టి కొత్త ఇల్లు తీసుకున్నారు. అందులో మూడు గదులు ఉన్నాయి. ఆయన భార్య సరస్వతీ దేవి కూడ అక్కడకు వచ్చి నివసించసాగింది. కూతురు దయ పసిపిల్ల. ఆ పిల్లకు తల్లి ఒడి అవసరం. కనుక ఆ పిల్లకూడ వెంటవచ్చింది. ఓమ్‌ప్రకాశ్ తాఊజీతోపాటు ఆవల్‌ఖేడాలోనే ఉండిపోయాడు. కుటుంబం ఇక్కడికి వచ్చి ఉండడంలో గల ఉద్దేశ్యం శ్రీరామ్‌తో పాటు రోజువారీ బాధ్యతలలో పాలుపంచుకోవడం; తననూ, ఇంటినీ సంబాళించుకునేందుకయే సమయాన్ని, శ్రమనూ తగ్గించడం.

ఆగ్రాలోని ఫ్రీగంజ్ పేటలో ఉంది ఆ ఇల్లు. మూడు గదులలో ఒక గది అఖండజ్యోతి కార్యాలయంగా వాడేవారు. రెండవ గది

తపస్సువల్ల సాధించలేనిది ఏదీలేదు.

పూజకూ, సమావేశాలకూ వాడేవారు. మూడవ గది స్వంత ఉపయోగానికీ, అతిథులకూ, వంటకూ, ఇతర అవసరాలకూ వేరే ఏర్పాటు ఉంది.

ఇలా ఖర్చులూ, బాధ్యతలూ నాలుగురెట్లు పెరిగాయి. ఆదాయానికి సరైన వనరులేనేలేదు. 'సైనిక్' పత్రికలో పనిచేస్తున్నంత వరకు అక్కడ లభించే జీతం కొంత ఆసరాగా ఉండేది. ఇప్పుడు బాధ్యత మొత్తం శ్రీరామ్‌మీద పడింది. పొలంమీద వచ్చే ఆదాయంతో ఈ బాధ్యతను నిర్వహించవచ్చునని తాఈజీ ధైర్యం చెప్పారు. శ్రీరామ్ మనస్సులో ఇందుకు సంకోచించారు. కొత్త ఏర్పాటు జరిగేవరకు దాన్ని ఋణంగా తీసుకోవడానికి ఆయన ఒప్పుకున్నారు. తాఈజీ అభ్యంతరం చెప్పారు– దాన్ని అప్పుగా ఎందుకు పరిగణించాలని. సంపదను మీరు దక్షిణగా సమాజానికి ఎప్పుడో ఇచ్చివేశారు కదా– అని శ్రీరామ్ జవాబు చెప్పారు.

ఈ జవాబును ఖండించే అవకాశం ఏదీ తాఈజీ వద్ద లేకపోయింది. శ్రీరామ్ ఇలా అన్నారు–

"పత్రికపై వచ్చే రాబడిలో కొంతభాగాన్ని జీతంలా తీసుకుని పని జరుపుకుంటాను. మిగతా రాబడిని 'అఖండ జ్యోతి' విస్తరణకు వినియోగిస్తాను." ఆయన దృష్టిలో 'అఖండ జ్యోతి' విస్తరణ అంటే ఆదిశక్తి వేదమాత గాయత్రి యొక్క ప్రేరణలను నిరంతరం విస్తరిస్తూ ఉండడం.

## తొలి సంచిక ప్రచురణ

1938 జనవరిలో అఖండ జ్యోతి తొలి సంచిక వెలువడింది. ఆ రోజుల్లో ఆవిష్కరణల ఆచారం లేదు. పత్రిక తొలి ప్రతిని వేదమాత గాయత్రి చరణాలపై ఉంచారు. అది వసంత పంచమి పర్వదినం. శ్రీరామ్ తాఈజీకి ప్రణామం చేశారు. ఆమె తన కర కమలాలతో ఆదిశక్తి గాయత్రి ఎదుట వెలుగుతూన్న 'అఖండ దీపం' ప్రక్కన ఆ ప్రతిని సమర్పించారు. ఆ దీపం నుండి ప్రసరిస్తూన్న వెలుగు పత్రిక ముఖపత్రంపై పడుతోంది. భగవతి గాయత్రి ఆశీస్సులు వర్షిస్తున్నట్లు. పూజ గదిలో జరిగిన ఈ సమర్పణ తర్వాత పత్రిక ప్రతులను మిత్రులకూ, మేధావులకూ పంచారు.

తొలి సంచికతోపాటే రెండవ సంచికకు ఏర్పాట్లు ప్రారంభమైనాయి. అయితే ఆటంకాలమీద ఆటంకాలు మార్గానికి అడ్డుతగిలాయి. మార్కెట్ ఆర్థిక మాంద్యంలో చిక్కుకుని ఉంది. రెండవ ప్రపంచయుద్ధం అంతకుముందే ప్రారంభమయింది. నాణెములకూ, వస్తువులకూ కొరత విషమసమస్యఅయింది. కాగితం సమస్య మొట్టమొదటిది. తొలిసంచికకోసం ఏర్పాటు జరిగింది. కాగితం సరఫరా చేస్తానని హామీఇచ్చిన వర్తకుడు వాయిదాలు పెట్టసాగాడు. ఎనిమిది–పది రెట్లధరకు కాగితం ఇస్తానని అంటాడు. అయినా నిరంతరంగా కాగితం సరఫరా చేస్తానని హామీ ఇవ్వడు. ఇతర వర్తకులూ ఇలాగే వ్యవహరించారు. ప్రెస్ పరిస్థితీ ఇలాగే ఉంది. కార్మికుల ద్వారానే నడవదు కాదా. 'అఖండ జ్యోతి' కోసం చందాలనూ, సహకారాన్నీ సేకరిస్తామని మాట ఇచ్చిన సభ్యులు వెనుకంజ వేశారు.

పత్రిక రెండవ సంచిక సకాలానికి వెలువడలేదు. వ్యవస్థను సంబాళించే ప్రయత్నంలో అది మరింత దిగజారింది. మూడు నెలలపాటు నిర్విరామంగా ప్రయత్నించిన తర్వాత– శ్రీరామ్ కొత్త తరహాలో సాధనాలను సమీకరించాలని నిర్ణయించారు. ఒక్కొక్క సంచిక కోసం ఏర్పాట్లు చేయడానికి బదులు– మొత్తం సంవత్సరానికి ఒకేసారి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. కనీసం 12 సంచికలు సకాలంలో నిరంతరాయంగా అచ్చుయేందుకు తగిన వ్యవస్థ నిర్మాణమయిన తర్వాతనే ప్రచురణను తిరిగి ప్రారంభించాలని నిశ్చయించారు. ఇందుకు ఒకటి రెండు సంవత్సరాలు పట్టినా పరవాలేదు– కానీ, ప్రారంభించిన తర్వాత ఈ పరిస్థితి రాకూడదు.

## ముఖచిత్రంగా చక్రధారి శ్రీకృష్ణుడు

1940 వసంత పంచమి నుండి 'అఖండ జ్యోతి' తిరిగి వెలువడుతూన్నదనే ప్రకటన వచ్చింది. 1940 జనవరి 'అఖండ జ్యోతి' ముఖచిత్రంపై సుదర్శన చక్రాన్ని చేబూనిన కృష్ణ పరమాత్మ చిత్రం ఉంది.

**అత్యాశవల్ల దుర్గతి ప్రాప్తిస్తుంది.**

పత్రిక ఆ తేదీకి ముందుగానే ముద్రించబడి తయారయింది వసంత పంచమికి రెండు మూడు రోజుల ముందు శ్రీరామ్ తాఈజీని ఆవల్‌ఖేడా నుండి పిలిచారు. మాఘ శుక్ల పంచమి (వసంత పంచమి) ప్రాతఃకాలంలో ఆమె చేతులమీదుగా పత్రిక తొలి ప్రతి భగవతి గాయత్రి విగ్రహం ఎదుట ఉంచబడింది. తాఈజీ దానిమీద పువ్వులూ, అక్షతలూ ఉంచారు. దేవి సరస్వతికూడ సమర్పణలో పాల్గొన్నారు. శ్రీరామ్ హారతిపాట పాడారు. ఈ విధంగా అఖండ దీపం వెలుగులో దాని దివ్యప్రభ ప్రజలకు సమర్పించబడింది.

శ్రీరామ్ తొలి ప్రతిని తపాలా ద్వారా మహాత్మాగాంధీకి సేవాగ్రామ్ చిరునామాకు పంపారు. బాబూ గులాబ్ రామ్‌కీ, కృష్ణదత్ పాలీవాల్‌కూ స్వయంగా దాన్ని అందించారు. 'కళ్యాణ్' పత్రిక సంపాదకులు హనుమాన్ ప్రసాద్ పోద్దార్, రామకృష్ణ మిషన్ కలకత్తా, అరవింద ఆశ్రమం, పూరీ కంచిలలోని శంకర మఠాలు ఆయన తపాలా జాబితాలో ఉన్నాయి. పత్రికపై తమ అభిప్రాయాన్ని పంపవలసిందిగా ప్రతి ఒక్కరినీ ఆయన కోరారు. విషయాలు, పంపిణీ పద్ధతి, ముద్రణ స్థాయి, కాగితం, చిత్రాల ఎంపిక మున్నగు అంశాలపై పాఠకుల స్పందనలు కోరబడ్డాయి.

తొలి సంచిక 500 ప్రతులు ముద్రించబడ్డాయి. అది ప్రింట్ కావడానికి ముందే రెండవ సంచిక వ్యాసాలు ప్రెస్‌కు పంపబడ్డాయి. సుమారు 350 ప్రతులు తపాలా ద్వారా పంపబడ్డాయి. వీటికి చిరునామాలు వ్రాసే పని శ్రీరామ్ స్వయంగా చేశారు. చిరునామాలు చేతితో వ్రాయబడ్డాయి. కార్బన్ పేపరు సహాయంతో వాటి నకళ్లు తయారైనాయి. వాటిని చించి పత్రిక రేపరుమీద అతికించే పని సరస్వతి చేశారు. పిల్లనూ, ఇంటి పనినీ చూచుకున్న తర్వాత ఆమె పత్రిక వ్యవస్థ పనిలో కూడ కొంత సాయపడేది. రెండవ సంచిక తయారయే సమయానికి ఆమె పత్రికను రేపర్‌లోకి దూర్చే పని కూడ చేశారు.

## పత్రికకు స్పందనలు

మొదటి కొద్దినెలలలో శ్రీరామ్ పత్రిక పంపిణీని స్వయంగా నిర్వహించారు. మూడు నాలుగు నెలల తర్వాత సహాయకుడుగా ఒక కార్యకర్త దొరికాడు. స్వరాజ్య సమరపు రోజులలో కూడ అతడు ఆయనకు సహకరించి ఉన్నాడు. శ్రీరామ్ ఆశయాలపట్ల అతడికి గట్టి నమ్మకం ఉంది. ఆయన కారణంగానే అతడు స్వరాజ్య ఉద్యమంలో పాల్గొన్నాడు. అఖండ జ్యోతి రూపంలో కొత్త పనిని చూచి, అతడు సహకరించడానికి ముందుకు వచ్చాడు. అతడు జమాఖర్చులు వ్రాసేవాడు. ఉత్తరాలు వ్రాసేవాడు. పత్రిక 150–200 ప్రతులు ఇంటింటికీ పంచేవాడు. పత్రిక రెండవ సంచిక ప్రచురించబడే సమయానికి పాఠకులనుండి ఎన్నెన్నో ఉత్తరాలు వచ్చి ఉన్నాయి. విద్వాంసులకూ, మహనీయులకూ శ్రీరామ్ వ్రాసిన ఉత్తరాలకు సమాధానాలు కూడ రాసాగాయి.

మహాత్మా గాంధీ నుండి ఉత్తరం వచ్చింది. దానిలో ఆయన ఇలా వ్రాశారు– పత్రిక ఖండన మండనాల జోలికి పోకూడదు. అందరినీ కలుపుకునిపోయే, అన్నింటినీ సమన్వయపరచే విధానాన్ని అనుసరించాలి.

'అఖండ జ్యోతి' ఆశాభావం అనే వెలుగును విరజిమ్మే పత్రిక అని కళ్యాణ్ పత్రిక సంపాదకులు హనుమాన్ ప్రసాద్ పోద్దార్ వ్రాశారు. ఆయన పత్రిక ప్రతులు ఇరవై వేలకుపైగా అప్పుడు అచ్చయేవి. ఆయన 'అఖండ జ్యోతి' పత్రికపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. భారతీయ ధర్మ సంప్రదాయాలకు శ్రీకారం అనీ, అనివార్య ఉపాస్య అయిన గాయత్రి యొక్క సందేశాన్ని ప్రజలకు అందించే సంకల్పాన్ని వ్యక్తం చేయడం పట్ల ఆయన సంతోషాన్ని ప్రకటించారు.

సమాజంలోని వివిధ వర్గాలనుండి పత్రికపై వివిధములైన స్పందనలు వచ్చాయి. బలీయమైన ప్రతిక్రియ తాఈజీనుండి వచ్చింది. అఖండ జ్యోతి తొలి ప్రతిని భగవతి గాయత్రి ఎదుట ఉంచిన వెంటనే ఆమె ఏమీ చెప్పలేదు. నెలరోజుల తర్వాత ఆమె అకస్మాత్తుగా ఇలా అన్నారు–

"శ్రీరామ్! నీవు గాయత్రి మాసపత్రికను ఆగ్రానుండి ప్రచురించావు. దానిమీద చక్రధారిఅయిన కృష్ణపరమాత్మ ఫొటోకూడా ఉంది. ఈ పత్రిక ఆ కృష్ణ పరమాత్మ ధామం అయిన మథురనుండి ప్రచురించబడితే ఎంతో బాగుంటుంది."

★★★

యద్భావం తద్భవతి.

మహిళాజాగరణ

# మహాకాలుని సంకల్పం-21వ శతాబ్దం నారీశతాబ్దం-2

## స్వర్ణకుమారీ దేవి

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ సోదరి స్వర్ణకుమారీ దేవి ఆనాడు సమాజంలో ఉన్న మూఢాచారాలను, మూఢనమ్మకాలను తనదైన పద్ధతిలో నిరసించింది. ముఖ్యంగా మహిళల కోసం, అందులోను వితంతువుల కొరకు, అంతులేని కృషి చేసింది. ప్రౌఢ స్త్రీలకు విద్య నేర్పడానికి, కుటీర పరిశ్రమలలో శిక్షణ ఇయ్యడానికి తన శక్తినంతా ధారపోసింది. స్త్రీల మానసిక వికాసానికి శాయశక్తులా కృషి చేసింది. స్త్రీల మధ్యన తిరుగుతూ అనేక మంది మహిళా కార్యకర్తలను తయారు చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే-స్త్రీ జనాభ్యుదయానికి ఒక ఉద్యమాన్నే లేవదీసింది. ఇలాంటి మహిళల శ్రమ ఫలితంగానే నారీలోకం మేల్కొంది. స్వతంత్ర భారతి ఉదయించింది. నారీ ఉద్యమ కారులకు జోహార్లు.

## సోఫియా సోమజీ

బొంబాయి నగరానికి చెందిన "సోఫియా సోమజీ" నారీ లోకానికే వన్నెతెచ్చిన మహిళ. ఆమె స్త్రీలలో దేశభక్తిని నూరిపోసింది. కుటుంబ శ్రేయస్సుతోపాటు దేశ శ్రేయస్సును కూడ చూడాలని నొక్కి వక్కాణించింది. చెప్పడమే కాదు అనేక మార్లు ఆంగ్లేయులచేత ఖైదు చేయబడింది. చిన్న చిన్న పిల్లలను వదలిపెట్టి జైలులో గడిపింది. పిల్లలకోసమైనా రాజకీయాలకు దూరంగా ఉండు-అని అనేకమంది నచ్చ చెప్పబోయారు. కాని ఆమెమాత్రం "తల్లులు లేని పిల్లలెందరో ఈ లోకంలో జీవిస్తూనే ఉన్నారు. ఇంటిలోని వృద్ధమహిళలు పిల్లల్ని చక్కగా పెంచి పెద్ద చేయగలరు. దేశసౌభాగ్యం తర్వాతనే పిల్లలైనా, తల్లులైనా" -అని ఖచ్చితంగా చెప్పివేసేది. సోఫియా బొంబాయిలో "ఉమెన్ వాలంటియర్ కోర్" అనే సంస్థను స్థాపించింది. దానిద్వారా అనేక మంది మహిళా కార్యకర్తలను తయారు చేసింది. వారందరికీ దేశభక్తిని నూరిపోసింది. దానికి సంబంధించిన వ్యక్తులంతా స్వాతంత్ర్య సమరంలో కృషి చేశారు. కొందరు ప్రాణాలు అర్పించారు. ఈ విధంగా సోఫియా సోమజీ స్వాతంత్ర్య సమరంలో కన్నుమూసింది. దేశం కోసం ప్రాణాలర్పించిన సోఫియా జీవితం అజరామరం.

## రాజకుమారి అమృత్ కౌర్

మహాత్మాగాంధీగారికి ఆంతరంగిక కార్యదర్శిగా, కుడిభుజంగా పనిచేసిన రాజకుమారీ అమృత్ కౌర్ ఆజన్మ బ్రహ్మచారిణి. ఆమె దీనమానవ సేవలు చేసి అల్పకాలంలోనే జనప్రియగా మారింది. జలంధర్ మునిసిపాలిటీలో సభ్యురాలుగా ఎన్నికైంది.

1934లో అస్సాంలో భయంకరమైన వరదలు వచ్చాయి. గ్రామాలకు గ్రామాలే జలసమాధి అయిపోయాయి. లక్షలాది ప్రజలు జలదేవతకాహుతి అయ్యారు. మిగిలిన వారిలో లక్షలాది మంది తినడానికి తిండిలేక, ఉండడానికి ఇల్లులేక, పలకరించడానికి ఆప్తులు లేక అల్లాడిపోతున్నారు. ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం వీరి గురించి ఏ మాత్రం శ్రద్ధ తీసికోలేదు. దేశవాసులే వీరి బాధ్యతను స్వీకరించాల్సి వచ్చింది.

ఈ భయంకర సన్నివేశాన్ని చూస్తూ రాజకుమారీ అమృత్ కౌర్ చేతులు ముడుచుకుని కూర్చోలేకపోయింది. రాత్రింబవళ్లు ప్రాంతమంతా పర్యటించింది. వరద బాధితులకోసం ఆహారపదార్థాలు, వస్త్రాలు ప్రోగు చేసింది. తాను చేయడమేకాక తోటివారిని ప్రేరేపించింది. అనేకచోట్ల గోష్ఠులు, చర్చావేదికలు నిర్వహించింది. సహాయ సహకారాల ఆవశ్యకతను విప్పి చెప్పింది. వేలాది మంది స్వచ్ఛంద సేవకులను సిద్ధం చేసింది. కూడు గుడ్డలేక అలమటిస్తున్న అభాగ్యులకు అండగా నిలిచింది.

స్త్రీ జనాభ్యుదయానికై అమృత్ కౌర్ భగీరథ ప్రయత్నం చేసింది. ఆమె సేవాగ్రామంలో ఉన్నన్నాళ్లు గ్రామీణ మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేసింది. అనేక విధాలుగా వారి మానసిక స్థాయిలో మార్పులు తీసుకువచ్చింది. వారిలో

**ఆలోచనలు మార్చుకుంటే పరిస్థితులు మారతాయి.**

నాటుకునిపోయిన అంధవిశ్వాసాలను, మూఢ నమ్మకాలను, ఆచారాలను దూరం చేయడానికి అలుపెరుగని శ్రమ చేసింది. అంతేకాక "అఖిల భారతీయ మహిళా పరిషత్తు"ను, "మహిళా శిక్షానిధి"ని స్థాపించింది. ఆ రోజుల్లో ప్రబలి ఉన్న బహు భార్యత్వాన్ని, వయస్సు కుదరని వివాహాలను, బాల్య వివాహాలను, ఘోషా పద్ధతిని రూపుమాపే ప్రయత్నంలో తీవ్రమైన వ్యతిరేకతను తట్టుకోవాల్సి వచ్చింది. ఎంతో ధైర్యంగా ఒక ఉద్యమాన్నే నడిపించింది. సమాజంలో సగభాగమైన నారీ లోకాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దకపోయినట్లైతే ఏ దేశమైనా బానిసత్వంలో మగ్గిపోతుందని గొంతెత్తి తెలిపింది. జాతి భేదాన్ని, లింగభేదాన్ని పాటించడంవల్ల దేశం అధోగతి పాలవుతుందని బల్ల గుద్ది చెప్పింది. స్త్రీల సమస్యల గురించి అమృత్ కౌర్ "టూ ఉమెన్", "ఛాలెంజ్ – టు ఉమెన్" అనే రెండు పుస్తకాలను రచించింది. ఆ పుస్తకాలు ప్రజాదరణ పొందాయి.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కూడ అమృత్ కౌర్ తనవంతు పాత్రను నిర్వహించింది. 1942లో ఇతర నాయకులతో పాటు ఆమె అనేక మార్లు జైలుకు వెళ్లింది. స్వతంత్రం లభించాక ప్రప్రధమ మంత్రి మండలిలో అమృత్ కౌర్‌కు ఆరోగ్య మంత్రి బాధ్యతలను అప్పగించి గౌరవించారు. ఆమె తనకప్పగించిన బాధ్యతను ఎంతో నేర్పుగా నిర్వహించి పేరు గడించింది. 1947లో ఈమె ''ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ''కి అధ్యక్షురాలుగా ఎన్నుకోబడింది. 49లో కుష్ఠు నివారణ సంఘానికి, అఖిల భారతీయ యక్ష్మా సంఘటనకు కూడ అధ్యక్షురాలుగా గొప్ప సేవలందించింది. ఆమె అందించిన అపూర్వ సేవలకు 1947లో "లీగ్ ఆఫ్ రెడ్‌క్రాస్ సొసైటీ", "కౌంటు వర్నాడోటీ" స్వర్ణ పతకంతో ఆమెను సన్మానించారు.

1965 ఫిబ్రవరిలో త్యాగశీలియైన ఈ సంఘసేవకురాలు మనందరి నుండి శాశ్వతంగా వీడ్కోలు తీసికున్నది. ఆనాటి ఉపరాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ గారు సేవారంగం నుండి ఒక గొప్ప తార రాలిపోయిందని ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. ఆ ధన్యురాలిని ఆదర్శంగా తీసికొని మనమందరం సేవావ్రత దీక్ష చేపట్టాలనీ, ధన్యులమవ్వాలనీ ఆశిద్దాం. పదిమంది కోసం ఏ రంగంలో పనిచేసినా వారిని వీరాంగనలుగానే భావించి జోహార్లు అర్పించాలి. *(1వ భాగం 2008 ఆగష్టులో ఇవ్వబడింది)*

అనువాదం – పొన్నూరు హైమవతీశాస్త్రి

★★★

## శ్రీమతి ఎమ్.వి. సుబ్బులు గారి విశిష్టమైన సేవలు



*శ్రీమతి సుబ్బులు గారు 2008 ఫిబ్రవరిలో శాంతికుంజ్‌లో జరిగిన యుగ శిల్పి ట్రైనింగ్ కాంప్‌లో పాల్గొన్నారు. హైదరాబాద్ వాస్తవ్యులైన వీరు అప్పటినుండి యుగ శక్తి గాయత్రికి 166 చందాదారులను చేర్పించారు. వీరి కుమారుడు నారాయణరావు కోడలు గీతారాధికతో కలసి 900 గృహాలలో దేవస్థాపన కార్యక్రమం జరిపించారు. గురుదేవుల సాహిత్యం ఇంటింటికి తీసుకెళ్ళే భాగంగా క్రాంతి ధర్మి సాహిత్యం 80 సెట్లు, ఇతర సాహిత్యం అందించారు. ఈ సంవత్సర కాలంలో 20 జన్మదిన సంస్కారాలు, 20 దీపయజ్ఞాలు, 2 పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞాలు, 4 ఏకకుండీ గాయత్రీ మహాయజ్ఞాలు నిర్వహించారు. వీరి కృషి అభినందనీయం.*

**ఆశావాదం జీవితానికి పుష్టినీ, సమృద్ధినీ, ప్రగతినీ అందిస్తుంది.**

నావారితో నామాట-2

# శతజయంతి ఉత్సవాలరూపురేఖలు

## సంకల్పం గట్టిగా ఉంటే ఫలితం అందివస్తుంది

మీరు గతసంచికలో శతజయంతి 2011 ఏర్పాట్ల గురించి చదివి కొంత వరకు అవగాహనకు వచ్చారు. అది ప్రారంభం గురించిన యోజన మాత్రమే. దీనిని ఒక క్రమంలో పెట్టాలంటే 3-4 నెలల సమయం పడుతుంది. అప్పటికి చైతన్యవంతులైన పాఠకులు తమతమ అభిప్రాయాలను మాకు అందజేస్తారు. ఒక యుగపురుషుని శతాబ్దిగురించి చేసినఏర్పాట్లు ఆధ్యాత్మిక పరమైనవిగాఉండాలి. అంతేకాదు. వారి సమగ్రస్వరూపం, ఆలోచన, జీవనదృష్టి ప్రజలముందు ప్రవేశపెట్టగలగాలి. అప్పుడే ప్రజలు హృదయపూర్వకంగా స్వీకరించగలుగుతారు. ఇప్పుడు 750 కన్నా తక్కువరోజులే మిగిలిఉన్నాయి. ఒక్కొక్క రోజు చాల విలువైనది. 20-1-2010 నుండి 8-2-2011 వరకు గల స్వరూపాన్ని చెప్పడం జరిగింది. ఈ విరాట్ సాంస్కృతిక రూపాన్ని తరచిచూడాల్సిన సమయం ఆసన్నమయింది. ఉద్ఘాటన మహోత్సవం బహుశా 8-2-2011 వసంత పంచమి దరిదాపుల్లో జరగవచ్చు. ఇది అంతర్జాతీయ జ్ఞాన కుంభ స్థాయిలో జరుగవచ్చు. అంతవరకు తగినంత సాహిత్యం, అనువాదాలు మొదలైనవి తయారు అవుతూ ఉంటాయి. మార్చి నెలను మహిళలకు కేటాయించే ఆలోచన ఉన్నది. ఈ 21వ శతాబ్ది వారిదే. మార్చి నెలలో అక్కడ కూడ మహిళల సమావేశాలు జరుగుతూ ఉంటాయి. ఒక్క సమావేశం కేంద్రంలో (శాంతికుంజ్) భారీ యెత్తున నిర్వహించే ఆలోచన నడుస్తోంది. మిగతా విషయాలను చర్చిద్దాం.

### నవరాత్రి అనుష్ఠానాలు సాధనకే సమర్పితం

ఏప్రియల్ నెలలో చైత్రనవరాత్రులు 4వ తేదీనుండి 12వ తేదీ వరకు, నిర్వహింపబడతాయి. ఏప్రియల్ 12న శ్రీరామనవమి. ఏప్రియల్ 18వ తేదీన చైత్రపూర్ణిమ. ఇది వసంత ఋతువు వెళ్లి గ్రీష్మఋతువు ప్రవేశించే సమయం. ఈ నెల దేశమంతటా సాధనకు అనుకూలమైనది. సామూహిక సాధనా కార్యక్రమాలు అక్కడక్కడ జరిపించాలి. రకరకాల ధార్మిక సంస్థలలో, ఉపాసనా మందిరాలలో సామూహిక కార్యక్రమాలు జరుగుతూ ఉండాలి. సామూహిక కార్యక్రమాల ప్రభావం అందరికీ తెలిసి రావాలి. ఆ కార్యక్రమాల్లో అధిక సంఖ్యాకులు పాల్గొనేటట్లు ప్రయత్నించాలి. గాయత్రీ పరివార్ తలపెట్టిన ప్రతీ కార్యక్రమం యొక్క లక్ష్యం సాధనా ముఖంగానే ఉండాలి.

2011 సంవత్సరంలో ఈ ఉద్యమం దేశాన్ని ఒక్క ఊపు ఊపివేయాలి. ఇంటింటా మంత్ర లేఖనం జరగాలి. మంత్ర జపం, మంత్రలేఖనం జరిగిన సంఖ్యను జమ చేస్తూ ఉండాలి. అయిదేసి రోజులు సాధనా ప్రశిక్షణా శిబిరాలు నిర్వహింపబడాలి. దాదాపుగా పరిజనులందరు ప్రశిక్షితులై ఉండాలి. ఈ నెలంతా సూర్య ప్రభావానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి. నెలంతా సాధన అధికంగా జరగాలి. సాధనా పద్ధతుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక రహస్యాలను తెలియ చేసే నిమిత్తం అప్పుడప్పుడు కార్యశాలలు నిర్వహించాలి. పరమపూజ్య గురుదేవులు యోగసాధనలను సరళీకృతం చేసి మనముందుంచారు. వాటిని పరిజనులకు నేర్పించి ఆచరింపచేయాలి. భిన్న భిన్న ధర్మాలవారు, భిన్న భిన్న సంప్రదాయాల వారు పాటించగలగాలి. కేవలం బోధించడమేకాదు. ఆచరించి, ఆచరింపచేయాలి. భారతీయ సంస్కృతీ మూలాలను, ఉపాసనా పద్ధతులను జీవితాలలో ప్రవేశపెట్టగలగాలి.

కర్తవ్య పాలనలో, సమాజ సేవలో, పరోపకారంలో ఇమిడి ఉండేది ధర్మం.

## సామూహిక సాధనలు జోరుగా సాగాలి

2011 ఏప్రియల్ నెలమొత్తం సాధన, జీవన సాధన, సంయమం యొక్క మహత్తును గుర్తెరిగి సాధించాలి. ఉపాసనా పద్ధతులకు పట్టం గట్టి దీక్షగా కొనసాగాలి. పరిజనులందరి క్రియా కలాపాలు ఈ లక్ష్యంపైననే కేంద్రీకరింపబడాలి. సామూహిక కార్యకలాపాల వల్ల కలిగే ఫలితాలను, ప్రపంచీకరణ వాతావరణాన్ని తెలియ చెయ్యాలి. ఈ ఏకాత్మతా భావన సమస్యలను ఎలా పరిష్కరిస్తుందో తెలియ చెయ్యాలి. చైత్రమాస నవరాత్రులు పరివర్తనకు మూలమైన ఒక మహత్తర సమయం. ఈ ఒక్క నెలలో లక్షలాది- కోట్లాది పరిజనులు ఒకేసారి, ఒకేఆలోచన చేయగలిగినట్లైతే అరిష్టాలు, విపత్తులు, విద్వేషాలు మన దరిదాపులకు కూడ రాలేవు. మనం చేయాల్సిందల్లా దీనికి తగిన పరిస్థితులను సమకూర్చి ఇవ్వడమే. సామూహిక ఉపాసనా ఫలితాల గురించి సాధారణ వ్యక్తికికూడ తెలియచెయ్యాలి. అప్పుడే భవిష్యత్తులో కష్టాలను- దుర్మార్గులను ఎదిరించి పోరాడగల ధైర్య స్థైర్యాలు సమకూరుతాయి. గాయత్రీ మంత్ర రహస్యంకూడ ఇదే. అందరికీ సద్బుద్ధిని ప్రసాదిస్తూనే ఉజ్జ్వల భవిష్యత్తును కల్గించాలన్న లక్ష్యంతో ప్రార్థించాలి.

## చికిత్సావిధానంపై విప్లవాత్మక మార్పు వస్తుంది

2011 మే నెలలో అఖిలవిశ్వగాయత్రీ పరివార్ ద్వారా భారత దేశంలోనే గాక ప్రపంచ మానవాళి కందరికీ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఆలోచనలు జరుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా అన్ని థెరపీలతో సంబంధం ఉన్న డాక్టర్లనందరిని సమావేశపరచే ఆలోచన ఉంది. దానితో పాటు అతి ప్రాచీనవైన యోగ, ఆయుర్వేద చికిత్సావిధానాల్లో ఇమిడి ఉన్న వైజ్ఞానిక సూత్రాలను ప్రదర్శించడం జరుగుతుంది. ఈ ప్రదర్శనలు అనేకచోట్ల ఏర్పాటు చేయబడతాయి. పరమపూజ్య గురుదేవులు తన జీవిత కాలమంతా ఈ చికిత్సా పద్ధతులను జీవితంలో అంగాలుగా ఏర్పాటు చేయడానికి కృషి చేశారు. దీనికొరకు వారు 1945-46 నుండే వ్రాయడం ప్రారంభించారు. అప్పుడప్పుడు శాంతికుంజ్ హరిద్వార్‌లో రక రకాల ప్రయోగాలకొరకు శిబిరాలు నిర్వహించారు. ఆ శిబిరాలలో పాల్గొన్న ప్రముఖులు ఇప్పటికీ జీవించి ఉన్నారు. అలనాటి అనుభవజ్ఞులను సమావేశ పరచి ప్రయోజనాన్ని పొందాలన్న నిర్ణయం జరిగింది. దేవసంస్కృతి విశ్వవిద్యాలయం, శాంతికుంజ్ ఫార్మసీ, బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్‌ల ద్వారా 1980 నుండి ఇప్పటివరకు జరిగిన పరిశోధనలను ప్రజల ముందుకు రిసర్చ్ పేపర్ల రూపంలో, బులటిన్ రూపంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. ప్రత్యేక వ్యాధుల మీద చేసిన నూతన పరిశోధనలను ప్రకటించడం జరుగుతుంది. 'రిసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రతిష్ఠాన్" ద్వార ప్రపంచ వైజ్ఞానికుల సమక్షంలో ఉంచడం జరుగుతుంది.

## అందరికీ ఆరోగ్యం - వైజ్ఞానిక దృష్టి

సమగ్ర ఆరోగ్య వ్యవస్థకు సంబంధించిన రీతి-నీతి ఎలా ఉండాలి? యోగాను సులభతరంచేసి రోగాలనుండి రక్షించడానికి ఏ విధంగా ఉపయోగించాలి? అన్న విషయంపై శోధన జరుగుతుంది. ఆరోగ్యం కోసం ఔషధవనాల పెంపకం జరిగేలా చూడడం జరుగుతుంది. మూలికా వనాల ద్వారా చికిత్సాతంత్రం ఎలా తయారు చేయాలీ, ఆయుర్వేదవిజ్ఞానాన్ని ఏ విధంగా అందచేయాలి? అన్న విషయాల గురించే ఈ నెల మొత్తం కృషి చేయడం జరుగుతుంది. ఈ సమయంలో వారానికి ఒక్క సెమినార్ "వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్" తో కలసి నిర్వహించడం జరుగుతుంది. ఈ విషయానికి సంబంధించిన ప్రముఖులను ఆహ్వానించడం జరుగుతుంది. దీని ద్వారా ఆరోగ్య ఉద్యమానికి నూతన రూపాన్ని, ఉన్నతస్థానాన్ని ఇవ్వడంజరుగుతుంది. దేవసంస్కృతీవిశ్వ విద్యాలయంలోని యోగచికిత్స, మానసిక చికిత్స విభాగాలతోపాటు 'సమగ్ర ఆరోగ్యప్రబంధన' విభాగం తమ వంతు పాత్రను నిర్వహించడం మొదలుపెడతాయి. అంతే కాదు అక్కడక్కడ జరుగుతున్న రక రకాల ప్రయత్నాలను పర్యవేక్షించి, తమ నెట్‌వర్క్ ప్రారంభిస్తాయి. ఈ సంవత్సరం అనేకమంది క్రొత్త క్రొత్త

మనిషిలోని దైవీ ప్రవృత్తులు - సామాజికత - సామూహికత.

"రిసర్చి జర్నల్స్" పరిచయం కాబోతున్నాయి. అట్లాగే విశ్వవిద్యాలయానికి అంతర్గతంగా ఉన్న ప్రముఖ రిసర్చి గ్రంథాలు కూడ ఆవిష్కరింపబడతాయి. యుగఋషి జీవితంతో ముడిపడి ఉన్న ఆరోగ్యానికి సంబంధించిన అన్ని పద్ధతుల లెక్కలన్నీ ఒక కాంపౌండు వాల్యూమ్" లో ప్రకటించబడుతుంది. అక్కడక్కడ వ్యాయామశాలలు నిర్వహించబడతాయి. ఔషధవనాలు పెంచి, పోషింపబడతాయి.

## జూన్‌లో యువతను జాగృతం చేద్దాం

11-6-2011న గాయత్రీ జయంతి ఉత్సవం రాబోతున్నది. ఈ నెలలో దేశంలోని యువతను చైతన్యపరచడం జరుగుతుంది. ఉత్సాహభరితులైన యువతీ యువకులను సమావేశపరచి ఒక ఉద్యమ రూపంలో నడిపించాలి. ఈ నెల మొత్తం యువతకే సమర్పితం. భారతదేశం ఇప్పటికే అన్నిదేశాలకన్నా యువత విషయంలో అధికసంఖ్యను కలిగిఉన్నది. ఇప్పటికి యువత 54 కోట్ల సంఖ్యలో ఉన్నది. బహుశా 2011 నాటికి 60 కోట్లు మించవచ్చు. ప్రస్తుతం దేశమంతటా యువా శిబిరాలు నడుస్తూనే ఉన్నాయి. వేలాది సంఖ్యలో యువతీయువకులు పాల్గొంటున్నారు. ఇప్పుడు (డిసెంబర్‌లో) మహారాష్ట్రలోని అకోలాలోను, మధ్యప్రదేశ్‌లోని శాజాపూర్‌లోను, రాజస్థాన్‌లోని ఝూలావాడ్‌లోను మూడేసిరోజులపాటు శిబిరాలు జరుగబోతున్నాయి. ప్రతి రాష్ట్రంలోను 'యువా మండళ్లు' నిర్మాణం జరుగుతూనే ఉంది. గాయత్రీ పరివార్ యూత్ గ్రూప్ (జి.పి.వై. జీ.) దేశంలోని అన్ని మహానగరాలలోను తన కార్యక్రమంలో నిమగ్నమై ఉంది. సభ్యులంతా సమర్పింత భావంతో పని చేస్తున్నారు. తమ తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే యువతను చైతన్య పరచడంలో నిమగ్నమై ఉన్నారు.

## ప్రపంచయువతకే మార్గదర్శనం

క్రియాశీలురైన యువతకు జీవనసాధన గురించి, స్వయం సేవకబృందాలఏర్పాటుకు, మత్తు పదార్థాల బారినుండి రక్షించడానికి, విద్యావిస్తరణకు, అశ్లీలతా నివారణకు, వరకట్న రాక్షసిని తరిమివేయడానికి బాధ్యతలు ఇవ్వబడ్డాయి. 2009లో వీరికి దేశమంతా ప్రశిక్షణాశిబిరాలు ప్రారంభమౌతాయి. అన్ని యువామండళ్లు విభిన్న విశ్వవిద్యాలయాలతోను, సంస్కృతీ మండళ్లతోను సంబంధాలు పెంచుకుని ఈ కార్యక్రమాలను వేగవంతం చేయాలి. 8 సంవత్సరాల సమయంలో 22 దేశాలలో అనేక శిబిరాలు జరిగాయి. ('దియా') 'జ్యోతి' అనే పేరుతో (సంగఠన్) వ్యవస్థ భారతదేశంలోని ప్రతీజిల్లాలో 2011 నాటికి జరిగిపోతాయి. ఇది దేవసంస్కృతి విశ్వవిద్యాలయానికి సంబంధించినది. 'అంతర్జాతీయ యువా ఫోరం' ఒకటి నిర్మాణ మవుతుంది. అక్కడ ప్రపంచ యువతకే మార్గదర్శనం లభిస్తుంది. దేశ రాజధాని ఢిల్లీలో విరాట్ యువా మహోత్సవం జరిపించాలన్న ఆలోచన ఉన్నది. సమర్పిత భావంగల యువతీ యువకులు ఆ ఉత్సవంలో పాల్గొంటారు. ఇంతేకాక అప్పటికప్పుడు జరిగే విస్తృత కార్యక్రమాలను తెలియచేస్తూ ఉంటాం. పాఠకులు గమనిస్తూ ఉండాలి.

## సాధన-గంగోత్రి పర్వం-గురుపూర్ణిమ

25-7-2011 నాడు గురుపూర్ణిమఉత్సవం. ఆనాడు గురుసత్తాకు జీవనదానం, అంశదానం, సమయదానం సమర్పించడం ప్రధాన అంశంగా ఉంటుంది. భారతదేశమంతటి నుండి సంపూర్ణ సమర్పణ చేసికున్న కార్యకర్తల అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే కేంద్రం యొక్క పిలుపును అందుకుని లక్షల సంఖ్యలో కార్యకర్తలు దృఢసంకల్పంతో ముందుకు వస్తూనే ఉన్నారు.

ఈ విశిష్టసాధనా పర్వం సందర్భంగా విభిన్న క్షేత్రాలలో ప్రతిభా దానం చేస్తున్న మేధావులందరికీ మూడు రోజులు ప్రత్యేకంగా పండుగ చేయాలని మా భావన. ఈ పండుగను ఒకేచోట జరుపాలన్న నియమంలేదు. అనేకచోట్ల జరుపుకోవచ్చు. మిషన్ కార్యక్రమాల్లో నిమగ్నమైయున్న ప్రముఖ కార్యకర్తలను పునాది రాళ్లుగా భావించి ఈ పండుగ పేరుతో ఎక్కడి వారికి అక్కడే సన్మానాలు చెయ్యాలి. నూతనంగా వచ్చి చేరిన సమయదాతలను క్రమశిక్షణాయుతమైన సైన్యంగా తీర్చిదిద్దాలి.

మరికొన్ని వివరాలు వచ్చే సంచికలో.............

అనువాదం - పొన్నూరు హైమవతీశాస్త్రి

★★★

**ధర్మం సారవంతమైన భూమి. నాటాల్సిన విత్తనాలను జాగ్రత్తగా ఎంచుకోవాలి.**

# గాయత్రీమంత్రం సర్వ మానవకోటికి చెందింది-మద్రాసు హైకోర్టుతీర్పు

గాయత్రీ మంత్రం వేదజ్ఞానమునకు తాళం చెవి. గాయత్రీ మంత్రం సాధకుని పునీతునిగా చేసి, సంరక్షిస్తుంది. ఇది ఒక విలక్షణమైన ప్రార్థన. వేదములు ఏ మతం గురించి మాట్లాడవు, ఏ మత వ్యాపకత్వం గురించి పట్టించుకోవు.

– జస్టిస్ డి. రాజు

1983 సంవత్సరం దీపావళి పండుగ సందర్భమున జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మద్రాసు అచ్చువేసిన గ్రీటింగ్ కార్డులో గాయత్రీ మంత్రం, దాని అర్థము, రోజు మూడు పూట్ల కనీసం 5 సార్లు గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించమనే సందేశంతో వారి కష్టమర్సుకు పంపింది.

ద్రవిడ కజగమ్ అనే సంస్థ గాయత్రీ మంత్రం అల్ప సంఖ్యాకులైన బ్రాహ్మణులకు సంబంధించినదనీ, అది హిందూ మతానికి సంబంధించినదనీ, ప్రభుత్వ సంస్థ అయిన జనరల్ ఇన్సరెన్స్ కార్పొరేషన్ దీనిని ప్రచురించడం, ఈ మంత్ర ప్రాచుర్యానికి ప్రయత్నం చెయ్యడం సెక్యూలర్ దేశమైన మన రాజ్యాంగ విరుద్ధమని. జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, చైర్మన్ ఇటువంటి కార్యములు చెయ్యకుండా ఆపవలసిందని మద్రాసు హై కోర్టులో రిట్ పిటషన్ దాఖలయ్యింది.

1983 నుండి 1991 వరకు జరిగిన వాదోపవాదాలు విన్న హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. తీర్పులోని కొన్ని ముఖ్యాంశాలు–

గాయత్రి మంత్రాన్ని 'శబ్ద బ్రహ్మ' అంటారు. ఇది ఋగ్వేదంలోని 3వ మండలం, 6వ సూత్రంలో 10వ మంత్రం దీనిని సర్వవ్యాపకమైన భగవత్ తత్వంగా, ఒక యూనివర్సల్ ప్రేయర్. (సర్వ మానవాళికి చెందిన ప్రార్థన), ఇది ఎక్కడా దయ చూపుమని, క్షమించుమని అడుగదు. చేతనత్వంలో అందరికి సద్బుద్ధిని ప్రసాదించుమని, సత్యమును చేతనత్వంతో ఎటువంటి గందర గోళం లేకుండా ప్రసరింప చేయుమనే ప్రార్థన. గాయత్రి మంత్రమూలం వేదాలలో ఉన్నది. ఇది వేదకాలం నాటిది. ఈనాటి మతములు పుట్టకముందే వేదములున్నాయి. అవి ఏ మతం గురించి మాట్లాడవు.

పిటిషనర్ గాయత్రి మంత్రం ఒక మతానికి చెందినదని, వారే సాధన చెయ్యాలి అనటం సరికాదు. అదేవిధముగా బ్రాహ్మణులు మాత్రమే గాయత్రి మంత్రం ఉచ్చరించాలనడానికి ఎలాంటి ఆధారం లేదు.

జె.బి.ఎస్. హల్‌దేన్ అనే ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్త "గాయత్రి మంత్రం ప్రతి పరిశోధనశాల తలుపులపై చెక్కబడాలి." అని అన్నారు. భారతీయ మిస్టిసిసమ్, అనంతమైన ఆధ్యాత్మికతకు, మానవుల జీవన విధానానికి ఒక ప్రాక్టికల్ గైడ్, ఇది మానవులను దైవంగా మార్చే లక్ష్యంగలది. అందువలన దీనిని శాస్త్రములకే శాస్త్రంగా కీర్తించారు. ఇది భారతదేశానికి చెందినది కాదు. ఒక మతానికి చెందినది కాదు. సత్యమేమిటంటే ఇది ఒక సర్వ మానవాళికి చెందినది.

మద్రాసు హైకోర్టు
10 అక్టోబర్ 1991/
రిట్ పిటిషన్ సంఖ్య 10102 , సంవత్సరం 1983

సేకరణ – రత్నాకర్

★★★

## పాఠకులకు విజ్ఞప్తి

*యుగశక్తి గాయత్రి మాసపత్రిక అందనివారు ఫిర్యాదు చేసినపుడు– చందాదారుని పేరు, పూర్తి అడ్రసు, పిన్‌కోడ్‌తోసహా, సభ్యత్వ కోడ్ (సభ్యత్వ కోడ్ కొరకు పత్రికమీద ఉన్న అడ్రసు స్లిప్ చూడండి) తెలియపరచవలసిందిగా కోరుతున్నాము.*

# ఏ పుస్తకంలో ఏముంది?

**క్రాంతిధర్మీ సాహిత్యం** - సెట్ (20 పుస్తకాలు)
హిందీమూలం : పండిత శ్రీరామశర్మ ఆచార్య
తెలుగు అనువాదం : వేర్వేరు వ్యక్తులు
పరిచయకర్త : శ్రీ ముక్కామల రత్నాకర్
వెల : మొత్తం కలిపి రూ॥ 60-00
ప్రాప్తిస్థానం : గాయత్రీ చేతనాకేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18

పరమపూజ్య గురుదేవుల సాహిత్యం హిందీలో వేలాది పుస్తకాల రూపంలో వెలువడింది. వారు చివరగా వ్రాసిన 'క్రాంతిధర్మీ సాహిత్యం' అత్యంత స్ఫూర్తిదాయకమైంది. వారి మాటల్లోనే-

"ఇవి నా విచారక్రాంతి (ఆలోచనాఉద్యమం) యొక్క బీజాలు. ఇవి ఏ మాత్రం విస్తరింపబడినా మానవ జాతినే కుదిపివేస్తాయి. ప్రపంచపటాన్నే పూర్తిగా మార్చివేస్తాయి. నిజానికి ఈ పుస్తకాలలో కేవలం ఆలోచనలేకాదు ఒక మహా ఉద్యమజ్వాల జ్వలిస్తూ ఉన్నది. యుగ పరివర్తన దిశ నిర్ణయించబడింది."

వారు మొదటి నుండీ వ్రాసిన సమగ్రసాహిత్యాన్ని ఒక శిబ్బిలోను ఈ 20 పుస్తకాలను ఒక శిబ్బిలోను పెట్టితూచి నట్లైతే ఈ 20 పుస్తకాలే మొగ్గుచూపుతాయి. వేర్వేరు అంశాలతో వ్రాయబడిన ఈ పుస్తకాలు అందరు చదువదగినవీ, ఇతరుల చేత చదివించదగినవీ అంటూ గురుదేవులే నొక్కి వక్కాణించారు. ఈ పుస్తకాలు ఒక్కసారి చదివితే అర్థంకావు. 100 సార్లు చదవాల్సి ఉంటుంది. అంటే పదే పదే చదవాలన్నమాట. పరిచయం కోసం పుస్తకాల పేర్లు ఇవ్వబడుతున్నాయి.

(1) 21వ శతాబ్ది - ఉజ్వల భవిష్యత్తు-1
(2) 21వ శతాబ్ది - ఉజ్వల భవిష్యత్తు-2
(3) యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారం-1
(4) యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారం-2
(5) సత్యయుగ పునరాగమనం
(6) పరివర్తన యొక్క గొప్ప లక్షణములు
(7) జీవన సాధన బంగారు సూత్రాలు
(8) ప్రతిభావంతులకు మహాకాలుని పిలుపు
(9) ప్రజ్ఞావతార విస్తార ప్రక్రియ
(10) నూతన సృష్టికి మహాకాలుని ప్రణాళిక
(11) నేటి సమస్యలు - రేపటి సమాధానాలు
(12) మనఃస్థితి మారితే పరిస్థితులు మారతాయి
(13) సృష్టికర్త పరమ ప్రసాదం - ప్రఖర ప్రజ్ఞ
(14) ఆదిశక్తి గాయత్రి - సమర్థ సాధన
(15) చదువు-విద్య
(16) సంజీవనీ విద్య యొక్క విస్తారమైన రూపము
(17) భావసంవేదనల గంగోత్రి
(18) మహిళా జాగరణోద్యమం
(19) జీవన దేవతా సాధన - ఆరాధన
(20) సమయదానమే యుగధర్మం

★★★

## యుగశక్తి గాయత్రి పాఠకులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి అందని వారు క్రింది నంబరుకు ఫోనుచేసి తెలుపగలరు.

Email : **gckhyderabad@yahoo.com** సెల్ నంబరు : **9652862601**
గాయత్రీ చేతనా కేంద్రం-హైదరాబాదు.

**విద్య, ఆరోగ్యం, ధనం, ప్రతిష్ఠ, పవిత్రత, సంగఠన, సౌశీల్యం-అనే ఏడు బలాలను వ్యక్తిలో పెంచేది ధర్మం.**

సద్గురులీలామృతం

# అదృశ్యదృష్టి

1970 అక్టోబరు శిబిరానికి భార్యాబిడ్డలతో వెళ్లాను. ప్రశిక్షణ పూర్తి అయింది. తిరుగు ప్రయాణం దగ్గరపడింది. ఒకరోజు గురుదేవులతో కుటుంబయోగక్షేమాల గురించి మాట్లాడుతూ కూర్చున్నాను. మాటల మధ్యలో ప్రముఖ వకీలు, ప్రముఖ కార్యకర్త అయిన శ్రీ ఉమాశాంతర్ఝూ గురించి మాట్లాడాను. వెంటనే గురుదేవులు ముఖం చిన్నపుచ్చుకున్నారు. గట్టిగా నిట్టూర్చి ఆయన పని పూర్తి అయింది. అన్నారు. నాకేమీ అర్థంకాలేదు. అదేరోజు బయలుదేరి ఇల్లుచేరాము. వెళ్లీ వెళ్లగానే విన్న పిడుగులాంటి వార్త "ఝూ ఇకలేరు" అని.

అద్భుతమైన గురుదేవుల అదృశ్యదృష్టి నన్ను ఆశ్చర్యపరచింది.

రామకృష్ణసింహ్ ఎడ్వకేట్, బేతియా

# కష్టాలరాశి తరిగి పోయింది

అనేక సమస్యలు నన్ను చుట్టుముట్టాయి. ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాను. ఏం చేయాలో తోచని పరిస్థితి. అర్థాంగిని వెంటబెట్టుకుని 1964 శిబిరానికి వెళ్లాను. శిబిరానంతరం గురుదేవుల శరణువేడాను. కొండలాగా నిలబడ్డ సమస్యలు పలచబడిపోయినాయి. నాకు హై బి.పి. తగ్గింది. నా భార్యకు గుండె జబ్బు తగ్గిపోయింది. ఆమెకు వైద్యం చేసిన డాక్టర్లే ముక్కు మీద వేలేసుకున్నారు. నా చిన్న కొడుకు చదువు పూర్తిచేసికొని డాక్టరయ్యాడు. నాకుమార్తెకు మంచి కుటుంబంతో సంబంధం కుదిరింది. ప్రభుత్వం దగ్గర చిక్కుపడిఉన్న 7000 రూపాయలు తిరిగి లభించాయి. కోర్టులో ఉన్న ఇంటిపై కేసు నా పక్షాన తీర్పు లభించింది. ఇలాంటి లాభాలు ఇంకా ఇంకా ఎన్నెన్నో ప్రాప్తించాయి. నాలాగానే ఎంతోమంది పరిజనులు గురుకృప వల్ల ప్రయోజనాలు పొందారు. కేవలం ఇవే కాకుండా ఆధ్యాత్మిక ప్రాప్తి గురించి వేరుగా చెప్పాల్సిన పనిలేదు.

ఇంద్రరాజవ్యాస్, నాగౌర్-రాజస్థాన్

# అడుగకముందే ఆదరణ

1963 నాటిమాట. నా భార్యకు సన్నిపాతజ్వరం వచ్చింది. 107 డిగ్రీల నుండి జ్వరం క్రిందకు దిగడమేలేదు. పరిస్థితి దిగజారిపోతున్నది. డాక్టర్లు తమ అసహాయతను ప్రకటించారు. చిన్న చిన్న పిల్లలు నలుగురు. ఒకవేళ ఆమెకేదైనా జరిగితే వారి గతి ఏంటి? ఏ విధంగా పెంచి పెద్దచేయాలి? నా బాధను ఎవరితో చెప్పుకోవాలి? ఏంచేయాలి?

ఆ పరిస్థితిలో గురుదేవులు గుర్తుకువచ్చారు. వెంటనే జాబు వ్రాశాను. దానిలో ఆవేదనతో ఆర్తినంతా వెళ్లబోశాను. పోస్టు చేశాను. మూడవ నాటికే జవాబు వచ్చింది. అప్పుడే ఎలావచ్చిందన్న ఆశ్చర్యంతో లేఖపై ముద్ర చూచాను. ఆశ్యర్యం. నేను వ్రాసిన రోజే ఆ లేఖ కూడ వ్రాయబడింది. మార్చి 17న నేను వ్రాశాను. సరిగ్గా అదే తేదిన గురుదేవులు వ్రాశారు. టెలిగ్రాం ఇచ్చినా ఇంత తొందరగా ముట్టేదిగాదేమో! నేనిక్కడ ప్రొద్దున 10 గంటలకు పోష్టుచేశాను. సరిగ్గా అదే సమయాన్ని మధుర పోష్టాఫీసు వారి ముద్ర చూపిస్తున్నది. అప్పుడు నాకనిపించింది. సరిగ్గా నేను వ్రాసిన సమయంలోనే వారు కూడ వ్రాసి ఉంటారు. నేను డబ్బాలో వేసిన సమయంలోనే వేసి ఉంటారు. ఎంత ఆశ్చర్యకరమైన విషయం. నా భార్యపూర్తిగా కోలుకుంది. 6 నెలల తర్వాత ఆమెను తీసికొని మధురకు వెళ్లాను. పత్రరహస్యాన్ని ప్రశ్నించాను. చిరునవ్వే సమాధానం.

ఉమశరణనిచల్, శిలాంగ్-అస్సాం.

★★★

సమాజంయొక్క శక్తి దేనివల్ల పెరుగుతుందో, అది ధర్మం.

వార్తలు

# గాయత్రీ చేతనాకేంద్రం-3వ వార్షికోత్సవం

8-2-2009 ఆదివారంనాడు గాయత్రీ చేతనా కేంద్రం 3వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహింపబడింది. ఉదయం 10 గంటల వరకు పరిజనులు మందిరంలో ధ్యానం చేశారు. 10 గంటల నుండి 1 గంట వరకు సామూహిక సత్యనారాయణ వ్రతం, 24 కుండీల గాయత్రీ మహాయజ్ఞం జంటగా నిర్వహింపబడ్డాయి. సత్యనారాయణవ్రత కథలో 125 జంటలు(దంపతులు) పాల్గొన్నారు. దక్షిణభారత కన్వీనర్ శ్రీ అశ్విని సుబ్బారావు గురుదేవులచేత సంస్కరించబడిన వ్రతకథను సోదాహరణంగా వివరించి చెప్పారు. యజ్ఞంతోపాటు కథను జోడిస్తూ జంటగా నడిపించడం ఇదే ప్రప్రథమం అని శ్రీ అశ్విని సుబ్బారావు తెలియ చేశారు. దాదాపు 1500 మంది భక్తులు హాజరయ్యారు. భోజన ప్రసాదం ఇవ్వబడింది.

సాయంకాలం గం॥ 6-30 ని॥ల నుండి ప్రజ్ఞాపురాణ కథా ప్రవచనం, 108 దీపాలతో దీపయజ్ఞం నిర్వహింపబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీమతి బి.అనసూయమ్మ, శ్రీమతి ఉష, శ్రీ లక్ష్మణరావు నిర్వహించారు.

శాంతికుంజ్ నుండి వచ్చిన గాయక బృందం (శ్రీ తోషన్, శ్రీ ఫూల్‌సింగ్), శ్రీమతి అనసూయమ్మ తదితరులు ఉదయం నుండి సాయంత్రం వరకు తమ గానలహరితో ఉర్రూతలూగించారు. పరిజనులందరు తీర్థప్రసాదాలు స్వీకరించి పరమానందంతో గృహాలకు చేరుకున్నారు.

# హైదరాబాద్ గాయత్రీ చేతనాకేంద్రంలో

31-1-2009 వసంత పంచమి సందర్భంగా హైదరాబాద్ గాయత్రీ చేతనాకేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 6 గంటలకు శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరం నలుమూలల నుండి పరిజనులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఢిల్లీ పరివార్ నుండి విచ్చేసిన ప్రముఖ కార్యకర్త శ్రీ సంతోష్ కుమార్ వసంతపంచమి శుభాకాంక్షలను తెలుపుతూ పరివార్‌లోని స్త్రీ పురుషులందరు తమ తమ మండళ్ల ద్వారా సమాజసేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. 9 గంటల వరకు అక్షరాభ్యాసం, ఉపనయనం, నామకరణం మొదలైన సంస్కారాలు నిర్వహించబడ్డాయి. 9 గంటల నుండి 12 గంటల వరకు బృందాలవారిగా 5 కుండీల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్, శ్రీ వేణుగోపాల్, చి॥ రమ్య, శ్రీమతి విజయావిశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగింది. ఉ॥ 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గురుదేవుల అష్టోత్తర శతనామావళి పారాయణ, గం॥ 6-30 ని॥ల నుండి 8 గంటల వరకు దీపయజ్ఞం జరిగాయి. చి॥ సాహస్, చి॥ నైషధ విరామం లేకుండ రెండుగంటల పాటు పారాయణ చేశారు. చి॥ రమ్య, చి॥ అలేఖ్య 108 దీపాలను మూడు పద్మాలుగా అలంకరించి నూతన శోభను కల్పించారు.

ఈ కార్యక్రమానికి 300 మంది పరిజనులు హాజరయ్యారు. శ్రీ హరికృష్ణ, శ్రీమతి బృందాదేవి, శ్రీ రాకేశ్‌రావు, శ్రీమతి విజయవివ్వనాథ్ సహకరించారు.

★★★

## శాంతికుంజ్‌లో 9 రోజుల సంజీవని సాధనాశిబిరం తెలుగులో

21-04-09 నుండి 29-04-09 వరకు 9 రోజుల సంజీవని సాధనా శిబిరం తెలుగు వారి కొరకు తెలుగులో ప్రత్యేకంగా నిర్వహించబడుతుంది. జిల్లా కార్యకర్తలు ఈ విషయం అందరికి తెలియచేయవలసినది. పాల్గొనదలచిన వారు ముందుగా అనుమతి పొందవలసిఉన్నది. అనుమతి కొరకు మీ పేరు, చిరునామ, వయస్సు, వృత్తి వివరాలతో సంప్రదించండి.

Southindiacell, Haridwar-249411. Ph : 01344-260602, 326950 Ext-180,
E-mail ID : south@awgp.org, gckhyderabad@yahoo.com

గాయత్రి చేతనాకేంద్రం హైదరాబాదునకు అనుమతిపొందిన వారి వివరములు తెలుపగలరు.

మీ
**అశ్విని సుబ్బారావు** *(ఆంధ్రప్రదేశ్ సంయోజకులు)*
*గాయత్రి చేతనాకేంద్రం, హైదరాబాద్*

**దుఃఖంవల్ల సంచిత పాపపు బరువు దిగిపోతుంది.**

# రాష్ట్రంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు

## వరంగల్‌లో

31.1.09 రోజు వసంతపంచమి సందర్భంగా వరంగల్ సెంట్రల్ జైల్‌లో (కేంద్ర) కారాగారంలో పంచకుండీ యజ్ఞం. జరిగింది. అందులో డి.ఎస్.పి. గిరిధర్ గారు, జైలర్ భాస్కర్ గారు, వారి సిబ్బంది యొక్క కుటుంబసభ్యులు ఈ యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ యజ్ఞాన్ని శ్రీ మారం సదానందం, శ్రీ గౌరిశెట్టి వెంకటేశ్వర్లు నిర్వహించారు.

## విశాఖపట్నంలో

గాయత్రి పరివార్ ప్రజ్ఞామండలి, విశాఖపట్నం వారు ప్రతి లక్ష్మీవారం గాయత్రీ యజ్ఞం, ప్రతి శనివారం సత్సంగం, సామూహిక జపం, సమస్యల పరిష్కారం నిర్వహిస్తున్నారు. ప్రతి సభ్యుని, జన్మదిన తేది, వివాహదిన తేది నోటుచేసుకొని, ఆయా తేదీలలో వారివారి ఇండ్లలో దీపయజ్ఞం నిర్వహిస్తూ, సంస్కారాల ఔన్నత్యాన్ని వివరిస్తూ, వారి ఇళ్లలో దేవస్థాపన చేసి యుగ సాహిత్యాన్ని జ్ఞాన ప్రసాదంగా పంచుతున్నారు. యుగశక్తి గాయత్రికి చందాదారులుగా గత సంవత్సరం 149 మందిని, ఈ సంవత్సరం ఇప్పటివరకు 40 మందిని చందాదారులుగా చేర్పించామని శ్రీ హేమచంద్రరావు తెలియచేశారు.

## ఒంగోలులో

31.1.09 వసంత పంచమి సందర్భంగా ఒంగోలు గాయత్రి అనుగ్రహ పీఠంలో వసంత పంచమి విశిష్టత, క్రాంతి ధర్మీ సాహిత్య ఆవశ్యకతను శ్రీమతి ఎల్. లక్ష్మీరాజగోపాల్ వివరించగా యజ్ఞ కార్యక్రమాన్ని శ్రీమతి వల్లి నిర్వహించారు. 120 మంది పాల్గొన్న ఈ కార్యక్రమం శ్రీమతి సీతా మహలక్ష్మిగారి పర్యవేక్షణలో జరిగింది.

## పెద గానుగపాలెం మండలంలో

24.12.08 పెదగానుగ పాలెం, అద్దంకి మండలంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ మలసాని వెంకటేశ్వర్లు, శ్యామలా దేవి, శ్రీదేవి, కోట లక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు వివాహ దిన సంస్కారాలు నిర్వహించబడ్డాయి. సిహెచ్.వి. సురేష్-శిరీష; ఎమ్. శ్రీనివాసరావు-అరుణ; కె. నాగేశ్వర రావు-అంజనీ దేవి. 132 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భీమలిలో

31.1.09 వసంత పంచమి సందర్భముగా దుర్గా గాయత్రీ శక్తి పీఠంలో ఉదయం 8-9 గంటల వరకు సామూహిక గాయత్రీ జపం, తర్వాత త్రికుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీమతి భారతి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. శ్రీ డా॥ చంద్ర శేఖర్ వసంత పంచమి విశిష్టత గురించి ప్రవచనం ఇచ్చారు.

## గుంటూరు, కృష్ణా జిల్లా
## గ్లోబల్ గాయత్రి మంత్ర పురశ్చరణ

విశ్వవ్యాప్తంగా ప్రతి నెలలో చివరి ఆదివారం (28.12.08)లో జరిగే గాయత్రీ మంత్ర సాధనలో భాగంగా గుంటూరు జిల్లా వైకల్లు గ్రామం, కుందుర్రు వారి పాలెం, గోళ్ళపాడు, వెన్నాదేవి, ఎల్. కూరపాడు, కళ్ళకుంట దేచవరం, పాలపాడు, రావి పాడు, ఉప్పలపాడు, లక్ష్మీపురం, సంతమాగులూరు, కారుమంచి, అడవిపాలెం, గంటావారి పాలెం, నరసరావుపేటలలో సామూహిక గాయత్రి జపం జరిగింది. కొన్ని గ్రామాలలోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులందరి చేత జపం చేయించటానికి ఉపాధ్యాయులు అంగీకరించారని బి. శివకుమారి నరసరావు పేట తెలియచేశారు. వీరి ప్రయత్నములు ఆదర్శప్రాయాలు.

## నారాకోడూరు

పూజ్యగురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినోత్సవం వసంత పంచమి నారాకోడూరు గాయత్రి శక్తి పీఠంలో 30.1.08 నుండి 1.2.08 మూడు రోజులు శ్రీ అశ్విని సుబ్బారావు-సంయోజకులు దక్షిణ భారత్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరిగింది. 250 మంది సాధకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మూడు రోజులలో 4000 మంది సందర్శకులు పాల్గొన్నారు. డా॥ శ్రీరామకృష్ణ తమ ప్రసంగాలతో మూడు రోజులూ సాధకులలో ఉత్సాహం నింపారు. ఈ సమయంలో యుగశక్తి గాయత్రి 211 మంది చందాదారులుగా చేరారు. 40,000 రూపాయల సాహిత్యవిక్రయం జరిగింది. "యుగ శక్తి గాయత్రి" చందాదారుల సంఖ్య 24,000 చెయ్యాలన్న సంకల్పం తీసుకొన్నారు. **హైదరాబాద్ నుండి ఐదుగురు కార్యకర్తలు "యుగశక్తి గాయత్రి" ని పోస్ట్ ద్వారా పంపిణీ బాధ్యత స్వీకరించారు. వీరు శ్రీ ఆర్. హనుమంతరావు, శ్రీమతి ఎ. శోభ, శ్రీ ఎమ్. ధనేష్ చంద్, శ్రీ విఠల్ కోటేశ్వరరావు, శ్రీ బి.ఎల్.ఎన్. మూర్తి.**

ఆరోగ్యవంతమైన శరీరం అన్నింటికన్న విలువైనది.

## అడవి మల్లంపల్లిలో

8.2.09 రోజు రాత్రి 7 గంటలకు అడవి మల్లంపల్లిలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయప్రాంగణంలో దీప యజ్ఞం జరిగింది. 9.2.09 రోజు ఉదయం 10 గంటలకు పంచకుండీ యజ్ఞం జరిగింది. ఈ యజ్ఞంలో శ్రీ వనమా సురేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ యజ్ఞానికి 250 మంది భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ మార్గం సదానందం, శ్రీ గౌరిశెట్టి వెంకటేశ్వర్లు నిర్వహించారు.

## పార్వతీపురంలో

విజయనగరం జిల్లా పార్వతీపురం సమీప గ్రామాలలో శ్రీ శంకరరావు గారు, శ్రీ ఆదినారాయణ, శ్రీ అగ్నిహోత్రి గార్ల ఆధ్వర్యంలో 4.1.09 నాడు నందిరానివలస గ్రామంలో, 28.1.09 నాడు నీసికావలస గ్రామంలో, 31.1.09 నాడు నరసిపురం గ్రామంలో, 5.2.09 నాడు తుంబాలి గ్రామంలో, 9.2.09 నాడు పిప్పలబద్ర గ్రామంలో పంచకుండీ గాయత్రి యజ్ఞాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలందు 8000 రూపాయల సాహిత్య విక్రయం, 30 మందిని యుగశక్తి గాయత్రికి చందా దారులుగా చేర్పించటం ముదావహం.

## కరేడులో

23.1.09 నుండి 31.1.09 వరకు 9 రోజులు గాయత్రీ నవరాత్రులు నిర్వహింపబడ్డాయి. ప్రతిరోజు 20 మంది ఒకగంటసేపు సామూహిక జపం చేయడం జరిగింది. 1.2.09 నాడు పూర్ణాహుతిగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. నవరాత్రుల చివరిరోజున గురుదేవుల అష్టోత్తర శతనామావళిని ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు పారాయణ చేయడం జరిగింది. పూర్ణాహుతి రోజున ఏడుగురు చిన్నారులకు అక్షరాభ్యాస సంస్కారం జరిగింది. శ్రీ శ్రీనివాసరావు, శ్రీమతి రేవతి కరేడు గాయత్రీ పరివార సభ్యుల సహకారంతో కార్యక్రమం నిర్వహించారు.

## షిర్డిలో

జనవరి నెలలో 9 రోజులపాటు 2400 మంది సాధకులతో సాధనా శిబిరం నిర్వహించబడింది. పూర్ణాహుతిగా 324 కుండాలతో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. శాంతికుంజ్ నుంచి శ్రీ వీరేశ్వర్ ఉపాధ్యాయ్, శ్రీ కాళీచరణ్ జీ, శ్రీ శారద్ పర్థీజీ, శ్రీ గౌర్‌జీ, డా॥ ఆర్.కె. పాల్గొన్నారు. 3 రోజులపాటు రక్తదాన శిబిరం జరిగింది. సుమారు 7 లక్షల రూపాయల సాహిత్య విక్రయంతోపాటు 3000 మంది "అఖండజ్యోతి" చందాదారులుగా చేరారు.

# అందరికీ ఆహ్వానం

## గాయత్రీ-వాజపేయి మహాయజ్ఞము మరియు శ్రీ మహాసత్రయాగములు

21-04-09 నుండి 11-05-09 వరకు కర్నూలు జిల్లా మంత్రాలయంలోని **శ్రీ శాంతిధామ వృద్ధాశ్రమప్రాంగణంలో** 508 హోమకుండాలతో విశ్వశాంతికొరకు గాయత్రీ-వాజపేయి మహాయజ్ఞము మరియు శ్రీ మహాసత్రయాగములు నిర్వహించుటకై నిర్ణయించినారు.

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం ।
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ॥

భావం : ప్రాణస్వరూపమైన, దుఃఖనాశకమైన, సుఖస్వరూపమైన, పాపనాశకమైన, దేవస్వరూపమైన, శ్రేష్ఠమైన, తేజస్సుగల పరమాత్మను మేము అంతరాత్మలో ధరించెదము గాక ! ఆ పరమాత్మ మా యొక్క బుద్ధిని సన్మార్గమువైపు ప్రేరేపించును గాక !

పై మహాయజ్ఞములు భక్తప్రహ్లాదుడు, శ్రీవ్యాసరాయలు మరియు శ్రీ రాఘవేంద్రస్వామి వార్ల తపశ్శక్తితో వరుసగా మూడు కాలములలో పునీతముకాబడి శక్తిపాతము నొందిన మంత్రాలయము తీర్థస్థలి-కర్నూలుజిల్లా-ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింపబడుచున్నది.

సనాతనధర్మ సేవాసంస్థ మిట్టదొడ్డి గ్రామము-గట్టు మండలం-గద్వాల్ తాలూకా- మహబూబ్‌నగర్ జిల్లా వారి ఆధ్వర్యములో, గాయత్రీతీర్థ్ శాంతికుంజ్ హరిద్వార్ వారి సారథ్యములో, గాయత్రీ చేతనా కేంద్రము, మూసాపేట, హైదరాబాద్ వారి పర్యవేక్షణలో, రాయలసీమ రీజినల్ గాయత్రీ పరివార్ సహకారముతో పై మహాయజ్ఞములు ప్రారంభంకానున్నవి.

**కావున దేశ, జాతి, కుల, మత, లింగ, వయోభేదములు** లేకుండా ప్రజలందరూ సామూహికముగా ఈ యజ్ఞములలో పాల్గొని యజ్ఞఫలితములను పొందవలసినదిగా కోరుచున్నాము.

ఇట్లు
**యజ్ఞ ఆహ్వానసమితి**

**కష్టాలూ, ఆటంకాలూ లేకపోతే-మనిషిలోని క్రియాశీలత, కౌశల్యం, చైతన్యం నశించిపోతాయి.**

# భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్ష-2008

భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష 2008 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతట నిర్వహించబడింది. ఈ సంవత్సరంలో శ్రీకాకుళం, కృష్ణా, విజయనగరం, నల్గొండ లలో మినహా తక్కిన అన్ని జిల్లాలలో జయప్రదంగా నిర్వహించబడింది. మొత్తం విద్యార్థులు సుమారుగా 60 వేల వరకు ఈ పరీక్షలో పాల్గొన్నారు.

| జిల్లా | విద్యార్థుల సంఖ్య | సహకరించిన వారు |
|---|---|---|
| 1. హైదరాబాదు<br>2. రంగారెడ్డి<br>3. మెదక్ | 19000 | 1. శ్రీ బి.హనుమంతరెడ్డి, 2. శ్రీ సంతోష్ శర్మ, 3. శ్రీ రాకేష్ రావు, 4. శ్రీ జగత్ దాస్, 5. శ్రీ సంతోష్, 6. శ్రీ ప్రతాపరెడ్డి, 7. శ్రీ పి.ఎన్.సురేష్ కుమార్ |
| 4. వరంగల్ | 13000 | 1. శ్రీ పి.ఎన్. శ్రీ సురేష్ కుమార్, 2. శ్రీ రవీందర్ గారు |
| 5. మహబూబ్‌నగర్ | 2200 | శ్రీ బి. వేమసుదర్శన్ రెడ్డి |
| 6. కరీంనగర్ | 2400 | 1. శ్రీ గంగారామ్ ఆడెపు, 2. శ్రీ పులిసత్యనారాయణ |
| 7. ఆదిలాబాద్ (మంచిర్యాల) | 800 | శ్రీ రాజబాబు.కె. |
| 8. నిజామాబాద్ | 120 | శ్రీమతి విజయశ్రీ |
| 9. ఖమ్మం (అశ్వాపురం-మణుగూరు) | 800 | శ్రీమతి కె.వి.కె.సింగ్ |
| 10. విశాఖపట్నం | 90 | శ్రీమతి కె. సౌజన్య |
| 11. తూర్పుగోదావరి | 400 | శ్రీ పి.రామకృష్ణారావు |
| 12. పశ్చిమగోదావరి | 63 | శ్రీమతి జోస్యుల ప్రకాశ్ |
| 13. గుంటూరు | 2189 | శ్రీశాంతారావు (జిల్లా కన్వీనర్) |
| 14. ప్రకాశం | 9000 | 1. శ్రీ వి.సుబ్బారావు (జిల్లాకన్వీనర్), 2. శ్రీ అంజనీకుమార్ (గిద్దలూరు) 3. శ్రీ వై.సత్యనారాయణరెడ్డి(మార్కాపూర్) |
| 15. నెల్లూరు | 5000 | శ్రీమతి భువన.జె. (జిల్లా కన్వీనర్) |
| 16. చిత్తూరు (తిరుపతి) | 3700 | 1. శ్రీ జయరాంరెడ్డి (జిల్లాకన్వీనర్), 2. శ్రీమతి మునిలక్ష్మమ్మ (జిల్లాసెక్రటరీ) 3. శ్రీ చంద్రశేఖర్ (పురుషోత్తమపట్నం) |
| 17. అనంతపూర్ | 550 | 1. శ్రీమతి అరుణకుమారి (జిల్లాకన్వీనర్), 2. శ్రీ సి.వి. రమణ |
| 18. కడప | 315 | శ్రీ విజయభాస్కర్ రెడ్డి |
| 19. కర్నూలు | 280 | 1. శ్రీ పి.నారాయణ రెడ్డి (జిల్లాకన్వీనర్), 2. శ్రీ టి.కె.విశ్వనాథం |

*పరీక్ష నిర్వహణలో సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.*

*బి. హనుమంతరెడ్డి కన్వీనర్. ఫోన్ : 9440722860, 65520133*

# భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్ష 2008

2008 నవంబర్ లో జరిగిన భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం తేది 8.3.09 ఆదివారం నాడు జరుగును. ఆ రోజు ఉదయం 10 గంటలకు భారతీయ సంస్కృతీ పరీక్షల యొక్క రాష్ట్ర సభ్యులు, జిల్లా కన్వీనర్లు ఈ పరీక్షకు సహకరించిన గాయత్రి కార్యకర్తలకు వర్క్ షాప్ నిర్వహించబడును. సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానోత్సవం జరుగును. అందరూ సమావేశములో పాల్గొని జయప్రదం చేయగలరని మనవి. ఏదైనా వివరాలు కావలసినచో ఈ క్రింది ఫోను నంబర్లతో సంప్రదించగలరు.

*కార్యస్థలము : వివేకానంద డిగ్రీకళాశాల పి.ఎన్.యమ్ ఉన్నత పాఠశాల), కుక్కట్‌పల్లి(బి.జె.పి. ఆఫీస్ ఎదురుగా)*

*బి. హనుమంతరెడ్డి. కన్వీనర్. భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్ష ఫోన్.నం. 9440722860, 65520133, 9959725403*

**కష్ట కాలంలో మిత్రులు-ధైర్యం, సాహసం, ప్రయత్నం.**